సృజన

నవంబర్ / డిసెంబర్ 1983

145 / 146



నిర్వహణ

సాహితీ మిత్రులు

ఈ సంచిక రు. 3

సంవత్సర చందా రు. 20

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

145/146 మాసపత్రిక నవంబర్/డిసెంబర్ 1983

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Prited, Edited & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu' Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 002 for Venkataramana Mudranalayam, Warangal

ఏది హింస? ఏదహింస?

1970లలో కలకత్తానగరంలో నక్సలైట్లు విగ్రహ మహాత్ముల విధ్వంసన చర్యలు కొన్ని చేసారు. ఆనాడు, ఈనాడుకూడ నక్సలైట్లకు భారత రాజ్యాంగంలో గానీ, చట్టాల్లోగానీ విశ్వాసంలేదు. అందులో రహస్యమూలేదు.

1980 లలో ఆంధ్రప్రదేశ్ అంతటా పోలీసులు నక్సలైట్ అమరుల స్థూప విధ్వంసనకు పూనుకుంటున్నారు. కరీంనగర్ జిల్లాలోని గూడూరులో రవి స్థూపాన్ని ఆదిలాబాదుజిల్లా బెల్లంపెల్లిలో గంగారామ్, పెద్దిశంకర్ స్థూపాన్ని, నిజామాబాదుజిల్లా గిర్దిలో రాంచందర్ స్థూపాన్ని, పోలీసులు కూల్చేసారు. వీళ్ళలో పెద్దిశంకర్‌ను పోలీసులు 'ఎదురుకాల్పుల' పేర చంపేసారుకూడ.

ఇటీవల కరీంనగర్ జిల్లా కుక్కలగూడూరులో భూమయ్య, కిష్టాగౌడ్ మొదలైన ఆదిలాబాదు, కరీంనగర్ రైతాంగ పోరాట మృతవీరులకోసం కట్టిన స్థూపాన్ని పోలీసులు నేలమట్టంచేసారు, 'నక్సలైట్లకు చట్టంలో విశ్వాసంలేదు. మాకువున్నది. మేము చట్టానికి జవాబుదారీ' అంటాడు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు.

'గుడ్డు పగలగొట్టందే ఆమ్లెట్ తయారుకాదు' అన్న గతితార్కిక భౌతిక వాద సూత్రాన్నికూడ ఆయన ఆమ్లెట్ కోసం ఆశ్రయించక తప్పలేదు,

డీజిపి, ఆయన పోలీసుబలగం కాపలాకాస్తున్న పాలకవర్గాలకు ఆమ్లెట్లు, చికెన్లు, మేడలు, మిద్దెలు, బ్రాందీ, విస్కీలు, బ్యాంకుబ్యాలెన్సులు, మిల్లులు, నల్లధనం, భూములు కావాలి- వాటికొరకు గుడ్డుదేంకర్మ కష్టజీవుల నడ్డివిరగ్గొట్టకతప్పదు, వాళ్ళ వీపుమీదనేకాదు వాళ్ళ కడుపుమీదకూడ కొట్టకతప్పదు. ఇదేంన్యాయమని ప్రశ్నిస్తే గుండుకూడ పగలకొట్టగలరు. నడుస్తున్న చరిత్ర అదే.

కోట్లాది కష్టజీవులకు ఆమ్లెట్ల కోరికలేదు, కనీసం బతికి కష్టంచేయడానికి, కష్టంచేసి బతకడానికి సరిపోయే అన్నంకావాలి. అది ఐదురూపాయల కూలిరేటయినా లేకుండా వస్తుందా? దినమంతాకష్టంచేసి తాగకతప్పని సారారేటు నాలుగున్నరవుతే వస్తుందా? దున్నుకోవడానికి బారెడు నేలచెక్కయినా లేకపోతే వస్తుందా? రాళ్ళు పిండి నీళ్ళుతీయడానికైనా సిద్ధమైనచేతులకు పనిలేకపోతే వస్తుందా? ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం, అన్నిటికన్నమించి ఉత్పత్తులు పోగులుపోస్తున్న పేగుల

నకనకలు. ఆరాటపడితే మూల్గితే, అరిస్తే. పోరాట దారిపడితే అది హింసఅంటుంది వ్యవస్థ.

ఈ ప్రభుత్వం సంజయ్‌గాంధీని సంతోషపెట్టటానికి టర్క్‌మన్ గేట్ ఆవాసాలపై బుల్‌డోజర్లు తోలుతుంది. సామ్రాజ్యవాద ప్రతినిధుల కనుల పండుగకోసం గోవాలో గుడిసెలు పీకేస్తుంది. కాని ప్రజలు బంచరాయిలో పంటలు పండించుకున్నా సహించదు. పరంపోగుల్లో పొరందున్నుకున్నా సహించదు. ఊళ్ళు బెగ్గంపాడుచేసి చేస్లు, పొలాలు ధ్వంసంచేసి ప్రజలు దౌర్జన్యానికి పూనుకున్నారని ప్రకటిస్తుంది,

రోజురోజుకూ పెరుగుతున్న అసమానతలను మించిన హింస ఏముంది ఈ సమాజంలో.

అధికారాన్ని అణచివేతకు, తుపాకీని కాల్చివేతకు, శాసనాన్ని పేదప్రజల ఉసురు పోసుకోవడానికి, సంస్కృతిని దాస్యభావానికి పర్యాయపదాలుచేసి ప్రజలకు చెట్టునీడా, నేలపట్టుకూడ లేకుండాచేసినపుడు ఈ భూమివొడిలోతప్ప జనం ఎక్కడ తలదాచుకుంటారు? అయినా ఎన్నాళ్ళు తలదాచుకుంటారు? తలఎత్తి తిరగబడితే, మట్టిలోచిందిన నెత్తురు మంటలై వెలుగుచిమ్మితే అది కల్లోలం.

ఆ కల్లోలాన్ని అణచడానికి కోట్లకోట్ల రూపాయల కేంద్రసహాయంకావాలి. బెటాలియన్ల సిఆర్పీ దళాలుకావాలి. భూమితో, వేతనాలతో, కూలిరేట్లతో, కనీస అవసరాలతో సంబంధంలేకుండా శాంతిభద్రతల సమస్యను లాఠీలు తూటాలు జైళ్ళు పరిష్కరించాలి. పోనీ అట్లా పరిష్కారమైన దాఖలాలు ఎక్కడైనా వున్నాయా? బీడీవెలిగించుకోవడానికి అగ్గిపెట్టె అడిగినవాణ్ణి చెప్పుతోకొట్టగలవు. ఎందుకుకొట్టావని అడిగినవాణ్ణి పొడిచిచంపగలవు. హత్యకు పురికొల్పిన నీ పిరికితనంనుంచి నువ్వు రక్షింపబడగలవా? పోలీసుస్టేషన్‌లో దాహంఅడిగినవానికి మూత్రం తాగించేవాడు, ముడ్లోకర్రదూర్చి అదే నోట్లోపెట్టేవాడు ప్రమోషన్లు తెచ్చుకోగలడేమోకానీ మనిషి అనిపించుకోగలడా?

పాలకవర్గాల ఈ చర్యలు ప్రజల్లో పెంచగలిగేది అసహ్యమూ, ద్వేషమూ, కసేతప్ప సామరస్యం కాదు, ఆకలేసి ఏడ్చిన పసిపాపను కన్నతల్లి అయినాసరే కొట్టి ఏడ్పును ఆపగలదేమోకానీ ఆకలిని పోగొట్టలేదుగదా.

ప్రజలు పసిపాపలూకారు. ప్రభుత్వం కన్నతల్లీకాదు. వర్గసమాజంలో ప్రభుత్వాలు సంస్కరణ సాధనాలు కావు, అణచివేత పనిముట్లు. ఈ పనిముట్లు శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నాయంటే దోపిడీవర్గాల శాంతికోసం, దోపిడీవర్గాల భద్రత గురించి ప్రజల బ్రతుకుల్ని అశాంతికి, ప్రమాదానికీ గురిచేస్తున్నాయన్నమాట.

కిష్టాదిగూడెంలో హత్యజరిగితే అనుమానితులందరినీ బట్టలువొలిచి పోలీసు క్యాంపుల్లో రోజుల తరబడి నిర్బంధించి వాతలుపెట్టి, సూదులుగుచ్చి, చిత్రహింసలకు గురిచేసి జైలుకు పంపుతారు రామపురంలో హత్యజరిగితే పోలీసులు హంతకులను పట్టుకోవడానికి కాదు, హత్య చేయబడవలసివుండిన హతుని సోదరుడు తమ్ముని అంత్యక్రియలు చూడడానికి వస్తాడేమో పట్టుకుందామని వస్తారు. పోలీసు క్యాంపులు పెట్టి హంతకుల ఆత్మరక్షణకు తుపాకులిస్తారు.

కనుక రెండు హత్యలనూ హత్యలనే పేరుతోనే పిలవవచ్చా ? చట్టంముందు అందరూ సమానమేనని చెప్పుకునే అంధధర్మదేవత త్రాసు ఎంతన్యాయవివక్ష చూపుతున్నదో చూడకపోవడానికి మనకు కళ్ళులేకపోవాలి. లేదా ఇష్టమైనాలేకపోవాలి.

హంతక వ్యవస్థ మాత్రమే వ్యక్తులనైనా, సంస్థలనైనా బలప్రయోగానికి రెచ్చగొడుతుంది. కలం అబద్ధంరాయడానికీ, కంచెచేసును మేయడానికీ అయితేకలాన్ని విరిచెయడానికీ, కంచెను తుంచేయడానికి ప్రజలను ఎవరూ చెప్పక్కర్లేదు. ఎంత ఉద్రేకపరచే ఉపన్యాసమూ, నినాదమూ, పాటా ఆకలి, అన్యాయం అణచివేతలేని చోట ఆగ్రహాన్ని రగల్చలేవు. పీడన పీడితుణ్ణి రెచ్చగొడుతుంది. అణచివేత అణగారిన బూడిదలో నిప్పుకణికలను రగిలిస్తుంది.

అయితే ఈ పాఠాలను స్పార్టకస్ కాలంనుంచి నేటిదాకా యజమానులు నేర్చుకోకపోవడం వింతకాదు. నేర్చుకున్నా సాగినంతకాలం దోపిడీ కొనసాగాలంటే స్వార్థం అణచివేతద్వారా తప్ప మనలేదు.

సారా కంట్రాక్టర్‌కు లాభాలు రావాలంటే ప్రజలు సారా తాగాల్సిందే. ప్ర.సా.దులోని సారాఅయినా ప్రభుత్వంతాగదు, పోలీసులు పైసలిచ్చితాగరు. ప్రజల్ని తాగేట్లు చేయాలంటే ప్రభుత్వాలు కావాలి, పోలీసులుకావాలి. ఈ ప్రభుత్వాలు,

పోలీసులు లేకుండా సారా తాగే ప్రజల దగ్గరికి సారా పోగలిగితే ఇంక కాంట్రాక్టర్లు ఎందుకు ? ఆబ్కారీశాఖ ఎందుకు ? లాభం అనేది ప్రయోజనాన్ని ప్రేరేపించకపోతే ఇంకా లాఠీతో తూటాతో పనేముంది ?

భూమినీ, సంపదనూ, ఆస్తులనూ ప్రజలపరంచేస్తే యజమానులకూ రక్షణే అక్కర్లేదు. కాని వాళ్ళు అప్పుడు యజమానులూ కారు. భూమి మాత్రమే కాదు, భూమిలో చిందిన ప్రజల రక్తంకూడ తమ గాదెల్ని నింపాలనుకున్నపుడు సిఆర్పీని దించాల్సిందే. చాలకపోతే మిలటరీని దించాల్సిందే.

ఈ ఎపిఎస్పి, సిఆర్పీ వగైరా పోలీసుబలగాలకు తిండికావాలి. ఈ తిండిని ఎవరు పండిస్తారు ? మల్లారెడ్డిపెల్లిలో పంటలు పీకేసినవాళ్ళు ఎన్నడైనా నాట్లువేసి, కలుపుతీసి పంటలుపండించారా ? నిజానికి వాళ్ళంతా అటువంటి కష్టజీవుల కుటుంబాల నుంచి వచ్చినవాళ్ళే. వాళ్ళు పీకేసినపంటలు వాళ్ళ అయ్యలు, అమ్మలు, అన్నలు, అక్కలు, తమ్ములు, చెల్లెళ్ళు కండరాలుకరిగించి పండించినవే. పీకేయించిన అధికారి దొరగానూ పొలంలోవంగినవాడుకాదు, పోలీసుదొరగానూ పొలంలో వంగినవాడుకాదు. డిజిపిగారయినా గుడ్డు పగలగొట్టగలదేమోకాని ఆమ్లెట్ చేయాలంటే ఆర్డర్లీ రావలసిందే.

మనుషుల్లో కొందరినైనా యంత్రాలుగా, లాఠీలుగా, తూటాలుగా, పశువులుగా, పావులుగా వాడుకోగలిగినంతకాలమే పాలకవర్గాల పబ్బం గడుస్తుంది. మనుషులు మానవస్వభావాన్ని, మానవశక్తిని వర్గపోరాట చైతన్యంతోగుర్తించే పరిణామం గుణాత్మకస్థాయికి చేరినపుడు ఏశక్తీ విప్లవఉప్పెననాపలేదు. ఆస్థాయి పెరిగేక్రమంలో పోరాటం రాటుదేలుతున్నదిగనుకనే నిర్బంధాలు, అణచివేత తమ ఆఖరి ప్రయత్నంగా తమ అత్యంత నగ్న క్రౌర్యరూపాన్ని ప్రదర్శిస్తుంటాయి. చరిత్ర నిర్మాతలైన ప్రజలు తమ చరిత్రనొకసారి సమీక్షించుకుంటే ఈ సత్యమే వాళ్ళకు శక్తినిస్తుంది.

25-11-83 — సంపాదకుడు

విప్లవ సాహిత్యం :

తెలుగు సాహిత్యంలో స్తబ్ధత ?!

స్తబ్ధత అంటే సమాజం. తన అన్నిరంగాలలో సమస్త అంగాల ద్వారా ముందుకు వెళ్ళవలసిన అవసరం ఉన్నప్పుడుకూడా వెళ్ళలేనిస్థితి. సమస్యలుండీ సాహసంగా ఆలోచించి పరిష్కారాలు వెదుక్కోలేని స్థితి.

రష్యాలో కమ్యూనిస్టుపార్టీ 20 వ మహాసభలో కృశ్చేవ్ 'శాంతియుత సహజీవనం' సిద్ధాంతం వచ్చిన తరువాత ఈస్థితి తాత్కాలికంగా ప్రపంచం అంతా ఏర్పడింది. వర్గపోరాటం స్థానంలో శాంతియుత పరివర్తనం సాధ్యమనే సిద్ధాంతం ప్రతిపాదింపబడటంతో ఒక గందరగోళస్థితి ఏర్పడి ఒక దశాబ్దంపైగా, సామాజిక ప్రగతిలో స్తబ్ధత ఆవరించింది.

తెలుగు సామాజిక, సాహిత్యరంగాలకు సంబంధించినంత వరకు ఈ రివిజనిస్టు సిద్ధాంతం ఫలితంగానే ఇటు తెలంగాణ విమోచనోద్యమం విరమింపబడటం అటు అరసం, ప్రజానాట్యమండలి వ్యాపార, పాలకవర్గాల సంస్కృతిని ఆశ్రయించటం జరిగింది. తెలంగాణ విమోచనోద్యమకాలంలో మట్టినుండి తవ్వితీసిన మాణిక్యాలవంటి కళారూపాలను వ్యాపార, సినిమా సంస్కృతికి పెట్టుబడిగా బలిపెట్టడం జరిగింది.

తెలంగాణ విమోచనోద్యమం విరమణ తర్వాత, దిగంబరకవుల ఆవిర్భావం వరకు తెలుగు సాహిత్యంలో రివిజనిజం ప్రభావంలో ఘనీభవించిన ఈ స్తబ్ధత మనక్కనిపిస్తుంది. ఐతే ఈ 13 ఏళ్ళలో సాహిత్యం రానేలేదా ? తెలుగునాట ఆలోచన సన్నగిల్లిందా ? సృజనాత్మకతకు సెలవు ప్రకటించబడిందా ? అంటే అలాంటిదేమీలేదు. వీటన్నిటికి ఉద్యమస్వభావం లేదన్నదే సమాధానం.

రచనాకాలాలు ఎప్పటిపైనా తెలుగులో ఉత్తమ రాజకీయ నవలలు వచ్చిన కాలమిదే. తెలంగాణ విమోచనోద్యమానికి సంబంధించిన ఉత్తమ నవలలు కూడా ఈ కాలంలోనే వెలువడ్డాయి. తెలంగాణపై వచ్చిన మధ్యతరగతి కవిత్వం పుస్తకరూపంలో తెలంగాణపోరాట విరమణ కాలంలోనే వచ్చింది. కనుక అచ్చయిన తేదీల యాంత్రికవిశ్లేషణ చేస్తే ఈకాలం సాహిత్యంలో స్తబ్ధత ఉందన్నవాదనసుకూడా కొట్టివేయవచ్చు. కానీ ఒకఉద్యమ ప్రతిస్పందనగా ఉత్తేజ, ఉద్వేగాలతో వెలువడి ఆ ఉద్యమాల్ని ముందుకు తీసుకవెళ్ళి, ఆఉద్యమంతోపాటు ముందుకుపోయిన సాహిత్యం

వచ్చే అవకాశం ఈకాలంలో సామాజిక, సాంస్కృతిక నేపథ్యంలో లేదనేదే యిక్కడ గ్రహించవలసిన విషయం. వస్తుగతమైన ఉద్యమస్వరూపం లేకపోవడంవల్ల సాహిత్య, సాంస్కృతిక రంగాలలో రూపవాదం ముందుకొచ్చింది. కవిత్వరంగంలో 'ఫ్రీవర్స్' కోసం ప్రారంభం ఏర్పడేదాకా ఈ వాదాన్ని సాగదీయడం కథ, నవలల రంగాలలో 'చైతన్యస్రవంతి' వంటి విలాయితీ భావజాలం, నాటకరంగంలో 'టెక్నిక్'పై మోజుతో జరిగిన ప్రయోగాలు ఈ కాలంలోనే వచ్చాయి. సాహిత్య విమర్శలో, సామాజిక దృక్పథంలో శ్రీశ్రీ, కొ.కు, కెవిఆర్ అట్లాగే కవిత్వంలో కెవిఆర్, సి.వి, మార్క్సిస్టు చైతన్యంతో రచనలు చేసినప్పటికీ 1955 లో అరసాన్ని మళ్ళీ బ్రతికించడానికి కెవిఆర్, తుమ్మల వెంకటామయ్య చేసిన ప్రయత్నాలు విఫలంకావడం, ఆనాటి భౌతికపరిస్థితుల్లో ఈ అవగాహనకు ఉద్యమస్వభావం లేదనే విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి. కమ్యూనిస్టుపార్టీ పార్లమెంటు రాజకీయాల్లో కూరుక పోయింది. అరసం అకాడమీలో, వ్యాపారంలో, సామరస్యధోరణుల్లోప్రవేశించింది. ఆకాలపు సాహిత్యానికి ఉద్యమప్రణాళిక, లక్ష్యం లేకుండాపోయింది.

"అభ్యుదయకవుల ధర్మమా అని వర్గచైతన్యం గురించి పాడితేనేతప్ప మిగ తావి కవిత్వం కాదేమోనన్న అపోహ ఆంధ్రదేశంలో అనవసరంగా ఊపిరి పీలుస్తోంది" అనుకున్నరోజులివి. 'ఉదయించని ఉదయాలు' ఇవి. ఏదో ఒక అసహనం, ఏదోఒకకసితో 'తిరుగుబాటుదారుల మీదకూడా తిరుగుబాటు' చేయాలని ప్రకటించుకోవడమేగాని ఆ తిరుగుబాటు ఎందుకో, దాని స్వరూప స్వభావాలేమిటో తెలియనికాలంఅది. తిరగబడి పాతనికూలతోసి, కొత్తగా ఏంనిర్మించాలో తెలియని అస్పష్టతఅది. అసలు ఎప్పుడో బతికినదినాలలో తిరుగుబాటుకు నాయకత్వం వహిం చిన వాణ్ణి ఇంకా తిరుగుబాటుదారుడనడంలోనే ఈ దశాబ్దపు అగమ్యగోచరత్వం కనబడుతుంది.

1952-65 కాలంలో ఇందువల్ల స్తబ్దత నెలకొనిఉన్నదంటున్నాం. ఇలా రూఢ్యర్థంవచ్చిన స్తబ్దతఅనే మాటకు ఇవాళ చాల విచిత్రమైన నిర్వచనాలు ప్రస్తుత పరిస్థితిని స్తబ్దతఅని నిరూపించడానికి ప్రయత్నిస్తున్నారు. 'అతివాదం స్తబ్దతయొక్క ఒకరూపమే' అన్నదగ్గర మొదలుపెట్టి 'ఉన్నస్థితిని మార్చుకోకపోవడం (inertia) స్తబ్దతే' అన్నంతవరకు విస్తృతమైన నిర్వచనాలుఇచ్చి ప్రస్తుతస్థితి స్తబ్దతఅంటు న్నారు. ఐతే 1952-65 కాలంలో అభ్యుదయ సాహిత్యోద్యమ క్షీణతేకాని అతి వాదమో, ఉన్నస్థితిని మార్చుకోకపోవడమోలేదు.

కాని ఇవ్వాళటి సామాజిక, రాజకీయ పరిస్థితులు ఇందుకు గుణాత్మకంగానే భిన్నమైనవి. 1967 లో నక్సల్‌బరీలో రైతాంగపోరాటం ప్రారంభమయింతర్వాత విప్లవోద్యమంలో ఎగుడుదిగుళ్ళుండవచ్చుగాని పార్లమెంటరీరాజకీయాలకు ప్రత్యామ్నాయంగా ప్రజారాజకీయాలు నిర్మాణరూపాన్నిపొంది కొనసాగుతున్నాయి. నూతన ప్రజాస్వామిక విప్లవం లక్ష్యంగా రాజ్యాధికారంపై స్పష్టమైన దృష్టితో ప్రజలు పోరాటాలు చేపడుతున్నారు. ఈ పోరాటంలో గెలుపు - ఓటములు ఉండవచ్చుగాని, అవగాహనలో లోపాలుండవచ్చుగాని స్తబ్ధతలేదు. 1952-65 మధ్యకాలంనాటి వర్గ సామరస్య రాష్ట్ర ధోరణులు లేవు. తమకు గిట్టని ఎత్తుగడలకు విమర్శకులు పేరుపెట్టిన అతివాదం. వాళ్ళకు దుస్సాహసమనిపించే సాహసముండవచ్చుగాని స్తబ్ధత మాత్రం లేదు. ఈ 15, 16 సంవత్సరాల గ్రామీణ భారతం సంచలనాత్మకంగావున్నది. ఈ సంచలనం సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోను ప్రతిఫలిస్తున్నది. ముఖ్యంగా ఎమర్జెన్సీ తర్వాత విస్తృతమైన ప్రజాప్రాతిపదికపై ఆదిలాబాద్, కరీంనగర్ రైతాంగ పోరాటాలు ప్రజాపంథాలో పెల్లుబికిన తర్వాత సాహిత్య సాంస్కృతికరంగాలలో నూరు పూలు వికసించినవి. పోరాటంలో ప్రజాకోర్టులు, సాంఘిక బహిష్కరణలు వంటి పోరాటరూపాలవల్లనే ఎన్నో కళారూపాలు వెలసినవి. శ్రీకాకుళ రైతాంగ పోరాటంలో వెంపటాపుసత్యం 'కండబిగువు కలిగినట్టి కొండజాతివీరున్ని' కదిలిస్తే అక్కడి సంప్రదాయాలలోని కళారూపాలు కూడా నిదురలేచినవి. పాణిగ్రాహి జముకుకథ తెలంగాణా వారసత్వాన్ని అందుకున్నది. ఆ విప్లవ వారసత్వాన్ని తిరిగి తెలంగాణాకు నరుడో - భాస్కరుడా అందించింది. జనసేన, చెరబండరాజు, గద్దర్, అంజయ్య, వంగపండు, అల్లంవీరయ్య మొదలైనవారు ఇంకెందరో ఆదిలాబాద్, కరీంనగర్ రైతాంగ పోరాటంలోని కవులు ఈ ప్రజాకళారూపాలను సుసంపన్నం చేస్తున్నారు. సాహిత్యాన్ని వ్యాపార వారపత్రికల్లో వెదుక్కొనే మధ్యతరగతి మనస్తత్వానికి పాటలోను, ఇతర ప్రజాకళారూపాల్లోను ఒక్కమాటలో సాహిత్య, సాంస్కృతికరంగాల్లోని మౌఖికసంప్రదాయంలో వచ్చిన పరిణతి వైవిధ్యం అర్థంకావడంకష్టం. ప్రజల పోరాటరూపాలవల్లనే ప్రజలభాష ఒకటి విప్లవ సాహిత్యానికి కొత్తప్రాణాన్ని తెచ్చింది. పాటలోని మాండలికం గానమాధుర్యంలో కలిసిపోతే- మాటలోని మాండలికం ఎంతో చర్చకు దారితీసింది. విప్లవోద్యమంతో సంబంధంలేకుండా మాండలిక భాషలో రచనలు వచ్చిననాడు మెప్పు (patronising) గా ప్రశంసించిన పత్రికలు. సాహిత్య విమర్శకులు విప్లవోద్యమంలో విడదీయరాని విధంగా కరీంనగర్, ఆదిలాబాద్ భాషల్లో కథలు, నవలలువస్తే సందేహాలు, విమర్శలు ప్రారంభించారు ఎన్నడూ లేనంతగా

భాషా వ్యక్తీకరణపై చర్చ ఈనాడు సాగుతున్నది. ఈ చర్చలో భాషా సాహిత్యవేత్తల కన్నా పాఠకులు ఎక్కువగా పాల్గొంటున్నారు. అంటే ఇదివరకెప్పుడూ లేనంతగా విప్లవోద్యమంలోని ప్రజలు సాహిత్యాన్ని తమ చేతిలోని పనిముట్టుగా, ఆయుధంగా భావిస్తున్నారు. దాన్ని ఉపయోగించే ఒడుపు నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పోరాటంలోని ప్రతిదశనూ చిత్రించే నవలలు - కథలూ వస్తున్నాయి. విషయంపట్ల స్పష్టత, నిర్దిష్ట అవగాహన ఉన్నచోట జీవితాన్ని, జీవితంలోని వైరుధ్యాలను వైవిధ్యాన్ని చూపాలనే పరిశీలన, విశ్లేషణ కనిపిస్తున్నాయి. రచనావిధానంలో పరిణతి పెరిగింది. ఈ కృషి నాటకరంగంలో ఇంకా తీవ్రంగా జరగాల్సిఉన్నప్పటికి నక్సల్‌బరి తర్వాత 75 దాకా వచ్చిన సాహిత్యాన్ని ఎమర్జన్సీ తర్వాత వచ్చిన సాహిత్యాన్ని ఒక్కసారి పరిశీలిస్తే ఇది అర్థమవుతుంది. విప్లవోద్యమం గద్దర్, వంగపండు ప్రసాదరావు, అల్లంరాజయ్య, సాహు వంటి నవయువ రచయితలను తానుగా సృష్టించడమే కాకుండా శివసాగర్, చెరబండరాజు వంటి కవులకు కొత్త ఊపిరిని కొత్త అర్థాన్ని ఇచ్చి శ్రీశ్రీని మృతప్రాయమైన అరసం నుంచి కాపాడి బ్రతికించి మహాప్రస్థానం సంప్రదాయంలో నిలబెట్టింది. "ఊగరా ఊగరా" వంటి పాటలు రాయించింది. ఒక్క తిలక్ తప్ప ఒకటి, రెండు గేయాల్లో అజంతా తప్ప ప్రదర్శించలేని వ్యక్తీకరణలు గల వచనకవితలు విప్లవోద్యమంలో వందలువచ్చాయి. విప్లవోద్యమానికి దగ్గరగా ఉన్నప్పుడు 'పాలుఎర్రబడ్డాయి' రాసిన నగ్నముని, విప్లవోద్యమానికి విడిగా, అతీతంగా సిద్ధాంతానికి అతీతంగా ఉంటూ కూడా విప్లవాన్ని గురించి రాయాలనుకున్నప్పుడు ఎట్లా తేలిపోయాడో ఇటీవలి 'పునరుత్థానం' కవితలోనే చూడవచ్చు ఒక్కమాటలో విప్లవ కవిత్వం తపన (passion)కైనా ఫ్యాషన్‌కైనా ఇవ్వాళ ఒరవడి అయిపోయింది. వ్యతిరేకించి, వెక్కిరించేవాళ్ళకు కూడా విప్లవ సాహిత్యాన్ని అనుకరించక తప్పడంలేదు. రాజకీయరంగంలో నక్సల్‌బరీవలెనే విప్లవ సాహిత్య - సాంస్కృతికోద్యమాలు కూడా ప్రజాజీవితంలో అనివార్యమైన భౌతిక వాస్తవాలైనవి. కాబట్టి విప్లవసాహిత్య సాంస్కృతిక రంగాలలో ఉన్న వైవిధ్యాన్ని, విప్లవోద్యమంతో సంబంధం అట్లవుంచి కనీసం పరిచయమైనా లేకుండా నిర్వచించబూనుకోవడం ఏడుగురు గుడ్డివాళ్ళు ఏనుగు గురించి వ్యాఖ్యానించినట్లుగాఉంటుంది,

ఇందువల్ల నేటి తెలుగుసాహిత్యంలో స్తబ్దత ఉన్నదనేవాదన రెండురకాలుగా అసంబద్ధమవుతున్నది. పైన చర్చించినట్లు స్తబ్దతకు ఇవాళ సూచికలుగా చూపబడు

తున్న అంశాలు నిజమైన సూచికలూ కావు, సహేతుకమూ కావు. మరొకవైపు స్తబ్దత అనేమాటకుఉన్న నిశ్చితమైన అర్థందృష్ట్యా ఆ మాటను ప్రస్తుతం వాడేవీలులేదు.

మరి ఇంత అసంబద్ధమైన వాదనలు ఎందుకు తలెత్తుతున్నాయి? ఇందుకు నాలుగు కారణాలు ఉండికుండే అవకాశముంది.

1 ఈ వాదన చేస్తున్నవాళ్ళకు నేటి విప్లవసాహిత్యంతో సజీవపరిచయంలేదు. 'మీపత్రికలు మూసపల్లాగ వస్తున్నాయి' అంటున్నవాళ్ళ ఎంతోమందిని సంచికలు చూపెట్టి సహేతుకంగా తమవాదనను సమర్థించుకొమ్మని అడిగాం. సరిగ్గాచదవడం లేదనో, రెండుమూడేళ్ళుగా చదవడంలేదనో జవాబువచ్చింది. ఈ మాత్రం నిజాయితీ కూడ లేనివాళ్ళ ఆ మాటలనే అటూఇటూతిప్పి వాదిస్తారుగాని వాస్తవాల ఆధారంగా సమర్థించుకోరు. విప్లవసాహిత్యం ఒక మూసలోవస్తున్నదనీ, కొత్తదనం ఉండడంలేదనీ వాళ్ళమనసులో ఒక అభిప్రాయం ఏర్పడిఉంటుంది. దాని ఆధారంగానే వాస్తవాలను పరిశీలిస్తారు.

2 స్తబ్దత వాదనకు రెండోకారణం ఈవాదనచేస్తున్నవాళ్ళు ప్రస్తుత తెలుగు రాజకీయ, సామాజిక పరిస్థితి 1952-65 లాగానే ఉన్నదనుకుంటూఉండాలి. అంటే వీళ్ళు ఒక్క తెలుగుదేశంగురించి మాత్రమేకాదు, ప్రపంచాన్నిగురించే సరైన అవగాహన కలిగి లేరన్నమాట. ఇవాళ్టి స్థితి 1952-65లాగ ఉన్నదంటే చైనా సాంస్కృతిక విప్లవాన్ని, నక్సల్బరీని గుర్తించకపోవడమన్నమాట.

3 ఈ వాదన చేస్తున్నవాళ్ళు మళ్ళీ ఇవాళ దిగంబరకవులలాంటి సంచలనాన్ని ఆశిస్తూఉండిఉండాలి. ఇంతకంటే విప్లవాన్ని నీరుగార్చే ఆలోచన మరొకటిఉండదు. ఎందువల్లనంటే దిగంబరకవులు స్తబ్దతమీద సంచలనంగా వచ్చినమాట నిజమేకాని వాళ్ళకు ఒక నిర్దిష్టప్రణాళికలేదు. గతంమీద విమర్శ, అసహ్యమూ, అసహనమూ తప్ప భవిష్యత్తుపట్ల విశ్వాసంలేదు. గత విధ్వంసనేతప్ప భవిష్యత్‌నిర్మాణం గురించిన ఆలోచనలేదు. నక్సల్బరీకీ, విప్లవరచయితలసంఘానికీ స్పష్టమైన ప్రణాళిక ఉంది. భవిష్యత్ ఆకాంక్షలున్నాయి. భవిష్యత్ నిర్మాణ ఆలోచనలున్నాయి. గతం మీద సరైన అంచనాఉంది. కనుక ఇవాళ మళ్ళీ దిగంబరకవులలాగ స్తబ్ధతను చీల్చాలని కోరుకోవడమంటే వెనక్కివెళ్ళడం. మరోమాటలో సిద్ధాంతంనుంచి దూరంకావడం.

4 స్తబ్దతవాదనకు మరొకకారణం వాళ్ళ సిద్ధాంత నిబద్ధతను వ్యతిరేకించడం అయిఉండాలి. అటు అద్దేపల్లి రామమోహనరావు అయినా, నగ్నముని అయినా, ఇటు అలీనవాదంపేర జ్వాలాముఖిఅయినా, 'విప్లవ సాహిత్యోద్యమం' పేర సమర సేన అయినా ఆయాకాలాలతో సాహిత్యస్తబ్దత వాదనతేవడానికి కారణం విరసం అవలంబించిన సైంద్ధాంతిక నిబద్ధతను వ్యతిరేకించడమే! సాహిత్యరంగంలో పాలిటిక్స్ ఇన్ కమాండ్ ఉండరాదనేదే వీళ్ళందరివాదనల్లో అంతర్గతఉద్దేశ్యం.

నేటి తెలుగుసాహిత్యంలో స్తబ్దతఉన్నదనే ఆరోపణ ఔచిత్యాన్ని, ఆ ఆరోప ణలు తలెత్తుతున్న భౌతికపునాదిని పైనచర్చించాం. ఈ చర్చప్రకారం తెలుగు సాహి త్యంలో నేడున్నస్థితి స్తబ్దతకాదని, స్తబ్దతావాదులు తమవాదనల్ని వాస్తవాల ఆధారంగా కాక స్వీయమానసిక దృక్కోణంనుంచి నిర్మిస్తున్నారని అర్థమవుతుంది.

ఇవాళ్టి స్తబ్దతకుకారణం విప్లవ సాహిత్యోద్యమం విఫలంకావడమేనని స్తబ్దతావాదులు కొన్నిఆరోపణలు లేవనెత్తుతున్నారు. విప్లవ సాహిత్యోద్యమ వైఫల్యా లుగా వాళ్ళుచూపుతున్న అంశాలను మూడురకాలుగా వర్గీకరించవచ్చు. 1 నిర్మాణా నికి సంబంధించినవి. 2 అతివాదంవల్ల ఏర్పడుతున్నవి. 3 ఐక్యసంఘటనా అవ గాహనతో లోపాలవల్ల ఏర్పడుతున్నవి.

విప్లవ సాహిత్యోద్యమం ప్రభావం నెరపినంత విశాలంగా, నిర్మాణపరంగా విస్తరించలేకపోయిందని వీళ్ళవిమర్శ. ఈ విమర్శకు జవాబు కొంతవరకు ఈ వ్యాసం ప్రారంభంలోనే చెప్పడం జరిగింది. నిర్మాణపరంగా విస్తరించడమంటే కేవలం సంఖ్యాపరంగా విస్తరించడమే కాకపోవచ్చు. విప్లవ సాహిత్యోద్యమం సంఖ్యాపరంగాకూడా విస్తరించిందనే వాస్తవాన్ని పక్కనపెట్టిచూసినా తెలుగునాట విప్లవరచయితల్లో అత్యధికసంఖ్యాకులు ఏదోఒక నిర్మాణంతో ఐక్యమయ్యేఉన్నారు. నిర్మాణంలోచేరని విప్లవసాహిత్యకారులు మనకు వేళ్ళమీద లెక్కపెట్టేంతమంది మాత్రమే ఉన్నారు. అసలు నిర్మాణపరంగా విస్తరించడం, విస్తరించకపోవడమనేది ఆయా నిర్మాణాల ఆంతరంగిక సమస్య. బయటినుంచి విప్లవ సాహిత్యోద్యమంపట్ల ఆసక్తిగలవాళ్ళు, వ్యాఖ్యలు ప్రకటించేవాళ్ళు చేయగలిగిందల్లా ప్రభావాన్ని అంచనా వేయడమే. ఎవరైనా సరైన నిర్మాణం లేకుండా ఒకరోజో, రెండురోజులో ప్రభా వం వేయగలరేమోగాని ఎల్లకాలమూ ప్రభావం వేయలేరు. అందువల్లనే పద మూడేళ్ళుగా తెలుగు సాహిత్యంమీద ప్రభావం వేయడం మాత్రమేకాదు, తెలుగు

సాహిత్యమంటే తానుమాత్రమేనని సగర్వంగా ప్రకటించుకోగల విప్లవ సాహిత్యం దాని ప్రభావానికీ, ప్రతిష్ఠకూ తగిన నిర్మాణం లేకుండా అస్థాయికి ఎదిగిఉండేదేకాదు.

విప్లవోద్యమం కొన్ని అతివాదవిధానాలు చేపట్టినకాలంలో విప్లవసాహిత్యోద్యమం కూడ అనివార్యంగా ఆ విధానాలనే ప్రతిఫలించింది. ఎమర్జెన్సీ తర్వాత విప్లవోద్యమమే తనగతాన్ని సవ్యంగా విశ్లేషించుకొని ప్రజాపంథాకు దగ్గరైనప్పుడు మళ్ళీ విప్లవ సాహిత్యంకూడ ప్రజాపంథాలోకి వచ్చింది. ఎక్కడైనా అడపాదడపా పాత వాసనలు తిరిగి బయల్పడితే, అతివాదమే ప్రధానస్వభావం అయినట్టుకాదు. విప్లవ సాహిత్యం అతివాదానికి బలైపోతున్నదనే వాళ్ళు 77 ముందరి సాహిత్యానికీ, తర్వాతి సాహిత్యానికీ తేడా గమనించడం లేదు. వాళ్ళ వ్యాసాలలో ఇస్తున్న ఉదాహరణలలో కూడ పాత ఉదాహరణలేతప్ప గతరెండు, మూడేళ్ళ ఉదాహరణలు ఉండడం లేదు. 1977-83 సాహిత్యానికి 1970-75 సాహిత్యస్వభావాన్ని అంటగట్టివాదించడం కనీస నిజాయితీలేని చర్య. ఇందువల్ల తేలేది అతివాదంకాదు, వాదనలలోని దివాళాకోరు తనం.

విప్లవ సాహిత్యోద్యమ వైఫల్యాలగురించి వాకిస్తున్నవాళ్ళు ఆది సమయం, సందర్భం చూసుకోకుండా మార్క్సిస్టు సాహిత్యోద్యమానికి పిలుపునిచ్చిందని, ఐక్య సంఘటన కర్తవ్యాన్ని విస్మరించిందని, కలుపుకోవలసిన శక్తుల్ని దూరంకొట్టిందని విమర్శిస్తున్నారు. ఈ వాదన 1970 లో మోటూరి హనుమంతరావు లేవనెత్తిందే.

నూతన ప్రజాస్వామిక విప్లవంలో ఐక్యసంఘటన ప్రాముఖ్యతను గురించి ఎవరికీ భేదాభిప్రాయంలేదు. ఐక్యసంఘటన గురించి కామ్రేడ్ మావో సేటుంగ్ చెప్పిన మాటలతో ఎవరికీ పేచీఉండనవసరంలేదు. కొమింటాంగ్‌తో చైనా కమ్యూనిస్టుపార్టీ ఐక్యసంఘటన కట్టిన కాలానికీ, నేటికీ 30ల చైనాకూ, 80ల భారతదేశానికీ పోలికఏమిటి, తేడా ఏమిటి అన్నదేచర్చ. చైనావిప్లవకాలానికి చైనా జాతీయబూర్జువా వర్గం సంఘటితపడిఉంది. దానికి దానిదంటూ ఒక పార్టీ ఉంది. జాతీయబూర్జువా వర్గపు ద్వంద్వ స్వభావాన్ని చైనాకమ్యూనిస్టుపార్టీ చాలస్పష్టంగా గుర్తించింది. అది ఎదుర్కొనే వైరుధ్యాన్ని గురించి వివరిస్తూ కామ్రేడ్ మావో "ఒకవైపు అది సామ్రాజ్యవాదులతో దోపిడీ చేయబడుతోంది. భూస్వామ్య సంకెళ్ళలో నలిగిపోతూ ఉంది. అందువల్ల ఆ రెంటితో వైరుధ్యాన్నెదుర్కొంటోంది. ఈ అర్థంలో అది విప్లవ శక్తుల్లో భాగమవుతుంది. చైనా విప్లవ క్రమంలో సామ్రాజ్యవాదాన్ని,

పెత్తందార్ల, యుద్ధప్రభువుల ప్రభుత్వాల్ని ఎదిరించడంలో అది చాల ఆసక్తిచూపు తోంది. మరోవైపు తనకు సామ్రాజ్యవాదంతోనూ, భూస్వామ్యంతోనూ ఉన్న ఆర్థిక సంబంధాల మూలంగా, తనకు ఆర్థిక, రాజకీయరంగాలలో ఉన్న అశక్తతమూలంగా సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్నీ ఎదిరించే ధైర్యం చేయలేకపోతుంది....

....జాతీయ బూర్జువావర్గంపట్ల ఒక జాగ్రత్తగల విధానం కలిగిఉండడం అత్యవసరం...." అన్నారు.

ఐక్యసంఘటనకర్థం పంస్థాగతమైన ఐక్యతే కానక్కరలేదు. కలిసిపని చేయడమంటే ఐక్యసంఘటనే కానక్కరలేదు. కమ్యూనిస్టుపార్టీ ఇతరులను కలుపుకొచ్చేటప్పుడు తనదృక్పథంలో మార్క్సిజం అన్నమాటను తొలగించదు. అంటే తన ప్రాపంచిక దృక్పథాన్ని వదులుకోదు. అట్లాగే విప్లవసాహిత్య సాంస్కృతికోద్యమం తనదృక్పథం తాను ఉంచుకుంటూనే నిర్దిష్ట కార్యక్రమాల్లో ఇతరులను కలుపుకుపోవచ్చు. అందుకోసం మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనావిధానాన్ని వదిలిపెట్టుకోవల్సిన అవసరంలేదు.

నూతన ప్రజాస్వామిక విప్లవమనేది లక్ష్యమేకాని సిద్ధాంతంకాదు. సైద్ధాంతిక పునాదితోకూడిన ఆచరణలేకుండా లక్ష్యాన్ని చేరుకోలేము. విప్లవకళాకారుని ఆచరణ విప్లవకళాసృష్టి. ఏప్రాపంచిక దృక్పథమూలేకుండా, ఏసిద్ధాంతములేకుండా రచనసాధ్యంకాదు. మావో ఆలోచనకాకుండా వేరేసిద్ధాంతాన్నివిశ్వసించేవాళ్ళెవ్వరూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ఆమోదించరు. కనుక నూతనప్రజాస్వామిక విప్లవాన్నిలక్ష్యంగా ప్రకటించుకున్నప్పుడు మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనావిధానాన్ని ప్రాపంచికదృక్పథంగా ప్రకటించుకోడానికి సంకోచించడం అర్థరహితం. ఈ అర్థరహితమైనపని ఆచరణలో ఉభయసామ్రాజ్యవాద వ్యతిరేక భూస్వామ్యవాద వ్యతిరేక రచయితలను విశాల, నిస్సృత వేదిమీదికి కలుపుకు రాలేకపోయిందనికూడా విరసంనుంచి విడిపోయినవారి దాదాపు 10 సంవత్సరాల అనుభవమే నిరూపించింది. అసలువిషయం ఏమిటంటే అనిర్వచితమైన "అభ్యుదయ" భావాలుగలవాళ్ళందరిని ఒక గొడుగుకిందచేర్చే ప్రయత్నమిది. దీనికి నూతన ప్రజాస్వామిక విప్లవం లక్ష్యం. ఒక ప్రతిష్ఠాకరమైన బొట్టుమాత్రమే.

ఒక్కజాతీయబూర్జువావర్గం కోసమేకాదు, ఇతర కలిసిరాగలశక్తులు, కలిసిరావడానికైనా విప్లవ సాహిత్యోద్యమం వీలుకలిగించలేదని ఒకవాదన. నూతనప్రజా

స్వామిక విప్లవంవైపు అత్యధిక రచయితల్ని, మేధావుల్ని రాబట్టుకోవలసిన తరుణంలో మార్క్సిజం పేర వారికి ఉద్యమద్వారాలను మూసివేయడానికి ప్రయత్నిస్తుందన్న ఆరోపణకూడ వినవస్తోంది. "....మార్క్సిజం పోరాటక్రమంలో తన ఆధిక్యతను, సమగ్రతను నిరూపించుకోవడంద్వారా, తనవర్గమయిన కార్మికవర్గం అంతిమ విజయం సాధించడంద్వారానే మొత్తం భావజాలంపై తన ఆధిక్యతను నిరూపించుకుంటుంది. అంతేకాని, పోరాటంలో కలవడానికి తనను అంగీకరించడమన్నదాన్ని ఒక పూర్వనిబంధనగా చేయడంతో మాత్రంకాదు...." అని సిద్ధాంతాలు చేస్తున్నారు.

'మనకు మార్గదర్శి మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనావిధానం' అని అనొద్దుగాని 'నూతన ప్రజాస్వామిక విప్లవం మనధ్యేయం' అని అనవచ్చునని అంటున్నారు. మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనావిధానంఅంటే భయపడి మనతోకలవనివాడు నూతన ప్రజాస్వామిక విప్లవంఅంటేమాత్రం కలుస్తాడా? నూతన ప్రజాస్వామిక విప్లవం అనేభావన మావో ఆలోచనా విధానం కాకమరేమిటి? ఇలా ఒకవైపు నూతన ప్రజాస్వామిక విప్లవంవైపు అత్యధికమేధావుల్ని, రచయితల్ని ఆకర్షించాలని అంటూనే, మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానం వద్దనడంలోని ద్వంద్వస్వభావానికి అర్థంఏమిటి? ఇక, మార్క్సిజం తనను అంగీకరించడమే తనతోకలవడానికి ప్రాతిపదికగా నిర్ణయించవద్దనీ, పోరాటక్రమంలో తన ఆధిక్యత రుజువు చేసుకోవాలనీ చేస్తున్నవాదనను ఒక్కసారి వాళ్ళే పరిశీలిస్తే, దానిలోని డొల్లతనం అర్థమవుతుంది. మార్క్సిజం "పోరాటక్రమంలో" తన ఆధిక్యతను రుజువు చేసుకుంటుంది సరే, కాని ఈ "పోరాటక్రమం" అనే మాటకు అర్థం ఏమిటి? ఈ పోరాటక్రమాన్ని ఏ భావజాలం నిర్దేశిస్తుంది? ఈ పోరాటం ఏ దారిలో నడుస్తుంది? ఈ దారిచెలిపేది మార్క్సిజం కాదా? మార్క్సిజం వెలుగులో సాగే పోరాటక్రమంలోచివర మార్క్సిజం తన ఆధిక్యతను రుజువు చేసుకోవలసిందేగాని ముందే ఆదారిని మార్క్సిజం అనగూడదన్నమాట. ఏం వాదనఇది? తమ వాదనలోని డొల్లతనాన్ని, దివాళాకోరుతనాన్ని ఈ మాటలగారడీలో దాచుకోవడందేనికి?

సాహిత్యమూ, కళలూ తదితర ఉపరితలరంగాలన్నీ రాజకీయాధిపత్యాన్ని తప్పనిసరిగా అంగీకరించాలనేదాన్ని వ్యతిరేకించడానికే ఈ వాదనలు తలెత్తుతున్నాయి. "ఇప్పటివరకు తత్వవేత్తలు చేసినపని ఈ ప్రపంచాన్ని విశ్లేషించడం, కాని అసలు చేయాల్సినపని ఈ ప్రపంచాన్ని మార్చడం...." అన్నాడు మార్క్స్. మార్క్సిజాన్ని శాస్త్రంగా, శస్త్రంగా అంగీకరించకపోతే, మార్క్సిజాన్ని మన మార్గదర్శిగా,

గీటురాయిగా నిలుపుకోకపోతే మనం ఈ ప్రపంచాన్ని విశ్లేషించేవాళ్ళమే అవుతాం గాని మార్చదలచుకున్నవాళ్ళమూ, మార్చవలసినవాళ్ళమూ కాము.

ప్రస్తుతం తెలుగు విప్లవసాహిత్యంమీద శత్రువులనుంచి విపరీతమైనదాడి సాగుతోంది. వ్యాపారపత్రికల తోడ్పాటుతో, ప్రజాశత్రువుల కనుసన్నలలో ఈ దాడి ప్రధానంగా విప్లవవ్యతిరేకుల వాదనలలో బహిర్గతమవుతున్నది. విప్లవ సాహిత్యోద్యమం ఒక్కతాటిమీదనిలబడి ఐక్యంగా ఈ దాడిని ఎదిరించవలసిఉంది. ఈ శత్రువును ఎదిరించడంలో మనం రెండుచేతులా పోరాడవలసేఉన్నది. రెండు వైపులా పదునుగల ఆయుధాలు ఉపయోగించవలసే ఉన్నది. ఇలాంటి సమయంలోనే మిత్రవిమర్శరూపంలో, 'అతివాద దుస్సాహసికవాదాన్నీ, మితవాద అవకాశవాదాన్నీ' సరిదిద్దడమనేపేరుతో పైన చర్చించినవాదనలు తలెత్తుతున్నాయి. మనలోంచే, అంతర్గతంగానే కొన్ని మితవాద, ఉదారవాద ధోరణులు తలెత్తుతున్నాయి. ఇతర కారణాలతో పాటు అభ్యుదయ సాహిత్యోద్యమం ఓడిపోవడానికి, నీరుకారిపోవడానికి ఒక కారణం ఇలాంటి కష్టసమయంలో జాగ్రత్తగా, పదనుగా వ్యవహరించకపోవడమే. అప్పుడు అది ఒకవైపు సాంప్రదాయిక వాదులపైన మొక్కవోనిపోరాటాన్ని సాగించవలసి వచ్చింది, మరోవైపు తనలోనే పుట్టుకొచ్చిన చీడపట్ల నిర్దాక్షిణ్యమైన శోధనకార్యక్రమాన్ని అమలు పరచవలసివచ్చింది. ఈ రెండు కర్తవ్యాలలో మొదటి కర్తవ్యాన్ని అరకొరగా పరిపూర్తిచేయడమేకాక, రెండోకర్తవ్యాన్ని పూర్తిగా విస్మరించినందు వల్లనే అభ్యుదయ సాహిత్యోద్యమం నీరసపడిపోయింది. ఈ చారిత్రక అనుభవపు నేపథ్యంలో 'వందయుద్ధాలుచేసి, వందవిజయాలు సాధించాలంటే' మనం 'మననూ తెలుసుకోవాలి. శత్రువునూ తెలుసుకోవాలి'

ఇందులో చర్చించిన వాదనల మూలాలు :

మోటూరి హనుమంతరావు - సాహిత్యోద్యమం, మార్క్సిస్టు అవగాహన (1970)

జ్వాలాముఖి - రేపటికవిత్వం, విరసంసంచిక - 3 (1972)

జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ - విరసంలో విచ్ఛిన్నకులకుట్రల్ని భగ్నంచేయండి (1975)

అద్దేపల్లి రామమోహనరావు — మినీకవిత (1980)

నగ్నముని - ఈ తరం యుద్ధకవిత ఆవిష్కరణసభ రిపోర్ట్, నూతన జనవరి (1983)

హెచ్చార్కె - కళలూ-సాహిత్యంపై కార్ల్‌మార్క్సు, నూతన, ఏప్రిల్/మే (1983)

పమ్మి - విప్లవసాహిత్యంలో అతివాదం, నూతన, జనవరి (1983)

సమరసేన - తెలుగుసాహిత్యంలో నేటిస్థితి - మనకర్తవ్యాలు - విమోచన 1-6-83

సాంస్కృతిక సమరరంగంలో రాజకీయ పోరంగా ప్రజా సినిమా

అన్ని కళల్లాగే సినిమాకళ విప్లవానికి దోహదపడుతుందేకాని విప్లవాన్ని నడిపించలేదు. విప్లవవిజయానికి ఆయుధాలు, విప్లవ భావచైతన్యానికి కళలు అవసరం. సినిమా ఒక బలవత్తరమైనకళ. అభివృద్ధిచెందిన సాంకేతిక-జ్ఞానంతో కళలన్నిటిని సమన్వయం చేసుకోగలశక్తి.

రష్యా విప్లవకాలంనాటికే సినిమా ప్రాథమికదశలోఉంది. "అత్యంతప్రధానమైన శక్తివంతమైన సాధనం సినిమా"అని లెనిన్ భావించాడు. చైనా విప్లవకాలంలో కళలూ సారస్వతం ఎవరికోసమని చేసిన ప్రసంగాల్లో మావో సినిమాకళని గురించి ప్రస్తావించలేదు. ఆ కాలానికి చైనా సాంకేతికంగా అంతగా ముందంజ వేయలేదు. సినిమాని ఉపయోగించుకున్న దాఖలాలుకూడా లేవు.

చైనాలో సాంస్కృతిక సమరరంగంలో ఫ్యూడల్‌సాహిత్యం, కళారూపాలని తత్కాల పోరాటఅవసరాలకు అనుగుణంగా మార్చుకొన్నారు.

అప్పటికీ ఇప్పటికీ సామాజిక ఆర్థిక, సాంకేతికరంగాల్లో ఎంతోమార్పుకనిపిస్తోంది. ప్రజాశత్రువు సాంకేతికంగా కొత్తపద్ధతుల్లో (ఫ్యూడల్ భావవాదులు, సామ్రాజ్యవాద, పెట్టుబడీ దళారీలు, రివిజనిస్టులు) తాము సరైన, తమకుసరైన పద్ధతిలో ఉన్నామనుకునే అభ్యుదయవాదులు నానారకాలుగా విజృంభిస్తున్నారు.

శత్రువులు భూస్వామ్య సామ్రాజ్యవాద సంస్కృతిని పనిగట్టుకొని గ్రామాల్లోనూ పట్టణాల్లోనూ వెదజల్లుతున్నారు. వాళ్ళకు సాహిత్యం, నాటకం, సినిమా, టీవీ, రేడియో, పత్రికలూ, ప్రింటింగ్‌టెక్నాలజీ, మొదలయిన వివిధరంగాలు అందుబాటులోఉన్నాయి. పెట్టుబడి గుప్పిట్లో పెట్టుకోవడంవల్ల సాంకేతికపరికరాల సహాయంతో ఎన్నడూలేనంత అధికంగా ప్రచారం చేసుకోవడం వీలవుతున్నది. ఆ ప్రచారాన్ని ఎదుర్కోవడానికి నగ్జల్‌బరీ (విరసం ఏర్పాటు) నుండి ఒక్కసాహిత్యరంగంలోనే ఎక్కువగా కృషిజరుగుతోంది. రచయితలసంఘాల్లో కవిత్వమే ప్రధానంగా వినిపిస్తోంది. నాటకరచయితలు చాలాతక్కువ. నాటకరంగాన్ని విస్మరించినట్లే (సంప్రదాయపద్ధతిలో అంటే రంగస్థల, మేకప్ మొదలయినవాటిలో నాటకాలు వేసే ఆర్థికస్థితిలేదు. ఆధునిక వీధినాటకాల్ని స్వీకరించలేకపోతున్నాం.) ఇలాంటి స్థితిలో మన పత్రికలు కేవలం సాహిత్యంగురించే ప్రధానంగా ఆలోచిస్తాయి.

తక్కువపరిధి, నెట్‌వర్క్ కలిగిన రచయితలు, కళాకారులు ప్రస్తుతం అత్యధిక మెజారిటీ కలిగిన ప్రజలకు చైతన్యం కలిగించడానికి సాంకేతిక రంగంలోకి ప్రవేశించకతప్పదు.

భూస్వామ్య కళారూపమైనా, బూర్జువాకళారూపమైనా ఉన్నది ఉన్నట్లు ఉపయోగించడం సరైనపద్ధతికాదు. రూపాన్ని, వస్తువుని విప్లవీకరించి వాడుకోకపోవడం మడికట్టుకోవడమే అవుతుంది. కొత్తపాత కళారూపాల్ని కొత్తమూసలో ప్రజలకి అందివ్వకపోవడం వారి ఎదుగుదలస్థాయిని గుర్తించకపోవడమే అవుతుంది. ప్రజలింకా పందొమ్మిదవ శతాబ్దంలో ఉన్నారనుకోవడం పొరబాటు.

ఇవ్వాళ ఏ ఒక్క ప్రతిభావంతుడైన గాయకుడో, ఉపన్యాసకుడో చాలడు. వందలమంది గాయకులు, ఉపన్యాసకులు పనిచేయాల్సిఉంది. అంతమందిపనిని ఒక్కసినిమా లేదా ఆడియోవిజువల్ మీడియంద్వారా చేయవచ్చు.

తక్కువఖర్చుతో చిన్నచిన్న చిత్రాల్ని నిర్మించడం, కేసెట్లతో పాటలుప్రచారం చేయడం, ప్రింటింగుని, ఆధునిక వీధినాటకాల్ని నేటి సాంస్కృతికరంగంలో విధిగా ఉపయోగించుకోవలసిఉంది.

ఈమధ్య సినిమామీడియం గురించి కొంతచర్చజరుగుతోంది. పెట్టుబడి, సెన్సారువలయంలో చిక్కుకోని 'సినిమా'ని అన్వేషించాలి. ఆ అన్వేషణకి ఈ చర్చలు ఉపయోగిస్తాయి. సినిమా దృశ్యప్రధానం. అలాగే ఆడియోవిజువల్ మీడియం కూడా. సినిమాసాధ్యంకాని పక్షంలో దానికి పరోక్షంగా ఆడియోవిజువల్ మీడియాన్ని చేపట్టాల్సిఉంది. ఈ విషయాన్ని చెప్పేముందు సినిమామీడియాన్ని పరిశీలించాల్సి ఉంటుంది.

విప్లవ సినిమా

ఆర్టుసినిమా, వాస్తవికసినిమా, ప్రయోగాత్మకసినిమా, సమాంతర సినిమా, బడ్జెట్ సినిమా - పేరుఏదైనా స్వభావంఒక్కటే. విప్లవసినిమా అనే ఒకరకం 'ముసుగు' సినిమా ఒకటి వ్యాపారరంగంలోంచి నిస్సిగ్గుగా వెలువడుతోంది. ఎలా పిలుచుకుంటున్నప్పటికీ వీటి వర్గస్వభావం ఒక్కటే. లాభాలదృష్టి ఒక్కటే. వీటి గురించి ఆలోచించాల్సిన పనిలేదు.

ఇకపోతే అభ్యుదయ సినిమా (Progressive), తిరుగుబాటు సినిమా (Protest Cinema), విప్లవ సినిమా (Revolutionary Cinema), రాజకీయ సినిమా (Political Cinema), పోరాట సినిమా (Struggle Cinema), రహస్యసినిమా (Underground Cinema) అని దేశవిదేశాల్లో రకరకాలుగా, రకరకాలదశల్లో, స్థాయిలో సినిమాలు వస్తున్నాయి. ఆయాదేశాల పోరాటస్వభావాన్ని, తీవ్రతని, అవసరాన్నిబట్టి వస్తున్నాయి. ఇందులో పెట్టుబడి, సెన్సారు నిబంధనలకు లోబడినవీ, లోబడనివీ ఉన్నాయి.

మనదేశంలోకూడా కొన్ని ఉద్యమచిత్రాలు, అభ్యుదయచిత్రాలు నిర్మించారు. అంకుర్, ఆక్రోశ్, మాభూమి మొదలయిన కథాత్మకచిత్రాలూ, హంగ్రీఆటం, ప్రిజనర్స్ ఆఫ్ కాన్షన్స్, వాయిసెస్ ఆఫ్ ది పీపుల్, వేవ్స్ ఆఫ్ రెవల్యూషన్, ముక్తిధాయ్, ఇండియన్‌స్టోరీ మొదలయిన డాక్యుమెంటరీలు నిర్మించారు. ఐతే వీటి ఫలితాలను తోసిపుచ్చలేం. వీటిని ఉపయోగించుకునే పద్ధతిలో వీటిప్రయోజనం ఆధారపడి ఉంటుంది.

అవర్ ఆఫ్ ఫర్నెసెస్ చూసిన తరుజాతే విప్లవ సినిమాగురించి ఆలోచించిన పట్వర్ధన్, ఆకోవకి చెందిన డాక్యుమెంటరీలు నిర్మించారు. ఇలాంటివాటిని పూర్తిగా నిరాకరించకుండా వాటినుండి గుణపాఠాలు తీసుకుని ప్రజాసిరిమాకి పునాదులు వేసుకోవాలి.

విప్లనంలో ఆధునిక ఆయుధాలులేకుండా విజయం సాధించలేనట్లే - సాంస్కృతిక సమరరంగంలో విప్లవకాలంలోనూ, విప్లవానంతర సాంస్కృతిక పోరాటంలోనూ ఆధునిక ప్రచారసాధనాలను ఉపయోగించుకోకతప్పదు.

ఐతే 1950 తరువాత అభ్యుదయ రచయితల, కళాకారుల అనుభవాలునేర్పిన గుణపాఠాలవెలుగులో అడుగువేయకతప్పదు.

నాటకాలు, తోలుబొమ్మలాటలు (తెర, తెరవెనుకకాంతి, పాత్రలు, ఆడించే సూత్రధారి, సంగీతం, నేపథ్యసంగీతం) ఇలాంటి ప్రక్రియలు యుగయుగాలుగా ప్రజలకు అనుభవమే. దీనిపునాదిగా మాత్రమే తెరమీదబొమ్మలు చూడ్డం ప్రజలకు అలవాటే. అందుకే మొదటినుండీ సినిమాకు అంత ఆదరణ లభించింది.

జనంలోకి సినిమా - సినిమాలోకి జనం

ప్రజలు ప్రతిసినిమాని అంత ఆసక్తిగా చూడరు. గ్రామాలలో కుటుంబ నియంత్రణ డాక్యుమెంటరీలు, ఇరవైసూత్రాల ప్రణాళికలచిత్రాలు అంతగా హర్షించరు. ఎందుకంటే అవి పేలవమైన వినోదాలు. ఇక కథాత్మకచిత్రాలంటే కేవలం వినోదమే.

ఇలాంటి వాతావరణంలో వారికికావలసిన, వారి అభిరుచులకు, జీవితానికీ అవసరమైన చిత్రాలు నిర్మించాల్సివుంది. కథాత్మకచిత్రాలు నిర్మించి ప్రదర్శించడం కష్టమైనపని. అంకుర్, ఆక్రోష్, దామూలివంటి సినిమాలు గ్రామాలలో ప్రదర్శించవచ్చు. ప్రదర్శకులు రాజకీయ అవసరంగా చిత్రాన్ని తీసుకుపోవాలి. చిత్ర ప్రదర్శన స్థలం ఒక రాజకీయ తరగతిగా మార్చాలి. అప్పుడే ఆ సినిమావల్ల ప్రయోజనం కలుగుతుంది. అలాంటి ప్రదర్శనల పునాదిమీద ప్రజల చైతన్యభావాలను చొప్పించవచ్చు. ప్రదర్శనకుముందే ఆ గ్రామం రాజకీయ చైతన్యస్థాయినిబట్టి నిర్మాణాన్నిబట్టి, భవిష్యత్ కార్యక్రమాన్నిబట్టి సినిమా ఎంపిక, చర్చలుఉండాలి. అసలు సినిమా ప్రదర్శన పద్ధతిని ఎంచుకోవాలి.

ఇదివరకే నిర్మించిన సినిమాలనే తీసుకుపోవచ్చు. కాని ప్రత్యేకంగా కథాత్మక సినిమాలు నిర్మించడంకష్టం.

అలాంటి సమయంలో చిన్నచిత్రాల నిర్మాణంఅవసరం. ఎవరు నిర్మిస్తారు? వ్యాపారనీతిలేకుండా త్యాగపూరితంగా చిన్నచిత్రాలపై దృష్టి కేంద్రీకరించాలి. లేదా అలాంటిచిత్రాలు నిర్మించే అనేక స్వచ్ఛందసంస్థలనుండి చిత్రాలు "అరువు" తీసుకొని అవసరానుగుణంగా వాడుకోవచ్చు.

కొన్ని ప్రత్యేకచిత్రాలను నిర్మించడానికి కొన్ని "ప్రజాసినిమా గ్రూప్లు" ఏర్పడాలి. ఇవి సమిష్టిగాపనిచేసే స్వభావంతో, త్యాగంతో నిర్వహింపబడాలి.

ఈ సంస్థలు చిత్రనిర్మాణం, చిత్రప్రదర్శన అనే రెండుముఖ్యమైన విషయాలు దృష్టిలోపెట్టుకోవాలి.

చిత్రం ఎంతపెద్దదైతే అంతప్రభావం కలిగిస్తుందనుకోవడం కేవలం భ్రమ. మొదటిదశలో విప్లవచైతన్యం కలిగించే వస్తువుతో చిత్రంతీయాలి. అందువల్ల సెన్సారు ఇబ్బందులు తక్కువగా ఉంటాయి. ఆనంద్‌పట్వర్ధన్ అన్నట్లు సెన్సారు లేకుండానే ఒకమంచిపని చేయడానికి "శాసనోల్లంఘన" చేసినా ఫరవాలేదు.

మొదట ఈ గ్రూపుసభ్యులు, అభిమానులవిరాళాలతో చిత్రంనిర్మించగలగాలి. చిత్రప్రదర్శనా పద్ధతి ప్రజలను ఆకట్టుకోగలిగితే వాళ్ళే స్వచ్ఛందంగా డబ్బు ఇస్తారు.

చిత్రనిర్మాణానికి ముందు ఎందుకోసం, ఎవరికోసం తీస్తున్నామో ఖచ్చితమైన అంచనా వేసుకోవాలి. గ్రామీణ, పట్టణప్రజల సాంస్కృతికస్థాయి, సమస్యలు, పరిష్కారాలు బేరీజుకట్టాలి. పట్టణంలోని కార్మికులనీ, గ్రామీణశ్రామికులనీ ఒకేగాటనకట్టలేం.

గ్రామీణజనానికైతే జానపదరూపాన్ని తీసుకోవాలి. ఒక కథకుడు కథ చెప్పటంతో ప్రారంభించాలి. కథలోంచి సంఘటనని ప్రతిబింబించాలి. కథలోమధ్యన కథకుడు కనిపిస్తాడు. పాటలు ఎక్కువగా ఉండాలి. శబ్దాన్ని ఫిలింకు జోడించలేకపోయినట్లయితే కేసట్లలో నింపుకోవాలి.

చిత్రప్రదర్శనకుముందు విప్లవపాటలు వినిపించాలి. అవి స్థానికసమస్యని తీసుకోవాలి. పాటలు పాడలేనిపక్షంలో టేపురికార్డులో వినిపించాలి. స్థానిక పోరాటాల గురించీ, దేశంలోని ప్రజోద్యమాలగురించీ చెప్పాలి. తరువాత ఆ చిత్రాన్ని పరిచయం చేయాలి. రాజకీయ తరగతిలో భాగంగా చిత్రప్రదర్శనని మలుచుకోవాలి. ప్రదర్శన తరువాత తప్పనిసరిగా చర్చలుజరగాలి. అందులో ప్రజలే ముఖ్యపాత్ర వహించాలి. చర్చలు విధినిర్వహణని ప్రేరేపించాలి. అదే ముఖ్యోద్దేశం.

ఈ ప్రదర్శనకి ప్రేక్షకులు తక్కువగాఉండాలి. ఎక్కువ మందిఉన్నపక్షంలో రెండోప్రదర్శన ఇవ్వాలి.

ప్రస్తుతపరిస్థితుల్లో ఈ కార్యక్రమం చేపట్టడం కష్టమే. ఈమధ్య సినిమా ప్రక్రియకున్న శక్తినిగ్రహించి పట్వర్ధన్, తపన్ బోసులాంటివారు కొన్నిప్రయత్నాలు చేస్తున్నారు. ఆ ప్రయత్నాల గుణపాఠాలు తీసుకొని వారితోకలిసిగాని, గ్రూపులుగా ఏర్పడిగాని "ప్రజాసినిమా"ని రూపొందించవచ్చు. అందుకు పార్టీకార్యకర్తల, మేధావుల, విద్యార్థుల సహకారంతో ఒకప్రణాళిక ఏర్పాటుచేయడం అత్యంతఅవసరం.

విప్లవ విజయసాధనకృషిలో ఇదొక చిరుప్రయత్నం మాత్రమే.

రాజకీయపార్టీల నిర్మాణానికీ, నిర్మాణంలోఉంటే కార్యకర్తల్నీ, ప్రజల్నీ ఎడ్యుకేటు చేయడానికి ఈ రకమైన కార్యక్రమం అవసరపడుతుంది. ఆ అవసరం ఆలోచనల పునాదిలోంచే ప్రయత్నాలు మొలకెత్తడం మంచిది. భవిష్యత్కృషిలో భాగంగా ఈ కార్యక్రమం మొదలవ్వాలి.

ప్రజాసినిమా గ్రూపులు ఫిలింమీడియానిగాని, ఆడియోవిజువల్ మీడియానిగాని ఎన్నుకొని దానికిసంబంధించిన కృషిచేయాలి.

ఆడియోవిజువల్ మీడియా

సినిమాఅంటే కేవలం మూడుగంటల కథాత్మకచిత్రాలు అనే అభిప్రాయం చాలామందికిఉంది. ఫిలింమీడియాలో చిన్నచిత్రాలు(మూడు నుంచి పది నిమిషాలు), డాక్యుమెంటరీ చిత్రాలు, కథాత్మక చిత్రాలు అని అనేకరకాలుగా ఉన్నాయి. పై రెంటినిమాత్రం 16, 8 యం. యం. లో తక్కువఖర్చుతో నిర్మించవచ్చు. 16 యం. యం. ఫిలిం లభ్యంకావడం కష్టమైతే సూపర్ 8 యం.యం. ఫిలింతో తీసుకోవచ్చు. ఈ ఫిలింకు కోటాలేదు, ఎడిటింగు మనమేచేసుకోవచ్చు, దీనితో చరిత్రాత్మకమైన ఊరేగింపులను, ప్రదర్శనలను, సభలను, సంఘటనలను రికార్డు చేయవచ్చు.

ఈ చిత్రాల్నికూడా నిర్మించడానికి కెమెరా, లైటింగు, ప్రొజెక్టరు, కరెంటు అవసరం. కాబట్టి ఇవికూడా ప్రస్తుతం సాంకేతికంగా, ఆర్థికంగా మనకు దూరం అనుకున్నపక్షంలో ఇకమిగిలింది ఒక్క స్లైడులు (SLIDES) మాత్రమే. ఈ ఆడియోవిజువల్స్ సినిమాకన్న తక్కువ సాంకేతికరూపాలు ఉపయోగించుకోగలిగితే ప్రభావంలో చిత్రంలో సమంగాఉంటాయి.

స్లైడుఫిలిం

ఒక రోల్‌లో 35 స్నాప్‌లుంటాయి. రోల్ ఒకటికి 40 రూపాయిలనుండి 130 రూపాయలవరకు ధరఉంటుంది. వీటిని బొంబాయిలోని ఆయా కంపెనీలకి పంపిస్తే కడిగిఇస్తారు. ప్రస్తుతం హైదరాబాదులో ఒకరిద్దరు కడిగిఇస్తారు. రెండు, మూడు రోల్స్ ఎక్స్‌పోజుచేస్తే ఒకచిన్న చిత్రకథకి సరిపోతుంది.

ఆటోమాటిక్ స్లైడుప్రొజెక్టరు కంట్రోలుస్విచ్ పట్టుకుని బటన్ నొక్కినప్పుడల్లా ఫ్రేం మారుతూఉంటుంది. మరోచేతిలో హేండ్‌మైకు పట్టుకుని దృశ్యాలను విశదీకరించి చెప్పవచ్చు లేదా వ్యాఖ్యానం చేయవచ్చు. వీలైతే కావలసినపాటల్ని కేసెట్టుమీద రికార్డుచేసుకుని మధ్య మధ్య ఉత్తేజాన్ని కలిగించవచ్చు. మరోవైపు కేసెట్టులో పాత్రలుగా కనిపించేవారితో ఇంటర్వ్యూలుతీసుకుని వారిగొంతుకల్నే విని పించవచ్చు.

ముందేచెప్పినట్లుగా ఈ ప్రదర్శనసైతం రాజకీయతరగతిలో ఒక పాఠంగా మాత్రమే ఉండాలి.

చిత్రంలోని సమస్యగురించి ప్రజలతో చర్చలుజరపాలి. అనంతరం వారి సూచనకు అనుగుణంగా కొత్తదృశ్యాలను కలపాలి. వ్యాఖ్యానంలో మార్పుచేయాలి. వివిధరకాల గ్రామాలస్థాయినిబట్టి అదే స్లైడుస్టోరీని రకరకాలుగా ఉపయోగించవచ్చు.

ఫొటోగ్రఫీతెలిసిన ఎవరైనా స్లైడుఫిలిం తీయవచ్చు. మామూలు మంచికెమెరాతో తీయవచ్చు. కాకపోతే ముందే మొత్తంఆలోచించి స్క్రిప్టు తయారుచేసుకోవాలి.

ఎఫెక్టులకోసం పాతఫోటోలను, పత్రికల్లోని ఫోటోలను స్లైడులుగా చేసుకోవచ్చు ఫొటోమీద ఆర్టువర్కు చేసుకోవచ్చు (ఉదా. జనసమూహంమీద ఇనపతీగని గీస్తే వాళ్ళంతా బందీలుగా ఉన్నట్టు కనిపిస్తుంది)

ఈ విధంగా రకరకాల సాంకేతిక పద్ధతులతో ప్రజలను ఆకట్టుకునే విధంగా తీయవచ్చు. తమలాంటివ్యక్తులే కనిపిస్తారు కాబట్టి వాళ్ళు తప్పక మమేకతపొందుతారు. దృశ్యాలవల్ల పడికట్టుమాటలు ఉపయోగం ఉండదు. జీవితాన్ని చిత్రించి, కథలో మలిచి వారిని చైతన్యవంతులను చేయవచ్చు.

ఈ ప్రదర్శనకోసంకూడా ఒక ప్రొజెక్టరు కావాలికదా! పదిస్లైడులుపెట్టే ప్రొజెక్టర్ 200 రూపాయిలనుండి ఆటోమెటిక్ ప్రొజెక్టర్ 3,000 రూపాయిలవరకు దొరుకుతాయి.

జిల్లాకు ఒకగ్రూపు, గ్రూపుకు ఒక ప్రొజెక్టర్ సంపాదించడం కష్టమేమీ కాదు. ఇలా ప్రజలదగ్గరకు వెళ్ళాలనుకునేవారికి చాలామంది సహాయంలభించవచ్చు. కాకపోతే వాళ్ళు పనిప్రారంభించాలి. ఇందుకోసం ఎన్నోసంస్థలూ, ఆర్గనైజేషనులూ తోడ్పడతాయి. ముఖ్యంగా పౌరహక్కుల సంఘాలు, విప్లవరచయితల, కళాకారుల సంఘాలు వెంటనేపూనుకోవాలి.

సినిమామీడియం కేవలం డబ్బుకేపరిమితంకాదు. సినిమాకి సెన్సారు నిబంధనలు అడ్డుకావు. పంపిణీసంస్థలు తీసుకోవాల్సిన అవసరంలేదు, సినిమాథియేటర్లు కావాలనిలేదు. మహోన్నతమైన లక్ష్యంతో, త్యాగంతో, హృదయంతో, మేధస్సుతో ప్రజలసినిమా నిర్మించబడాలి. కొత్తసమాజంకోసం జనోపయోగంకోసం రూపమెత్తాలి.

— జయధీర్ తిరుమల్ రావు

నడుస్తున్న చరిత్ర :

రామరాజ్యంలో రాంపూర్

విప్లవోద్యమాన్ని అణచడానికి శత్రువులు రోజురోజుకూ కొత్త ఎత్తుగడలనూ పద్ధతులనూ అన్వేషిస్తున్నారు. పట్టికరాసుకుంటే అది అమానుషత్వానికి రోల్-కాల్ అవుతుంది. మార్క్సిజం అర్థంకానివాళ్ళకు అది అర్థంకాదు. కూలి అడిగితే రోకలి బండలు ఎందుకు ఎక్కించాలి? పాటలు పాడుకుంటే స్టేజీని ఎందుకు విరగ్గొట్టాలి? సమ్మెచేస్తే దొమ్మీకేసెందుకుపెట్టాలి? ప్రజలను కదిలిస్తే 'ఎన్‌కౌంటర్' ఎందుకు చేయాలి? సభలు పెట్టుకుంటే సెక్షన్ 144 ఎందుకు ప్రకటించాలి? ఈ ప్రశ్నలకు వ్యవస్థతో సంబంధంలేని సమాధానం దొరకదు. అటువంటి సమాధానంకోసం వెతికితే దారీతెన్నూ తెలియక ఎవరోఏదో చేస్తున్నారనిపిస్తుంది. ఇవన్నీ జరుగుతున్నా యని ఆరోపించేవాళ్లు పాక్షికంగా మాట్లాడుతున్నారని అనుమానంవస్తుంది. ఈ అను మానం కారణంగా పోలీసులూ ప్రభుత్వమూ సృష్టించే పుక్కిటిపురాణాలకు విశ్వస నీయత (credibility) కలుగుతుంది. సమాజంలో ఆస్తిపరులవర్గం పాలకవర్గమనీ, ప్రభుత్వం దాన్నికాపాడే రక్షకదళమనీ, పోలీసులూకోర్టులూ చట్టమూ ఆ రక్షణకు సాధనాలనీ అర్థంకాకపోతే ఈ సంశయాలకు సమాధానం దొరకదు. 'మీరు ఏమీ చేయకపోతే పోలీసులు దౌర్జన్యాలు ఎందుకు చేస్తారు? వాళ్ళకు అందులో ఇంటరెస్ట్ ఏముంది?' అనే ప్రశ్నార్థకం ఆలోచనాశూన్యంలో వేళ్లాడుతూ ఉండిపోతుంది. ఈ ప్రశ్నవెనక వున్నది అమాయకత్వమే అయితే దానికి ఆ అమాయకత్వం పరిధిలో సమాధానం లేదు.

ఉత్తరభారతదేశంలో సగటుగ్రామాన్ని రాంపూర్ అంటారు. అది సగటు పేరు మాత్రమే. ఇవ్వాళ వరంగల్‌లో రాంపురం వేరేఅర్థంలో సగటు గ్రామం. వర్గసమాజాల అసమాన చట్టాలను సహితం అతిక్రమించని పేదప్రజానీకంపైన భూస్వాములు పోలీసుల దన్నుతోసాగిస్తున్న దౌర్జన్యాలకు రాంపురం మారుపేరయింది. చుట్టుపక్కల గ్రామాలలో ఇస్తున్నకూలి తమకుగూడ ఇవ్వాలని కోరినందుకు అరెస్టుల తోనూ అక్రమనిర్బంధంతోనూ మడికొండ లాకప్‌లో చిత్రహింసలతోనూ సాయు ధంగా దౌర్జన్యం చేసారన్న అబద్ధపుకేసుతోనూ ప్రారంభమయి మూడునెలల కాలంలో ఒక రాడికల్ యువకుడి హత్యకు దారితీసింది రాంపురం కథ.

వరంగల్ - హైదరాబాద్ రహదారిపక్కన కాజీపేటకు 10 కిలోమీటర్ల దూరంలో వుంది రాంపురం. గ్రామంలో వెలమ భూస్వాములది పెత్తనం. వాళ్లవి ముప్పై

కుటుంబాలవరకు ఉన్నాయి. కొందరికి 20 ఎకరాలవరకు తరిపొలం, 70 ఎకరాల వరకు కుష్కి వున్నాయి. గ్రామసర్పంచ్ ఈ వెలమపెత్తందార్లకు నాయకుడు. భూమినుంచి సంపాదించే ఆదాయంచాలక ఇతను గూడ్సుబళ్ళనుదోచుకునే 'వ్యాపారం' చాలాకాలం నడిపాడు. కాజీపేటనుండి హైదరాబాద్ వెళ్ళే రైలుమార్గం రాంపురం పక్కనుండివెళ్తుంది. పెండ్యాల రైల్వేస్టేషన్ రాంపురం శివార్లలోనేవుంది. ఆ ప్రాంతంలో ఒకచోట మెరక ఉండడంవల్ల రైలుబళ్ళు నెమ్మదిగాపోతాయి. సర్పంచ్ జీతగాళ్లు కాజీపేటలో మాల్‌గాడీ (గూడ్సుబండి) ఎక్కి ధాన్యంబస్తాలో సిమెంటు బస్తాలో రాంపురందగ్గర కిందపడేసి తాముదూకి దొంగమాల్‌ను దొరవారిఇంటికి తెస్తారు. సరుకులోనూ పద్ధతిలోనూ కొత్తదనమేగాని, దొరలు దొంగతనాలుచేయించి తమ ఆదాయాన్ని బలిపించుకోవడం తెలంగాణకు కొత్తకాదు. తెలంగాణ ఫ్యూడల్ వ్యవస్థలో ఇదొక ముఖ్యమయినఅంశం. ఒకప్పుడు వెండిబంగారాలూ ధాన్యమూ గొడ్లూ దొంగిలించేవాళ్లు, 'గ్రీన్‌రెవల్యూషన్' వల్ల పెట్టుబడిదారీ సంబంధాలు రాకున్నా సాంకేతికపరికరాలు వచ్చినతరువాత మోటార్లూ ఆయిల్‌ఇంజన్లూ స్టార్టర్లూ దొంగిలించడం మొదలుపెట్టారు. వరంగల్‌దగ్గరేవున్న అన్నాసాగరం భూస్వామి ఇందుకు సుప్రసిద్ధుడు. ఇంతకంటె సుఖమయిన వ్యాపారం మరొకటి ఉండదు. దొంగతనాలుచేసేది తమ జీతగాళ్లేకాబట్టి పెట్టుబడి అక్కరలేదు. పట్టుబడితే జీతగాడికేశిక్ష కాబట్టి రిస్కులేదు. (ఒక్కటేరిస్కు. దొరవారి కోసం దొంగతనాలుచేసి జెయిలుకువెళ్ళే జీతగాడికి అసలుబండారమంతా తెలిసి వుంటుంది కాబట్టి, ఎవరయినా బయటినుండి కొంచెంనిప్పందిస్తే వాడు రాడికల్‌గా మారే ప్రమాదంవుంది. అన్నాసాగరంలో సరిగ్గా ఇదేజరిగి దొరవారికి పీకలమీద కొచ్చింది. అదివేరేకథ)

ఈ రాంపురానికి రాడికల్ రాజకీయాలు దొరలకొడుకులే తీసుకొచ్చారు- ఏదో పంచాయితీ తెంపడానికి. అయితే పిలిచిన పేరంటంతో ఆగిపోక ఆ రాజకీయం కూలి వాళ్ళలోకి పాకి వాళ్ళను చైతన్యవంతులను చేయడం మొదలుపెడితే వ్యతిరేకించారు. దీన్ని ఎట్లాగయినా అణచాలని ఘనపురంతాలూకా పెత్తందార్లందరితోపాటు తామూ ఆశించారు. ఈ ఆశ తాత్కాలికంగా ఫలించింది. కామ్రేడ్ రమణను పీసర భూస్వాములు చంపినతరువాత ఇక ఆ బెడదవదిలిందని వరంగల్‌జిల్లా ఎస్పీ రామావతార్ యాదవ్‌గారు పత్రికాప్రకటనఇవ్వడం, అదేనిజమని ఘనపురం తాలూకా భూస్వాములు గుండెలనిండా గాలిపీల్చుకోవడం, జరిగింది. అయితే ఆ విజయం తాత్కా-

లికమే. ఊరూరా రమణతో తిరిగిన యువకులు. రమణచేత చైతన్యవంతులయిన యువకులు, ఉన్నారు. వాళ్లు రైతాంగఉద్యమాన్ని మళ్ళీ ముందుకు తీసుకుపోవడానికి ఆయత్తమయ్యారు.

రాంపురంలో వెంకటమల్లు అటువంటి ఒక యువకుడు. అతనిది గొల్లకులం. తండ్రి మల్లయ్యకు 5 ఎకరాలభూమివుంది, కాని ఎకరానికొకడన్నట్టు 5 గురు కొడుకులున్నారు. నాలుగవకొడుకు వెంకన్న చురుకయిన కుర్రవాడు. స్ఫురద్రూపి. స్పష్టమయినమాట. అతనిఅనుభవం పరిమితులలో అసామాన్యమయిన అవగాహన. 'రమణతో తిరిగాడు' అని ఊరిలోపేరు.

ఈ సంవత్సరం వానాకాలం వచ్చిరావడంతో రాంపురంలో కూలిపోరాటం మొదలయింది. ఎంతో దౌర్జన్యానికి దారితీసిన ఆ పోరాటంలో విషయం చాలాచిన్నదే. చుట్టుపక్కలనున్న మడికొండ. పెకులగూడెం, ధర్మసాగరం గ్రామాలలో స్త్రీలకు ఇచ్చేకూలి రాంపురంలోగూడ ఇవ్వాలన్నారు. నాట్లకయినా కోతలకయినా ఆ గ్రామాలలో ఇచ్చేది 5 రూపాయలయితే రాంపురంలో ఇస్తున్నది 3 రూపాయలే. జీతగాళ్ల జీతాలుగూడ 1000 నుండి 1200 రూపాయలకు పెరగాలని డిమాండుచేసారు. సమ్మె చేయాలని నిర్ణయించుకున్నారు. డప్పుకొట్టుకుంటూ సమ్మెకుపిలుపిచ్చిన యాదగిరి మీద భూస్వాములు కన్నువేసారు. చర్చలకని రైతుకూలీసంఘాన్ని పిలిపించి, అదే సమయంలో పోలీసులనూ పిలిపించి, యాదగిరినీ సామ్యుయెల్‌నూ అప్పజెప్పారు. తరువాతిరోజు భూస్వాముల కులస్థులు 50 మందికలిసి మరొక 13 మంది రైతుకూలీ యువకులను తాళ్ళతోకట్టి మడికొండ పోలీసుస్టేషన్‌కు మార్చ్‌చేయించారు. కత్తులతోనూ ఇతర అపాయకర సాధనాలతోనూ స్త్రీలను నాట్లపనికి పోనీయకుండ దౌర్జన్యంగా ఆపారని ఫిర్యాదుచేసారు. అంతటి సాయుధదుండగులు (తమ అక్కచెల్లెళ్లనూ తల్లులనే కత్తులతో బెదిరించగల వాళ్లు) నిరాయుధులయిన సర్పంచ్‌వంటి పెద్దమనుషులచేతికి ఎట్లాచిక్కారో, వాళ్లు నడవమంటే కిమ్మనకుండ మడికొండ దాకా ఎందుకునడిచారో అన్న సందేహం మడికొండ రూరల్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గారికి రాలేదు. వారిప్రపంచంలో ఆలోచనలకు తావులేదు కాబట్టి సందేహాలకూ తావు లేదు. 'మేముండగా మీకెందుకింత శ్రమ' అని అలసిన భూస్వాముల లేతపాదాలను చూసి నొచ్చుకొని 'నిందితుల'లో 4 గురిని విడిచిపెట్టి 9 మందిని లాకప్‌లో వేసుకున్నాడు. వాళ్లలో వెంకన్నఒకడు. వెంకన్న అన్న రాములు మరొకడు. ఇది జరిగింది జూలై 8న.

శః 9 మందిని 13 రోజులు మడికొండ లాకప్‌లో ఉంచారు. అయిదురోజుల పాటు ఒళ్లువాచిపోయేలాగ కొట్టారు. బోర్లాపడుకోబెట్టి మోకాలికీళ్ళకు అడ్డంగా దళసరి లాఠీనిపెట్టి దానిమీద నిలబడి అరికాళ్ళమీద గంటలతరబడి కొట్టారు (దీన్ని 'రోకలిబండలు ఎక్కి-య్యడం' అంటారు). మడికొండ లాకప్ చిత్రిహింసలకు ప్రిసిద్ధమయినది. ఇది ఒక అమీన్ మీదో ఒక సర్కిల్ మీదో ఆధారపడ్డసత్యం కాదు. రైతాంగ ఉద్యమం బలంగావున్న పాృింతంలో రూరల్‌సర్కిల్ కేంద్రిం చిత్రి హింసల కేంద్రిం కాకతప్పదు.

అయిదురోజులయినా వాళ్ళను కోర్టుకు తేకపోయేసరికి వరంగల్ రూరల్ డిఎస్‌పిని అడగడానికి ఒక సాయంకాలం పౌరహక్కుల సంఘం వాళ్లువెళ్లారు. డిఎస్‌పి ఇంటి ఆవరణలో పదిమంది మోతుబరుల లాగవున్నవాళ్లు కనబడ్డారు. నున్నని గడ్డం, తెల్లటిదోవతి, లాల్చి, పెద్దమనుషుల ప్రితిరూపాలలాగున్నారు. డిఎస్‌పితో మాట్లాడుతుంటే ఆయనగారు 'మీరేమో ఆ కూలివాళ్ళను కోర్టుకు తెమ్మంటారు. కాని బయట రాంపురం ఆసాములున్నారు చూడండి. వాళ్లు ఆ కూలివాళ్ళను పొరబాటున గూడ రిమాండ్‌చేయొద్దనీ, బెయిల్‌మీదతిరిగొస్తే తమ పాృణాలకుముప్పనీ సాయంత్రిం నుండీ నా పాృణాలుతోడేస్తున్నారు' అన్నాడు. ఆ ఆసాముల పైరవీయే నెగ్గింది. మరొక ఎనిమిదిరోజులు చట్టవిరుద్ధమయిన నిర్బంధం, చిత్రిహింసలు, అనుభవించాకగాని రాంపురం రైతుకూలీలు కోర్టుకు, అక్కడినుండి జెయిలుకు, అటుపిదప బెయిలుమీద ఇంటికి, వెళ్ళలేదు.

ఆగస్ట్ 15 వచ్చింది. గత సంవత్సరం ఆగస్ట్ 15న గ్రామపంచాయితీ కార్యాలయంలో త్రివర్ణపతాకం ఎగరలేదు. వెంకటమల్లు నాయకత్వాన రాడికల్స్ దాన్ని ఎగరనివ్వలేదు. ఈ సంవత్సరం నలుగురు ఖాకీజవాన్ల సంరక్షణలో మువ్వన్నెల జెండా పైకి ఎగబాకింది. ఈ నాలుగవవన్నె లేకుండ ఆమూడు వన్నెలకు భద్రత లేదు. ఆరోజే పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ రాంపురం వెళ్లికూలిజనంతో మాట్లాడి వాళ్ళపై జరిగిన అత్యాచారాల గురించి తెలుసుకుంది. పౌరహక్కుల సంఘాన్ని అటకాయించడం, ఘెరావ్‌చేయడం, వరంగల్ భూస్వాములకు కొత్త కాదుగాని, ఆరోజు వచ్చిన నిజనిర్ధారణకమిటీ సభ్యులలో తమను కాలేజీలోకాపీకొడు తూండగా పట్టుకున్న పంతుళ్లుండడంచూసి రాంపురం భూస్వాముల వీరకిశోరాలు కించిత్ సిగ్గుచెంది వెనక్కి-తగ్గారు.

ఆరోజు వెనక్కి తగ్గారుగాని తరువాతి రోజు విజృంభించారు. వెంకటమల్లు అన్న రాములును పట్టుకొని గ్రామరాజ్యానికీ రామరాజ్యానికీ చిహ్నమయిన పంచాయితీ ఆఫీసులో కట్టేసి నిజనిర్ధారణ కమిటీతో మాట్లాడినందుకు కొట్టబోయారు.

ఆగస్టుపోయి అక్టోబర్ వచ్చింది. అక్టోబర్ అంటె సారాపంచాంగంలో చైత్రమాసం. పెద్దపెద్ద గుత్తేదార్లమధ్య 25 శాతంపోటీ 75 శాతం సర్దుబాటు ప్రాతిపదికమీద సారా వేలంపాట ముగిసింది. మూడేళ్లలో మూడవసారి సారాధర పెరిగింది, నిన్నగాకమొన్న 'సాగ్రాం' రూపాయిన్నర ఉన్నది నాలుగున్నర అయింది. ఊళ్ళనూ జిల్లాలనూ మింగే గుత్తేదార్ల పెత్తనమే తప్ప దీనికి వేరేకారణం లేదు. ధర తగ్గేవరకు సారా తాగొద్దని విప్లవపార్టీలన్నీ పిలుపిచ్చాయి. రాంపురంలోగూడ రాడికల్స్ సారాదుకాణాన్ని మూయించారు. సారావ్యాపారంవల్ల ప్రత్యక్షంగానో పరోక్షంగానో లాభపడే పెత్తందార్లందరికీ ఒళ్ళు భగ్గునమండింది.

దసరా (విజయదశమి)కి ముందురోజు రాములుకూ ఒకదొరకూ ఘర్షణజరిగింది. ఆ దొర తనకంచెలో గొడ్లూగొర్రెలూ మేపుకుంటున్న వారిమీద విరుచుకుపడ్డాడు. ఒకరినికొట్టాడు. ఎందుకుకొడుతున్నావని రాములు ప్రశ్నిస్తే రాములును కొట్టడానికి చెప్పుతీశాడు. రాములు తిరగబడి గొడ్డలితిరగేసి దొంసుకొట్టాడు. వెంకటమల్లు అడ్డమొచ్చి అన్నను గదిమాడు. దొరగాయాన్ని కడిగికట్టుకట్టాడు. అంతలో భూస్వాములంతా పోగయ్యేసరికి అన్నదమ్ములు పారిపోయారు. పోలీసులు వచ్చి గ్రామరాజ్యానికీ రామరాజ్యానికీ (పునశ్చరణ అనుకోకుంటే) ప్రతీకఅయిన గ్రామ పంచాయితీ కార్యాలయంలో మకాంవేసారు. ఆ రాత్రి మరొక దొరబిడ్డ రాములు గుడిసెకు కిరోసిన్‌పోసి నిప్పంటించాడు. రాములు అన్న కొమురయ్య అతికష్టంమీద నిప్పార్పుకొని గుడిసెలోవున్న గొడ్లనూ కోళ్ళనూ కాపాడుతున్నాడు. పోలీసులు కదిలిరాలేదు.

తరువాతిరోజు భూస్వాములు స్వయంగా సారాదుకాణాన్ని నడిపారు. పారిపోయిన అన్నదమ్ములు మూయించడానికి తిరిగొస్తారనికాబోలు, ఆరోజు రాలేదుగాని, పొలం బీడుపడుతుందన్న భయంతో అక్టోబర్ 20 సాయంత్రం వెంకటమల్లు తిరిగి వచ్చాడు. దొరల కొడుకులు నిన్ను చంపుతామని బెదిరిస్తున్నారు వెళ్ళిపొమ్మని తల్లి చెప్పినా వినలేదు. కొట్టింది తానుకాదు. పైగా గాయాలుకడిగి దెబ్బలకు కట్టుకట్టించింది తాను. ఎవరయినా తననెందుకు చంపాలి? అని వెంకన్న అమాయకంగా అడిగాడు.

21 తెల్లవారి దొరకొడుకులు వెంకన్నకోసం ఇల్లిల్లూ వెతికారు. తల్లినీ అక్కనూ వదినెనూ బూతులుతిట్టారు. ఇంటితలుపులు విరగగొట్టారు. పక్కింట్లో దాక్కొనివున్న వెంకన్న పారిపోయి చింతచెట్టుఎక్కితే పసిగట్టి దగ్గరికివచ్చారు. అతను కిందికిదూకి మళ్ళీ ఊరిబయటికి పారిపోతుంటే ఊరిచుట్టూ మాటేసిన వారిలో ఒకడు అటకాయించి మెడమీదకొట్టి కిందపడేసాడు. అందరూ వెంకన్నమీదపడ్డారు. అప్పుడు సమయం ఉదయం ఎనిమిదిన్నర. రెండుగంటలసేపు వెంకన్నను కట్టెలతో చితకకొట్టారు, కత్తులతో పొడిచారు. 'కూలి పెంచమంటావా?' 'రాడికల్‌నని చెప్పుకుంటావా?' 'చుట్టుపక్కలగ్రామాలలో మేడే జెండా ఎగరేసింది నువ్వుకాదా?' 'సర్పంచ్ పెట్టించిన సారాదుకాణం మూయిస్తావా?' అని అడుగుతూ 'రమణను చంపినట్టే నిన్నుచంపుతాము' అని చావగొట్టారు. అడ్డువచ్చినవాళ్ళను 'నువ్వూ రాడికల్‌వే' అనితిట్టారు. చివరికి ఊరిబయట చింతచెట్లకింద శవాన్నిపడేసి ఇంకా కసితీరక కణత మీద గొంతుమీద కత్తితోగాట్లుపెట్టి, ఏడుస్తూ దగ్గరికొచ్చిన వెంకన్న ఎనిమిది సంవత్సరాల మరదలిమీద రాయివిసిరి తరిమికొట్టి వెళ్ళిపోయారు. చేసింది దొరలకొడుకులే అయినా దొరలందరి ఆమోదంతోనూ జరిగింది హత్య. అందరూ ఆరోజు వూళ్లోనే ఉన్నారు. వెంకన్నను ఒక్కొక్కరి ఇంటికీ తీసుకుపోయి కొట్టారు.

పోలీసులొచ్చారు, కాని హంతకులయిన దొరల కొడుకులను అరెస్టుచేయడానికి కాదు. హత్యచేసినట్టు సర్పంచ్ వరంగల్‌జిల్లా పోలీసు అధికార్లకు చెప్పడానికిపోతే 'మీరేకాలబెట్టేయక మాదగ్గరికెందుకొచ్చారు?' అని ప్రశ్నించారట. వెంకన్నను చంపిన వాళ్ళందరిపేర్లూ అతనితల్లి పోలీసులకు చెప్పించి, కాని వాళ్ళ దృష్టిదానిమీద లేదు. తమ్ముడి శవాన్ని చూడడానికి రాములు రాకపోతాడాఅని వాళ్ళ ఎదురుచూపు. శవాన్ని పూడ్చిపెట్టేవరకూ 'రాములు ఎప్పుడు వస్తాడు?' అని హతుడి తోబుట్టువులను వేధిస్తూ మాటువేసారు పోలీసులు. అప్పటినుండి ఇప్పటివరకు గ్రామంలో ఎనిమిదిమంది జవాన్లతో పోలీసు క్యాంపుంది. వాళ్ళకోసం కంట్రోల్ బియ్యం గ్రామం ఖర్చుమీద సప్లైచేస్తున్నాడు హంతకుడయిన సర్పంచ్. హంతకులందరూ గ్రామంలోనే వున్నారు. విందులుచేసుకుంటున్నారు. పోలీసులకు విందులు చేస్తున్నారు. రాములువస్తే వాడినిగూడ చంపుతామని బాహాటంగా బెదిరిస్తూ తిరుగుతున్నారు. వచ్చేసంవత్సరం జెండా వందనానికి ఎవ్వరూ అడ్డురాకూడదన్న దేశభక్తి తప్పవాళ్ళలో వేరేస్వార్థం లేదు.

— కె. బాలగోపాల్

సారాంశం

విదుషడు

కారు నిశ్శబ్దంగా పోతూవుంటే రాజుగారు వెనకసీట్లో ఓమూలకి విశ్రాంతిగా ఆనికూచున్నాడు. అతనికళ్లు రోడ్డునీ జనాన్నీ పరిశీలిస్తున్నాయి. తనమనుషులు ఇచ్చిన ఇన్ఫర్మేషన్ ఏమాత్రం తప్పుకాదనే అతనికి అనిపిస్తోంది.

ఎందుకంటే రోడ్డుకి రెండువైపులా ఫాన్సీషాపులు, కంగన్‌హాళ్లూ, బట్టల షాపులూ, ఫర్నిచర్ షోరూములూ, వీడియోపార్లర్లూ, బ్రాందీషాపులూ అన్నీ కళకళ లాడుతూ రద్దీగావుండటంతో అతడికి సంతృప్తికలిగింది. అతను గత రెండ్రోజులు సినిమాహాళ్ల దగ్గర తక్కువక్లాసు 'క్యూ'లనిగూడా పరిశీలించాడు. అవి కొండవీటి చాంతాడంతపొడుగున్నాయి. అప్పుడు టికెట్లు దొరకని తక్కువక్లాసు వాళ్లంతా పైక్లాసుల బుకింగుల మీదికి ఉప్పెనలా ఎగబడ్డమూ చూశారు రాజుగారు.

దాంతో ఈప్రాంతం ప్రజలకి తానుముందు అనుకున్నట్టుగానే తలసరి ఆదాయం బాగాఉందని నమ్మకం కుదిరింది. ఆదాయం సంగతెలావున్నా ఆనందంకోసం జనం డబ్బుఖర్చుకి వెనకతియ్యరని గూడా అర్థమైంది.

ఆధైర్యంతోనే పాతకాంట్రాక్టర్లకన్నా తాను నెలకి పద్దెనిమిదిలక్షలు అంటే సంవత్సరానికి రెండుకోట్లపదహారులక్షలు పాటపెంచాడు. అందువల్లే ఈ సంవత్సరం ఈసిటీ సారాకాంట్రాక్టు తనకి వచ్చింది. చౌదర్లని మట్టికరిపించాడు తాను. రాజులంటే తడాఖాచూపించాడు.

కార్లో కూర్చున్నరాజుగారు టూత్‌బ్రిష్ మీసాన్ని సవరించుకుని ఖద్దరుచొక్కా జేబులోంచి చుట్టబయటికి తీశారు. అది గోదావరి లంకల్లో పండిన పొగాకుచుట్ట. స్వయంగా రాజుగారే చుట్టుకుంటారు చుట్టల్ని. గుప్పున వెలిగించి దమ్ములాగుతూండగా కారు సడన్‌గా బ్రేకుపడింది.

"ఏట్రా ?" అన్నాడు రాజుగారు కిటికీలోంచిచూస్తూ డ్రయివర్‌తో.

"ట్రాఫిక్ జామ్మయి పోయిందండి. ముందు బళ్లన్నీ కదల్డం లేదు" అన్నాడు డ్రయివర్.

రాజుగారు తల లోనికి లాక్కుని చుట్టపీలుస్తూ ముందు అద్దంలోంచి చూశాడు. ఓసిటీబస్సు ఆగివుంది. దానివెనక బాంబేడయింగ్ వాడి అడ్వర్టైజుమెంటు బొమ్మ

వుంది. ఓపిల్లచెయ్యినీ ఓకాలునీసాచి చీరనిపరిచి చూపెడుతోంది. ఆపిల్ల ఒంటి నిండా చీరవున్నట్టేవుందిగానీ అవయవాలు అన్నీ తెలుస్తున్నాయి. మొహం ఎలా వుందోనని చూడబోతే నల్లటి పోస్టరొకటి అక్కడంటించివుంది. అది చదివిన రాజు గారు ముఖం చిట్లించారు.

"సారాయి పందగ్రాములు మూడు రూపాయలకే అమ్మాలి? ఇదేంపోస్టరు?" రాజుగారు చటుక్కని నోట్లోనించితీసి సరిగాచూడబోయారు గానీ ట్రాఫిక్ క్లియరై బస్సు కదిలిపోయింది. "ఇదేమిటి? సారాని పందగ్రాములు మూడ్రూపాయలకే ఎలా ఇవ్వటం? అసలు ఎలా కుదురుతుంది? ఈ అడిగేదెవరు? పోస్టరువేసిందెవరు? సారాధర తగ్గాలని ఎవడన్నా పోస్టరువేస్తాడంటే నమ్మడానికే వీలు కావటంలేదే?"

రాజుగారు చటుక్కని రెండుసార్లుపిల్చి "ఒరేసన్నాసి! కార్ని పరిగెత్తించి ఎదురుగ్గా ఆ బస్సెనకపెట్రా!" అన్నారు.

డ్రైవరు సన్నాసి యాంత్రికంగా ఆక్సిలేటర్నినొక్కి కార్నిదూకించాడు. ఒక నిముషంలో మూడువాహనాల్నిదాటి సిటీబస్సు వెనకవుండి కారు.

"కాసేపు ఈ బస్సెనకే ఎళ్లు" అన్నారు రాజుగారు పోస్టర్నిచదవడానికి ముందుకి వంగుతూ. పోస్టర్నిచూస్తూనే నుదురుచిట్లించాడు. నిజమే తానుచదివింది. సారాయి ధర తగ్గాలని రాడికల్స్ వేశారు పోస్టర్లు!

"ఈనా కొడుకుల కళ్లల్లోనూ పడ్డాన్నమాట!" అనుకున్నాడు. ఏటి వీళ్లవుద్దేశం? ఉత్తబెదిరింపా లేక దీన్నిసాగిస్తారా? కొట్టిపేయడానికి వీల్లేదసలే. రాడికల్సంటే ఏటో చిన్నబ్బాయి ఇంతకుముందే చెప్పాడుగూడానూ! 'అల్లన్తట్టుకోడం అట్టేకుదర్దు సందాలడిగే సీకటోళ్లనుకుంటన్నారేవోగాని ఆలదగ్గిర అదేంనడవదు. సందాలసీకటోల్లు యేరే, రాడికల్సుయేరే! రాడికల్సంటే మరిరాడికల్సే. ఆడు జెప్పిందినకపోతే ఆడోనువ్వో. ఎవుడో ఒగుడే ఉంటాడు తర్వాత. అల్లదంతా పేరలల్ గౌర్మెంట్! అసలు గౌర్మెంట్ కంటే ఆల్లేపవర్ఫుల్.' అంటూ చిన్నబ్బాయి తనకి చెప్పినప్పుడు తాను తేలిగ్గాతీసేశాడు. 'ఒరే కాపునాయాలా! నేను రాజునిరా! గోదావరి రాజులంటే ఏటొ్రే! ఎడ్మినిస్ట్రేషను వనగా రూలింగు మాకుతెల్సినట్టు నీకేంతెల్సురా? అంచేతలాగంటున్నావుగాని ఒకతరంకిందిదాకా ఇది కత్తులుపట్టి రాజ్యాలేనినజాతిరా చూడుమరి ఎలా చక్రింలిప్పుతానో!" అని తానన్నాడు. కానీ ఇక్కడికొచ్చింతరవాత స్పాటుమీద కొత్తజంకువేసిన మాటనిజం.

శాంతారావుని రౌడీకల్సి చంపేశారని విన్నప్పుడు ఈల్లనికాస్త జాగ్రత్తగా పట్టించుకోవాలేగానీ మరీ తక్కువంచనా వేయొద్దనితెల్సింది. వాళ్ళ నాయకుడు గిరి భూషణాన్ని పోలీసులతో హత్యచేయించడంలో శాంతారావు పాత్రవుందని సారావర్గాల్లో అందరికీతెల్సు. అందుకే ఇప్పుడివాళ శాంతారావు వాళ్లచేతుల్లో ఘోరంగా చచ్చాడనీ తెల్సు.

శాంతారావుచావుతో సారా సామ్రాజ్యంలో రైడుఇన్‌ఛార్జీలందరికీ గొంతులు దగ్గరపడ్డాయి. పాటని దాదాపు ఎనభై శాతంపెంచి తాను కాంట్రాక్టు తీసుకున్నందుకు చౌదర్లు ఏడ్చారుగానీ ఈ శాంతారావుచావుతో వాళ్లు సంబరపడ్డారు. తామెలాగూవెళ్ళి పోతున్నారు. ఇక ఈరాజులు ఎలాచేస్తారోచూద్దాం అని ఉద్దేశం!

రాజుగారు చుట్టని బయటికి విసిరేశారు. "ఛీ ఛీ! శూద్రవెధవలు- అంతకు మించి ఏంఆలోచించి తగలడతారు?" అనుకున్నాడు.

కారు స్లోఅయింది. "మళ్ళీ ఏమొచ్చితగలడిందిరా?" అన్నారు రాజుగారు విసుగ్గా.

"ఇక్కడట్రాఫిక్కు విపరీతంగా ఉందండయ్యా. నూడండసలు ఒక్కడుగేనా కదల్టానికీల్లేకుండావుంది." అన్నాడు డ్రయివరు కారుని ఫస్టుగేర్లోకిమారుస్తూ.

రాజుగారు చుట్టూచూశారు. అక్కడోసినిమా టాకీసువుంది. చీమలపుట్టలాగా జనం! సైకిళ్లు, రిక్షాలు, స్కూటర్లు, మోటారుసైకిళ్లు, కార్లు పాదచారులు రోడంతా ఊరేగింపుతప్ప రోడ్డుకాదనిపించేటంతజనం!

కారు మెల్లిగాజరుగుతోంది. ఏదోకాలేజీ, ఒకఆస్పత్రి, దానిపక్కనే పాన్ షాపూ, పక్కకిఎర్రబోర్డూ! దానిమీద తెల్లగా పోలీసుస్టేషనుఅన్న అక్షరాలు చూడ గానే రాజుగారికళ్లు మెరిశాయి. ఇంతలో కారుకటలి ఏదోరిక్షానిగుద్ది మళ్ళీసాగిఆగేంత లో ఓసిన్మాటాకీసూ, గేరుమార్చి క్లచ్‌వదిలేంతలోపల మళ్ళీ ఓ సిన్మాటాకీసూ, టాకీసూ, టాకీసూ ఇద్దరు డాక్టర్లఇండ్లూ, పోస్టాఫీసూ, ట్యుటోరియల్‌కాలేజీ, తర్వాత రాజగృహద్వారంలా తెరుచుకున్న రెండు నల్లరేకుతలుపుల సారాడిపో! దానిముందు సైన్యంలా డిపో జవాన్లూ!

రాజుగారు కారు ఆగేసరికే అక్కడ ఇద్దరు పోలీసుయస్సైలు, ఒక పోలీసు జీపు ఎదురుచూస్తున్నాయి. రాజుగారు దిగుతూంటే గాలి "రాజుగారు, రాజుగారు" అన్నమాటల్ని మోసుకుని పరిగెత్తింది.

*　　*　　*　　*

క్లాస్‌రూంలో కనకయ్యమాస్టారి కంఠం వినిపిస్తోంది.

గోవిందయ్య అటువైపునడిచాడు. గదిగుమ్మంముందు నిలబడి "సార్" అని పిలిచాడు. కనకయ్య చెబుతున్న పాఠంవదిలి బయటికొచ్చాడు. గోవిందయ్య అతని ఇంటిపక్క కుటుంబీకుడు.

"ఏందయా! ఇట్లవస్తివి?" కనకయ్య మాస్టారు అడిగాడు.

గోవిందయ్య నీళ్లనములుతూ చెప్పాడు. "మీ అబ్బాయిని పోలీసులు పట్టుక పోయిన్రు"

"ఆఁ!!!" కనకయ్యకు అర్థంకాలేదు ఒక్కనిముషం.

"ఎందుకో తెల్వదిగని మీరు గిట్ల బడికిరాంగనె అట్లపోలీసులచ్చి ఇంట్ల జొర్రిన్రు. అరుగుమీద మంచంఉంటె దాన్ని గుంజిపారేశి తలుపులు తన్నుకుంట లోపలికచ్చిన్రు. మేం అందరం ఏందిరోకతఅని వాకిట్లకుజేరెటాల్లకు దండా బజాయించిన్రు. ఇగమీవోడు ఇంటెనుక గోడదునికి ఉర్కబోతాంటె ఎనుకసందుల ఇద్దరు పోలీసులు రడీగున్నరట. లటుక్కున పట్టుకోని తన్నుకుంట తీస్కపోయిన్రు. ఇల్లంత గందరగోలంజేసి మీఅమెనుగూడ బూతులుతిట్టిన్రు. పోలీసులైరి ఎవలేం జెయ్యలేకపొయినం." గోవిందయ్య చెప్పాడు.

కనకయ్య ఆదుర్దాగా "ఇప్పుడేం జేద్దాం?" అన్నాడు.

"మీరు జల్దిన లీవుబెట్టిరాండ్రి. పోలీసుటేశన్లకుపోయి అసలు సంగతేందో సూద్దాం" అన్నాడు గోవిందయ్య.

కనకయ్య అయోమయంగా హెడ్మాస్టరు రూంవైపువెళ్ళాడు. విషయంవిని హెడ్మాస్టరు కనకయ్య కేసిచూసి

"ఏందయొ మీవోడులంగలతోని తిర్గుతడా ఏంది?" అన్నాడు.

కనకయ్యకు తల కొట్టేసినట్టయింది. "లేదుసార్ మావోనికి లోకంజోలేపట్టది. వాని పుస్తకాలేందో వాడేందో!" అన్నాడు.

"ఏంలేకుంటె పోలీసులు ఎందుకు పట్టుకుంటరయా? పోలీసుల కండ్లల్లపడ్డ డంటె లఫంగి కిందనే లెక్క!" హెడ్మాస్టరు నవ్వాడు.

కనకయ్య నొచ్చుకున్నాడు. "హాఫ్‌డే లీవ్‌శాంక్షన్ చేయండి" అని కాగితం మీద రాసిచ్చాడు.

హెడ్మాష్టరు వంకరవన్నతో కాగితంమీద శాంక్షన్ చేసినట్టు సంతకంచేసి దాన్ని పేపర్ వెయిట్ కిందపెట్టి "సరే వెళ్లిరాండి" అన్నాడు వెటకారంగా.

కనకయ్య బయటికి వచ్చేసరికి గోవిందయ్య బడివసారాలో బీడీకాలుస్తూ నించున్నాడు. అతన్ని చూడగానే కిందపారేసి వణుస్తూ

"రాండి రాండి ముందుగాల పోలీసు ష్టేషనుకుపోవాలె" అన్నాడు.

కనకయ్యకు వ్యవహారాలేమీ తెలియవు. జన్మలో పోలీసుల నీడకూడానోకి ఎరగడు. ఇన్నాళ్ళకి ఈ దౌర్భాగ్యుడి ధర్మమాఅని అదిగూడా అనుభవించబోతున్నాడు ఇంతకీ వీణ్నెందుకు పోలీసులు పట్టుకున్నట్టు? "అసలు సంగతేందయా నీకేమీ తెల్వదా?" గోవిందయ్యని అడిగాడు.

"నాకు ఎవరేం జెప్పలేగని, ఈ మధ్యన సారలొల్లి ఐతాందిగద. దాంట్ల మీవోనికి ఏమన్న సంబంధమున్నదేమొ! అందుకే పట్టుకపొయినుణ్రిగావచ్చు." అన్నాడు గోవిందయ్య.

"నేను నమ్మ! మావానికి అటువంటి సంబంధాలు ఏమిలెవ్వు. కాలేజిపోరగానికి సారపంచాయితి సమందమేంది?" కనకయ్య అన్నాడు.

"ఓ సారూ! మనుసులు మంచోల్లుగానీ శెడ్డోల్లుగానీ పంచాయితులు, శడాయితులు అయినప్పుడు సంబంధమున్నదనిపిస్తే అందర్ని పట్టుకపోతరు పోలీసులు. ఎసుమంటోడు ఏందనిసూడరు" అన్నాడు గోవిందయ్య.

"అంటె ఇప్పుడు మనం నడుస్తానంగద. ఇక్కడేదన్న జరిగిందనుకో! దీంట్ల మనిద్దర్ని ఇరికిస్తరా?".

"తల్సుకుంటె ఉణంపట్టది. పోలీసులబలం మీకేమెర్కసారూ!" గోవిందయ్య నవ్వాడు.

పోలీసుస్టేషను వచ్చింది. గోవిందయ్యా, కనకయ్యా లోపలికడుగు పెట్టారు. తెరుచుకున్న పులినోరు లాగావుంది స్టేషను. దారికిరెండువైపులా ఇటికముక్కలు కోణంగాపాతి పులికోరల్లా తెల్లగానున్నం రంగుతోవున్నాయి.

గేటుదాటుతోంటే కనకయ్య పంచప్రాణాలు విలవిలలాడాయి. రోడుమీదినుంచి తెలిసిన వారెవరన్నా చూస్తున్నారేమోనని తలవంచుకుని నడిచాడు.

"హూత్! ధూత్!!" ఎవడో పశువుల్ని అదిలిస్తున్నట్టుగాతోచి తలెత్తాడు కనకయ్య.

"ఎవడవురా ? సక్కగ నడ్సకుంటత్తానవు ? ఛూట్ !" చేతిలోలాఠితో కనకయ్యని ఒక్కటివేశాడు కానిస్టేబులు.

గోవిందయ్య వారించేలోపలే కనకయ్య పిర్రిలు చురుక్కుమన్నాయి, నిశ్చేష్టుడై ఆగిపోయాడు. కళ్ళలోనీళ్లతిరిగాయి.

"సారుకుతెల్వది, మాఫ్‌కరోభాయి !" అన్నాడు గోవిందయ్య కనకయ్యని పక్కకిలాగుతూ, పోలీసు వెనుదిరిగాడు.

"పోలీసుస్టేషన్లకు పచ్చేటపుడు ఎదురుంగ రావద్దుసార్ ! గీ పక్కెంబడి రావాలె. అమీన్‌సాబుకు ఎదురుంగరావద్దు" గోవిందయ్య చెప్పాకగానీ కనయ్యకు తనుతిన్న దెబ్బకి భాష్యం అర్థంకాలేదు. కళ్లలో ఊరిననీళ్లు చెంపలమీదుగా కారాయి. ఎంతఅవమానం ! పోలీసుఅహంకారం ఇంత వికృతరూపంలో వుంటుందా ?

పక్కనుంచినడిచి స్టేషను అరుగెక్కారు, ఇందాకా దెబ్బగొట్టిన పోలీసే మళ్ళీవచ్చి ఏమీఎరగనట్టు "ఏంగావాలె ?" అన్నాడు పురుగులతో మాట్లాడుతున్నట్టు.

"మా పిలగాన్ని పట్టుకచ్చిర్రట. ఎందుకోతెల్వది. అమీన్‌సాబుతోటి మాట్లాడాలె సార్ !" అన్నాడు గోవిందయ్య వినయంగా.

పోలీసు కాన్‌స్టేబుల్ని "సార్" అనటం కనకయ్యకి చిత్రంగాతోచింది. అతనిమనసు ఉద్వేగంతో కుతకుత ఉడుకుతోంది.

"ఏవాడ మీది ?" కానిస్టేబులడిగాడు.

"కాపువాడ" గోవిందయ్య చెప్పాడు. కానిస్టేబుల్ వెనుదిరిగి వెళ్లిపోయాడు. ఇంతలో మరొకడువచ్చి "క్యాహోనా ?" అన్నాడు ఉర్దూలో.

గోవిందయ్య వాడికీ అదేపాఠంచెప్పాడు. వాడికిచెబుతుంటే ఇంకొక పోలీసు వచ్చాడు. వాడికిచెబుతుంటే మొదటివాడువెళ్లి దూరంగా వేపచెట్టుకింద నిలబడి సిగరెటు అంటించాడు. రెండోవాడు అంతావిని ఇద్దర్నీ అనుమానంగాచూస్తూ వరండా మూలతిరిగి మాయమయాడు.

కనకయ్యకి, గోవిందయ్యకీ ఏమీ అర్థంకాలేదు. అడిగినవాడు జవాబుచెప్పడేం?

"ఏందయా ! అన్ని అడుగుడేగని జవాబుు చెప్పరేంది ?" కనకయ్య గోవిందయ్యతో అన్నాడు.

"పోలీసు మామూలా అట్లనేవుంటదిసార్ !" గోవిందయ్య నవ్వాడు.

ఇంతలో కనకయ్య మాస్టార్ని కొట్టిన పోలీసువచ్చాడు. "రాండి! అమీన్‌సాబ్ పిలుస్తాండు" అని వెనుదిరిగాడు. కనకయ్యా, గోవిందయ్యా అతన్ననుసరించారు.

యస్సయి మోజెస్ కుర్చీలో దిగేసినట్టుకూచున్నాడు. అతడి ఛాతీకీ, పొట్టకీ భేదంతెలీకుండా వుంది. దానిమీద అడ్డంగా ఓబెల్టునిచుట్టి దానికోపిస్తోలు తగిలించుకున్నాడు. గుండ్రని ముంతకి చిల్లిచేస్తే అతని కళ్ళవుతాయి. చెంపలనిండా రెండు సీసాల బీరుపోస్తే ఎలావుంటాయో అలావుబ్బివున్నాయి. పెదాలు రక్తాన్నితప్ప మరి దేన్నీ ముట్టనని ప్రతిజ్ఞచేసిన వాటిలా ఎర్రగావున్నాయి. కనకయ్య మేష్టార్ని చూడగానే

"ఏం గావాల్రా ?" అన్నాడు దర్పంగా.

కనకయ్య ఉలిక్కిపడ్డాడు. ఎవర్నీ ఇంతఅమర్యాదగా పలకరిస్తున్నాడు ?

గోవిందయ్య చేతులుకట్టుకుని నిలబడ్డాడు. "ఈనె హైస్కూల్ల టీచరు. వీల్ల పిల్లగాన్ని మీరుపట్టుకచ్చిండ్రిట, ఎందుకో తెల్సుకుందామని...." నసిగాడు.

"హైస్కూల్‌టీచరైతె అమెరికా ప్రెసిడెంటా ? చేతులు అట్లపెట్టినిలబడ్డ వేందిరా ? నీ కొడుకునెందుకు పట్టుకచ్చిండ్రని అడుగడానికొచ్చినావు ? అవును. ఐతేంది ? రాడికల్సుతోటి తిరుగుతే బొక్కలతోస్తం. ఏందయితే?" యస్సయి తన అధికారపు డిగ్రీని కొలవడానికి వీల్లేనంత స్థాయిలో అన్నాడు.

కనకయ్య దిమ్మెరపోయాడు. యస్సయి అంటే గ్రాడ్యుయేట్ అయివుంటాడు గనక శాంతమర్యాదగా మాట్లాడతాడనుకున్నాడు. ఎదురుగా కుర్చీలున్నాకూచోమని అనలేదు సరికదా పైవించి దుర్భాషలు !

"ఏమె మిటకరించిసూస్తానవేందిరా ? ఏంది సంగతి ? కనకయ్యని చూస్తూ అన్నాడు యస్సై.

"ప్చ.... అదికాదండీ !" కనకయ్య అనబోయాడు.

"ప్చ అంటానవు ? నీకే ఇంతయాష్ట అయితాందా ? స్కూలు టీచరువేమొ గాదుర మాదర్చోద్ ! ఎక్కడెట్ల మాట్లాడాల్నోతెల్వదా ?" యస్సయిలేచి లాఠీని టేబిల్‌మీద కొట్టాడు.

కనకయ్య అదిరిపడ్డాడు. "ఇదేమిటండీ! చెప్పేదివినకుండా...."

"లంజకొడుకా ! నువ్వెవ్వర నాకుజెప్పేది ?" యస్సయిలేచాడు.

* * * *

"ఈ ఎదవయాపారంకన్నా హాయిగా మెడ్రాసులో సినేమాలుతీస్తూ కూసుంటే సరిపోయేది. మన గుమాస్తాపంతుళ్ళలాగ ఆడ చెట్లకింద తలకుమాసిన రచయితలు అనేకం ఉంటారు. ఎవుడో ఒగుణ్ణిబట్టుకుని సింగిలిడ్లీ, అరకప్పు కాఫీ ఇప్పిస్తే అదిరిపోయేట్టు కథరాసిచ్చేవాడు. దాన్ని లోబడ్జెటు పిచ్చరుగా లాగిపారేసి జిల్లాల వారీగా అమ్మితే అప్పటికప్పుడు పీడావదిలిపోయేది. ఎదవముండాగోల! ఈ సారా అంత కంపుయవారం మరోటిలేదనుకో!" రాజుగారు చుట్టముట్టించి గుప్పుసపొగవదిలి "దాన్లో ఇంకోసుకముంది ఓపిచ్చరు తయారుకాగానే అమ్మేసి రెండోపిచ్చరుకీ ప్లాన్ చేసుకోవచ్చు. ఇదలాక్కాదే! రాడికల్సూ వాళ్లబొందానూ!" అన్నాడు

"మీరలాగంటే యెలాగండే! రాడికల్సు గూడా సినేమాలు తీసేత్తన్నారండే! అల్లు మనసారా బిజినెస్సులోనూ దిగారు. సినేమాల్లోకీ దూకేరండి! సారా కాంట్రాక్టుల్లో పెట్టుబడేంలేకుండా మేం రాడికల్సుమి సుమా అన్జెప్పి బెదిరించి వాటాలు దొబ్బుస్తున్నారు. సినేమాలుగూడా సవగ్గా మనకంటేగూడా మరీసవగ్గా తీసేస్తున్నారంటే నమ్మండి" సారా సిండికేట్లో పావలాపార్ట్నర్ అన్నాడు రాజుగారితో.

రాజుగారు నవ్వారు. "ఇలక్కూసో" అన్నారు దయగా. పావలాపార్ట్నర్ భక్తిగా మోడానీద కూచున్నాడు.

"నీకిప్పుడు ధర్మసూక్ష్మం ఒగటిజెప్తాను. వ్యాపారానికి పునాది మానవుడి బలహీనతే అన్జెప్పి శాస్త్రంజెప్తోంది. అది పూరాగా నిరూపణ అయిందిగూడానూ. సారాకీ సినేమాకీ తేడా ఏటన్నావుందా? వుంటే అదేంటోజెప్పు! అప్పుణ్నీకాలిబర్ నాకు అర్ధమైద్ది" అన్నారు రాజుగారు.

పావలాపార్ట్నర్ చెవివెనకా, ముక్కుమీదా, చెంపలపక్కనా గీక్కుని "యురేకా" అన్న ఫోజులో అన్నాడు.

"సారాని మగాళ్లమాత్రివేఁతాగుతారండి. సినేమాని ఆడా, మగా అందరూ సూత్తారండి! అదీ తేడా!"

"ఛీ ఛీ! నా సిండికేట్లో నువు పావలాపార్ట్నర్ వెలా అయావయ్యా! నువ్వెలాటి బుర్రతక్కువవాడివని తెలిస్తే మినిస్టర్నిజేసి కూసోబెట్టేవాడిని. సినేమాకీ సారాకీ కనెక్షను తెలీకుండా బిజినెస్సులోకెలాదిగావయ్యా"! అని విసుక్కుని "వినుమరి, సినేమాకన్నా సారాకి ధరెక్కువ. వొందగ్రాములసారాకి కనీసం ఎక్కడైనా రెండున్నరకన్నా తక్కువుండదు. సినేమాఖరీదు ఎక్కడైనా ముప్పావలాకి ఎక్కు-

వుండదు. వందగ్రాములసారానిషా అరగంటయితే, రెండుగంటల సినేమానిషా రెండేళ్లపైగా వుంటిద్ది. అవలంతకన్నా ఎక్కువేసుకో. నాచిన్నప్పుడెప్పుడో కాంచనమాలని జూసేను. ఆవిడకళ్ళని మరిపించగల గుంటఎవర్తీ ఇంతవరకూ సినేమాఫీల్డులో రాలేదు. అంటే నాలాంటి యాపారవేత్తనే జయించేలక్షణం సినేమా కుందంటే ఇగ దానిఇలవ నీకుతెలిసుండాల ఈపాటికీ! ఈ రెండుగూడానూ జనాన్ని ఉబ్బిపించి డబ్బులుగొరిగేటియే! కాబట్టే సినేమాకీ సారాకీ కనెక్షను. ఇగపోతే రాడికల్సు సినేమాలు తీత్తన్నారన్నావే! అదినేన్నమ్మను. రాడికల్సును ఉపయోగించు కునేవాళ్లే అలాంటిసినేమాలుతీత్తారు. ఎలాగంటే ఈకాలపు ఆడపిల్లలకి పెళ్ళిళ్లవుతాయా అంటూ నేనూ ఒకసినేమాతీశాను. ఎందుకూ? అది నాకోసమస్యగాబట్టా? అది ఈరోజుల్లో పేద్దసబ్జెక్టు. దానిమీద సినేమాతీస్తే గ్రాండుసక్సెసు! అంచేత సినేమాలాగించేసు. దాంతో ఏటయిందోనీకెరికా? సామాజికస్పృహో దానిబొందో అదేదోనాకుందనీ, దానెమ్మాశిగదరిగినన్ని ప్రశంసలూ, డబ్బులూగుప్పించేసేరు జనం. అలాగే రాడికల్సుపేరుతో కొందరు సినేమాలుతీస్తున్నారు. ఆ సినిమాలకీ నాకూపోలికేలేదు. నా సినిమాల్లో హీరోయిన్ల రొమ్ముమీదిగుడ్డతియ్యరు. మరి రాడికల్ సినీమాలో అన్నీఅవుపడ్తాయి, అదేంటంటే సన్నివేశం, సహజత్వంఅంటారు. నా హీరోయిను నడుంవూపిందానికీ, నీ హీరోయిను కాలిపిక్కలు చూపిందానికీ తేడా ఏమిటీ? ఏమీలేదు. నీదోముసుగు, నాదోముసుగు! సముద్రంలో బంగారంవుంది. నువ్వోదారినించి వస్తున్నావు. నేనోదారినించి వస్తున్నాను. ఇంతకుమించి తేడాఏమీ లేదు సొమ్ముసంపాదించుకునేదగ్గిర నాతో పోటీపడేవాడివి నాకన్నా వేరేఎలాగవుతావు? అంచేత నీదీ నాదీ ఒకేజాతి!!" ఆరిపోతున్న చుట్టని గుప్పునలాగి పొగనివూది "ఐతే నువ్వే అసలురాడికల్వని నేనుఅనను. ఆల్లుయేరేవున్నారు, ఆల్లతోనాకు ప్రమాదవే. కాని చెప్పేదేటంటే నువ్వు రాడికల్వికాదు. నీతోప్రమాదంలేదు. అదీసంగతి" అన్నారు రాజుగారు.

పావలాపార్ట్నర్ గిర్రునతిరిగి అడ్డంపడిలేచి "ఏమిటండీ మీతెలివి? మీ దగ్గిర ఎంతజ్ఞానంవుందీ?!" అని ఆశ్చర్యపోయాడు.

"సారాకాంట్రాక్టరుదగ్గిరా, బ్రోతల్సు బ్రోకర్దగ్గిరాతప్ప నిజమైనజ్ఞానం ఎవుడిదగ్గిరావుండదు. ప్రపంచభాషసమస్తం సారాలోనూ, సానిదానిలోనూ తూరాడు భగవంతుడు! ఇదిశాస్త్రజ్ఞానం" రాజుగారు చిరునవ్వునవ్వారు.

పావలా కాంట్రాక్టరుబుర్ర కాంతివేగంతో సెకనుకి రెండులక్షల తొంభయి తొమ్మిదివేల ఏడుపందల కిలోమీటర్ల వేగంతో అరసెకనుపాటు తిరిగి ఆగింది.

* * * *

"రాత్రిలొల్లిల నువు ఉన్నావుర ?" శివయ్య కొడుకుని అడిగాడు.

"ఏలొల్లి ?" కొడుకు అన్నాడు

"అలంకార్ టాకీసు దగ్గర సారదుకానంల ఎవన్నో నరికి రెండుముక్కలు జేశిన్రిటగద !" తండ్రి మాటలకి కొడుకు నవ్వాడు.

"ఎవడే నీకు జెప్పింది ?"

"ఏమో అందరు అనుకుంటాండ్రిరా !"

"అంత అబద్ధం సారదుకాంగ్లు బందుపెట్టమన్నరు గద రాడికల్సు ! ఆ సార దుకానపోడు జబర్దస్తీగ సారదీస్కచ్చి నకుప బొయిండు. అప్పుడు రాడికల్సుపోయి సారటిన్నును రెండుముక్కలు జేశిండ్రి మనిషినిగాదు." అన్నాడు నవ్వాపుకుంటూ.

"మరి కతగిట్లబుట్టిందేమిరా! బాంబులతోని, గొడ్డండ్లతోని, కత్తులతోనిపోయి సారతెచ్చేటోన్ని నడిమికినరికి. తాగెటోల్లనుగూడ కొట్టి నానాగందరిగోలం జేసిన్రిట గాదుర." తండ్రి సంశయంగా ప్రశ్నించాడు.

"ఎహె ఈకెకు తోకబుత్తది. ఉన్నది గింతయితే గంతజేత్తరు నేను జెప్పిందే కరక్టు" కొడుకు నిశ్చయంగా అన్నాడు.

"మరి నువ్వు లేనేలేవేమొగాదుర. కచ్చితంగ ఎట్ల జెప్పుతానవు ?" శివయ్య అనుమానంగా చూశాడు కొడుకుని.

"నేనెందుకు పోయిన ఇదువరదాక ట్యూషనుకేపోతిని రోజు అటేపోతాన నాకు దీని సంబంధమేంలేదు" కొడుకు మాటల్లో నిజాయితీ కన్పించింది శివయ్యకి "నిజమేలే ? వాడు రోజూ టయిముకిపోయి టయిముకే వస్తుండే" అనుకున్నాడు.

"సరె అన్నంతిని ఈరాత్రికి ఎక్కడన్నదోస్తులఇంట్ల పండుకో! ఎందుకైన మంచిది." అన్నాడు.

"ఎహె! నేను ఆలొల్లిల లేనంటె ఇనవేంది!" కొడుకు విసుక్కొని లోపలికి వెళ్ళాడు.

శివయ్య కొడుకు పోయినవైపే చూస్తూ జేబులోంచి బీడీతీసిముట్టించి వరండాలో మంచం వాల్చుకుని ఒరిగాడు. బీడీ అయిపోయేంతలో ఎదురింటి పుల్లయ్య వచ్చాడు. "పన్నావే శివన్నా" అంటూ.

శివయ్య బీడిపారేసి లేచికూచుంటూ "లేలే ! ఏంసంగతి?" అన్నాడు.

"సంగతేమున్నది? రాడికలోల్ల ముచ్చట ఇన్నివా! మనుసులనే నరికిపారేత్తా నరిట" అన్నాడు పుల్లయ్య.

శివయ్య నవ్వులపుకుని "ఎవడయ్య జెప్పింది? సారధర తక్కువజెయ్యి మనుడు గూడ తప్పేనా? ధరతక్కువజేశేదాక దుకాండ్లు బందుపెట్టుమన్నారు. ఇన కుంట నడుపుతె పోయి బందుబెట్టిత్తాండ్లు. దీంట్లతప్పేమున్నది? వాడెవడో కొత్తోడు వచ్చి నెలకు ఇరవైలచ్చలు పాటపెంచిండట. ఆసొమ్ముంత యాన్నుంచిఎల్లుద్ది? మన మీద నూకిండు. అంటె లీటరుసారకు పదిరూపాయలు పెంచిండు. ఎవడుగట్టాలె ఇదంత?" అన్నాడు.

"మరి తాగుడుబందుజేస్తేపోలే?" అన్నాడు పుల్లయ్య. "ఇగో పిచ్చిముచ్చట్లు బెట్టకు, తాగుడుబందుజేసుడంటె కుదిరేపనేనా? సరింగజెప్పు అదిఅసలుఅయిద్దా? కాదుగాకకాదు. అంతటితోటి ఇగ ఎట్లయినా తాగుతానర్రిని రేట్లుబెంచుతావు? ఎవడవురా నువ్వు? నీకోసంగతెరకేనా? కలెక్టరు పాటమీద ముప్పైపర్సెంటు పెంచినోనికే కాంట్రాక్టుఇస్తనని కూసున్నడట. ఎర్కేనా? అందుటితోని ఈరేటు మనకచ్చింది. ఇదంత గౌర్మెంటు పుట్టిచ్చిన లొల్లేగని సారమస్తాజర్ల పనిగాదు. పాపంవాల్లు నల్లగ మాములాజేసోకని యాల్లపొద్దుగాల బయటపడ్డామనే సూస్తరు. ఏ పార్టీవోడు అడిగినా సంచాలిచ్చి పంపిత్తరుగని పంచాయితికీ దిగరు. ఎందుకంటె యాపారం ఎల్లాలెగద!" అన్నాడు శివయ్య.

పుల్లయ్యలేచి లుంగీని పైకికడుతూ "నువుజెప్పినయన్ని నాకుతెల్వదా? పోలీసుల అరాచికం ఎట్లున్నదో సూడమని జెప్పటానికి అచ్చిన. కనుకయ్య సారు కొడుకును పట్టుకుపోయినర్రిట నా కొడుకుయాడవున్నాడని సారుపోతె ఆయినెనుగూడ రెట్టికొట్టి పంపిస్సిట గట్ల నడుస్తోందిరాజ్యం." అన్నాడు.

"అందుకే మరి ఇది పోలీసు రాజ్జం తుపాకి రాజ్జం" శివయ్య అన్నాడు.

"అట్లనేవున్నది వీని పెండ్లాల మాదుగుల..........." పుల్లయ్య వెనుదిరిగి పోడంతో మిగతా మాటలు వినపడలేదు శివయ్యకు.

పక్కనేవున్న వైష్ణవాలయంలోంచి ఏదోరికార్డు గోలగావిన్పించటంతో "వీలొల్లి పెండ్లాం.........! ఇగ తొమ్మిది బనాది? మొదలుబెట్టినుర్రి" అని మంచం మీద ఘుసుగుతన్నాడు శివయ్య.

కొడుకు అన్నంతిని బయటికి వెళ్ళటం అతడికి తెలీదు. ఏరాత్రో ఉలిక్కిపడి లేచాడుశివయ్య ఎదురుగా వీధిలైటు వెలుతురులో పోలీసులు కన్పించారు.

"లే లే ! నువ్వేనారి ఇంట్ల మొగోనివి ? నీ కొడుకు యాడున్నడు ? తలుపులు తియ్యమను" ఎవడో అంటుండగానే ఇంకొకడువెళ్ళి తలుపులు బాదాడు.

ఈ గొడవకి శివయ్య భార్య తలుపులుతీసింది. పోలీసుల్నిచూసి కీడుశంకించింది. "ఏంది ఏంది" అన్నది కంగారుగా బయటికివస్తూ.

పోలీసులు శివయ్యని చెయ్యిపట్టుకుని లోపలికి లాక్కొచ్చారు. "ఏడీ నీ కొడుకు ? ఎక్కడున్నడు ?" మొరటుగా అడిగారు.

"బ్యాషనుకని పోయిండు అక్కన్నే దోస్తులింట్ల పండుకుంటడు" శివయ్య చెప్పాడు బెదురుతూ.

"దోస్తుల ఇల్లెక్కడ ? పోలీసు అడిగాడు.

"ఏమో మాకేంతెల్సు ? మేమెందుకు జూడబొయినం ?" తల్లి అన్నది.

"మరి ఏమెర్కనే నీకు దొంగముండా ! గాడుదులందర్నికని దేశంమీదపారేసు డెరికేనా ? నీ కొడుకు అంతమొగోడా ? సారమాములా బందువెట్టిస్తడా ?" పోలీసు ప్రశ్నించాడు.

"అదంత మాకేమెరుకనయ్యా ! బయట వాడేంజేస్తడో మాకెట్లతెలుస్తది" శివయ్య అన్నాడు.

పోలీసు శివయ్యని ఈడ్చితన్నాడు. "బలిశనాదిరలంజూడకా ! అడిగిందానికి జెప్పరాఅంటె వదురుతానవు ?" మళ్ళీతన్నాడు. భార్య అడ్డురాబోయింది. పోలీసు ఆమెని లాగిపారేశాడు ఆస్త్రీ విసురుగా దూరం వెళ్ళిపడింది.

"లష్టి ! మీకెందుకే ఈ యవారాలన్నీ ! లంగలతోని దొంగలతోనితిర్గి సంపాయించుకతింటానారు ? ఖానూన్ ఊకుంటదనుకుంటాన్రా ? కత్తిబెట్టి చంపుతం ఖాంచెత్ ?" ఆమెని తన్నడానికి అధికారపునాదాలు ధరించిన పోలీసు బూటు పైకి లేచింది.

*   *   *   *

పూర్వం ఏకశిలానగర ప్రాకారంగాఉన్న కోటగోడకాస్త దూరంగా కన్పిస్తోంది ఆ పటమందీ ఆగారు ఒకడు లోపలికి నడిచాడు. అది సారాదుకాణం.

"బందుపెట్టాల్నని చెప్తె ఎందుకు నడుపుతానుర్రి ?" ఆ యువకుడు యజమానిని ప్రశ్నించాడు.

గద్దెమీదకూర్చున్నతను తలెగరేశాడు. "ఎందుకు బందుపెట్టాల్నయా? ఏం సంగతి?" గద్దెదిగాడు.

"ఎందుకుబందు పెట్టాల్నా?" వచ్చినయువకుడు సారాజాడీని కిందికిలాగాడు. అదికిందబడి భళ్లునబద్దలైంది. సారాతాగుతూఉన్న ఒకరిద్దరు బయటికి పారిపోయారు.

ఆ గొడవకి బయటవున్న మిగతావారుకూడా వచ్చిచేరారు. బల్లల్ని బెంచీల్ని విరిక్కొట్టారు. యజమానిని పట్టుకునితన్నారు.

ఆ సారాదుకాణానికి ఫర్లాంగుదూరంలో పోలీస్ స్టేషన్ వుంది. వార్త ఎలా చేరిందోగానీ హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం నలుగురు పోలీసులతో పరిగెత్తు కొచ్చాడు. సైకిళ్లు దిగీదిగగానే లాఠీలతో ఉరికారుసారాకొట్లోకి,

వాళ్లంతా మఫ్టీలోవుండటంవల్ల సారా కాంట్రాక్టరు మనుషులనుకున్నారు ఆ యువకులు. వాళ్లు ఎవరైనా గానీ వాళ్లతో గొడవ పడదలుచుకోలేదు. అందుకే లోపలఉన్న యువకులు బయటికివచ్చి కోటగోడవైపు పరుగుతీశారు. పోలీసులు వెంబడించారు. కానీ యువకులు అందేటట్టు కన్పించలేదు. పోలీసులు కొంత దూరం తరిమి వెనుతిరిగారు. హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంమాత్రం మరింత ముందుకువెళ్ళి తరిమాడు. ఒకయువకుణ్ని వెనగ్గావెళ్లి కాలరందుకున్నాడు. ఆ యువకుడు ఆలస్యంచేయలేదు. కత్తితీసి సుబ్రహ్మణ్యాన్ని పొడిచాడు. తప్పించుకోవడానికి వెనక్కి వంగాడు సుబ్రహ్మణ్యం. కత్తిఅతనిడొక్కకి కొస్తంతరాచుకుని పోయింది. పెద్దగాయమేమీకాలేదు. గీచుకుపోవటంవల్ల రక్తంమాత్రం బాగా కారుతోంది.

మిగతాకుర్రాళ్లు దొరక్కుండా తప్పించుకున్నారు.

పోలీసునే పొడవగలిగిన ధిక్కారానికి పోలీసులకి వెర్రెత్తింది. చేతిలోఉన్న లాఠీలతో అక్కడవున్నవాళ్ళని ఇష్టంవచ్చినట్టు బాదారు బండబూతులు తిడుతూ.

* * * *

రాజుగారు గదిలోకిరాగానే కలెక్టరు చిరునవ్వునవ్వాడు.

"రండి రండి" ఆహ్వానించాడు.

రాజుగారివెనక కంపెనీ ఆడిటర్ గూడా ఓ ఫైలు పట్టుకుని వచ్చాడు. ఆ ఫైల్లోంచి ఓ కాగితంతీసి రాజుగారికి అందించాడు ఆడిటరు. రాజుగారు దాన్నందుకుని కలెక్టరుకి ఇచ్చాడు.

"ఏమిటిది ?" కలెక్టరు అడిగాడు దాన్నందుకుంటూ.

"మెమోరాండం ! పరిస్థితి ఇలాగేవుంటే వున్నన్నిరోజులు గవర్నమెంటు రెంటల్ మేంకట్టలేం. దానికి రాయితీఇవ్వాలని ఎక్సైజు సూపర్నెంటుగారికి మెమోరాండం ఇచ్చాం. దానికాపీఇది." రాజుగారు అన్నారు.

కలెక్టరు నొసలుముడివేశాడు. "పరిస్థితి ఇలాగే ఎందుకుంటుంది ? చాలా మందిని అరెస్టుచేస్తున్నాం. త్వరలో అణిచేస్తాం"అన్నాడు.

"నాకు నమ్మకం కుదరటంలేదండి. మీ పోలీసుల్నే పొడిచి అవతలపారేస్తుంటే ఇక మాకెలా ధైర్యంఉంటుంది చెప్పండి ?"

"పొడిచినవాడు దొరికాడుగద వాడిచేతుల్ని పలిచేశాం మరోడెవడూ మళ్లీ అలా చేయకుండా. పోలీసులుగూడా దిగజారకుండా వాడికి అసిస్టెంటుయస్పయి, ప్రమోషనూ. ఇంటిజాగా, పదిహేనువందల నగదూఇచ్చాం. దాన్ని మా డిపార్టుమెంటు ఛాలెంజ్‌గా తీసుకుంది. నలిపిపారేస్తాం వెధవల్ని" కలెక్టరు ఆవేశపడ్డాడు.

"ఈలోపల మా అదాయం పడిపోతుందే. ఈ దసరాసీజన్లో బిజినెస్సంతా పోయింది. అసలుఉండేలాభాలన్నీ ఇప్పుడే. మామూలురోజుల్లో ఏముంది ? మాకు రోజుకి లక్షరూపాయల రాబడిపోతుంది. ఇంక ఈ మాములా నడిపి ఏంలాభం ?"

"పోలీసుల్నిచ్చాంగదా ! షాపులు నడపడానికి ?" కలెక్టరుప్రశ్నకి రాజుగారు నుదురుకొట్టుకున్నాడు.

"అదేంలాభంవండీబాబూ ! తాగడానికి వచ్చినవాడు పోలీసుల్నిజూసి ఎనక్కిటిరిగెళ్ళిపోతున్నాడు. అసలే ఎప్పుడు ఎవుదొచ్చి ఏంజేత్తాదోనని భయం. ఐనాతెగించి తాగటానికొస్తే పోలీసులు. పోలీసులముందర ఎవడుతాగుతాడండీ ?"

"మీరేం వర్రీఅవకండి. ఇది ఇకనుంచీ మీసమస్యకాదు. మాకుఛాలెంజి. దీని అంతుచూస్తాం" కలెక్టరు అన్నాడు.

* * * *

అదినగరంలో బాగా సారా అమ్మడయేషాపు. మామూలురోజుల్లో అక్కడ కాల్చిన మాంసంముక్కలు, వేయించిన ఉప్పుశనగలు అమ్మేవాడు రోజుకి రెండొందలు సాంపాయించగలడు. అలాంటి సారాకొట్టు ఇప్పుడు చిన్నబోయివుంది. ఐదారుగురు పోలీసులు, ఎముకలుదొరుకుతాయేనని వచ్చిన రెండుకుక్కలు, మూడునాలుగు

పందులూ మాపత్రిం వున్నాయక్కడ. దానికొక్క స్తదూరంలో సిటీ బస్సుస్టాండుపుంది. ఆ బస్సుస్టాండువెనక పెద్దడ్రైనేజీపుంది.

సాయంత్రం ఆరుగంటలవుతుండగా అక్కడ జనం నేల ఈనినట్టు వుంటారు. అలాంటివేళ ఒకరిక్షాలో ఒకాయనవచ్చి బస్సుస్టాండులో రిక్షాదిగాడు. జేబులోంచి చిల్లరతీసి ఇవ్వబోతుండగా అతడిపక్కనుంచి ఒకజీపు శరవేగంతో అతన్ని తాకినంత పనిజేసి దూసుకుపోయింది. ఆ అదురికి అతను తూలాడు.

అంతజనంలో అది అంతవేగంగా ఎలావెళ్లగలిగిందో ఎందుకువెళ్ళిందో తెల్సుకునే లోపలే మరోజీపు అతన్ని నిజంగానేతాకి దూసుకుపోయింది. అతడు కిందపడి విభ్రాంతుడై లేవబోతుండగా మరో ఐదారుజీపులు అలాగేరావటం పక్కసందులోకి దూసుకువెళ్ళటం జరిగింది. తాను డబ్బుఇవ్వాల్సిన రిక్షావాడు ఇపులేడు. జనం చెల్లా చెదురయారు.

బారెడు పొడుగున్నబడిసెలు, లాఠీలు రయ్ రయ్‌మని దూసుకువచ్చిపడు తున్నాయి. అవి ఎవరికీ తాకలేదన్నమాటేగానీ తాకితే ఇద్దర్ని దూసుకపోగా మరి మూరెడు మిగులుతాయి. జీపుల్లోంచి పోలీసులు తుపాకుల్తోనూ, మామూలుదుస్తుల్లో వున్న సారాకాంట్రాక్టరు మనుషులు బరిసెలు, దుడ్డుకర్రల్తోనూ దిగారు. రోడ్డుమీదా, సందుల్లో జనాన్ని భయపెట్టి పరిగెత్తించారు. జనం భీతావహులైపారిపోయారు. ఏం జరుగుతోందో, ఎందుకు జరుగుతోందో ఎవరికీ అర్థంకాలేదు

సారాకొట్లో మరీ తాగకుండా ఉండలేనివాళ్లు ఇద్దరు ముగ్గురు కూచునితాగు తున్నారు. కాస్తంత ఎక్కువైపోయిందేమో వాగ్వాదంలోకిదిగారు.

వాళ్ళవీపులమీదా, తలకాయలమీదా లాఠీలు మోగాయి.

"బాగతాగి ఒర్లుతున్నరేందిరా?" పోలీసులు బ్యాండు బజాయించారు.

తాగుబోతులు లబోదిబోమన్నారు. "లంజకొడుకుల్లార! శేతులకట్టెలున్నాయని కొడుతారొ బోషిడికె! మిమ్ముల నేమన్న అన్నామురా. ఓర్నీయమ్మ తల్కాయెపలు గ్గొట్టింతురో!" అని తిడుతూ ప్రతిఘటించారు.

పోలీసులు రెచ్చిపోయి తాగుబోతుల్ని పొర్లించి కొట్టారు. షాపుయజమాని గొల్లుమన్నాడు. "ఉకోండ్రి ఉకోండ్రి ఆయింత వచ్చేటోల్లను రాకుంట జేత్తరాఏంది? మీరుగిట్లకొడితే ఇంక ఎవడన్నవస్తడా దుకాండ్లకు?" పోలీసులకు అడ్డంవెళ్ళాడు.

"ఐతె తాగి మమ్మల్నితిడ్తరావీల్లు ?" పోలీసులు షాపువాణ్ణి లాగేశారు.

నాల్లేమన్నరయా ? మీరేకొడ్తిరి" యజమాని వదల్లేదు. తాగుబోతులు తిట్టడం మానలేదు. పోలీసులు కొట్టడంమానలేదు.

* * * *

"కలెక్షనెంత" రాజుగారు అడిగారు.

"ముప్పైవేలండి !" జవాబువచ్చింది. క్యాషియర్నించి.

"ఛీ ఛీ ! ఈ పోలీసు నాకొడుకులవల్ల ఎంతమాత్రం లాభంలేదు. ఏమయినా రోడ్లమీద ఎగర్టమేగానీ అసలు పనిచాతకాదు. మనయాపారం నడవటానికి వీల్లకన్న రాడికల్సుతోనే మాట్లాడితే బాగుంటుందేమో !" రాజుగారిమాటకి తలాడించారు చుట్టూ వున్నవాళ్ళు.

"కానీ పెద్దశిక్కుందండే ! అసలు రాడికల్సు ఎవరు ? ఆల్లనాయకుడెవడు ? ఆడెక్కడుంటాడు ? ఆడితోమాట్లాడవెఁలాగ ?" ఇయన్నీశిక్కులండే !"

"నిజఁవే. కాంగ్రెస్సుకీ, కమ్యూనిస్టుకీ అఫీసులంటూ తగలడ్డాయి. ఈల్లకేవీఁలేదు ఆఁ ఒగటితోస్తోంది. రాడికల్సుతో చర్చలకి మనం సిద్ధవేఁనని వాడితో వీడితో అనాలి. ఈమాట ఎలాగో వాల్లకిజేరుద్ది. అప్పుడు మనకి దారిదొరికిద్ది. ఇగంతకుమించి మార్గంలేదు" రాజుగారి మాటలకి చుట్టువున్నవారంతా తలాడించారు.

"కానండయ్యా, ఈ చర్చలకి మనకి పనాదిఏటి ? ఆల్లు ధరతగ్గించమంటున్నారు గదా, తగ్గిస్తావఁనా ? లేదనా ! తగ్గిస్తే ఎంతకని ?" ఒకడు ప్రశ్నించాడు. ఆ ప్రశ్నించినవాడు డిపోలో సారాని కొలిచిఅమ్మేవాడు.

"నిజవేఁ. డిస్కషన్సంటూవున్నాక సంగతేంటి ? దేనిమీదమాట్లాడదాం ?" పావలా పార్ట్నర్ అడిగాడు.

"అసల్సంగతేంటంటే ఆల్లడిగేమూడ్రూపాయిలకి పంకగ్రాముల సారాబోసినా మనకినష్టంలేదు. కానీ మనం ఇప్పుడు నాల్గున్నరకి అమ్ముతున్నాంగదా. అంచేత అర్దరూపాయి తగ్గిత్తామని అంటాం ఒప్పుకున్నారూ సరే ! మనికెట్టాగూలాభవేఁ. లేనా చర్చలు విఫలంఅని పేరెట్టేసి ఎలాగూ పోలీసుఫోర్సు అదనంగా రాబోతూంది గనక దాంతోమామూలా నడిపేస్తాం" రాజుగారు చెప్పారు.

"కానీ మనం మూఢాపాయలకి వందగ్రాములు అమ్మినా మనకి లాభమేనని వాళ్లంటున్నారుగదా! అసలు మన బ్లాక్ షాపులసంగతి వాళ్లకెలాతెల్సు?" పావలా పార్ట్నర్ అన్నాడు.

"తెలీకపోడానికి ఇదేమన్నా స్మగ్లింగా?, గూడుపుఠానీయా? పబ్లిక్‌గా దోపు కోడమేగ! ఆమాత్రిం తెలీదేటి? అసలు నీకోసంగత్తెల్సా? మనద్దగ్గిర షాపులు తీసుకున్న చాలామంది మాజీరాడికల్సేగా!" రాజుగారి మాటకి అడ్డొచ్చి.

"శ్శెశ్శె! ఆల్లురాడికల్సేంటండీ! పీతలు పట్టేనాయాళ్లు రాడికల్సు అలగుంటా రేటండీ! ఈలంతా దొంగ రాడికల్సు."

"రాడికల్సుకీ ఈలకీ సమ్మందం లేదంటేలేదు. ఉందంటే ఉంది. ఈలు గూడా ఒగప్పుడు రాడికల్సేగానీండి తర్వాత్తర్వాత పోలీసులబయానికీ, ఇతరగొడవలకీ తట్టుకోలేక బయటికొచ్చేసినారండి. కానీ ఈల్లకి ఎవురు రాడికలో ఎవురుకాదో ఆల్ల సమ్మందాలెలాగుంటయో అన్నీతెల్సండి. అంచాత ఈల్లని మనం ఉపయోగిచ్చు కోవచ్చండి ఈల్లద్వారనే కూపీలాగించి ఆల్లని అరెస్టుజేపించేది! ఎలాగుంది ఐడియా?" పావలా పార్ట్నర్ని రాజుగారు ప్రశంసా పూర్వకంగా చూశారు

"కూపీలాగిస్తావా? అదెలా?" అడిగాడు.

"ఎలాగంటే ఈల్లంతా మేంగూడా రాడికల్సువే. మరిమాకు ఫలానాషాపులు ఇవ్వకపోతే మీమామూలా ఎలానడుస్తుందో చూస్తాం అని బెదరించి డిపాజిట్లుగూడా పెట్టకుండా మనద్దగ్గిర షాపులు కొట్టేశారుగా. అంచేత మనకీ మాత్రిం సాయంజెయ్యక పోరు" పావలా పార్ట్నర్ అన్నాడు,

"అదినిజమేగాని సొంతపార్టీకే ద్రోహంచేసే నాయాళ్లు మరిమనతో సరిగా వుంటారంటావా? అవతలజిల్లాలోగూడా ఇలాగే రాడికల్సుమి అన్జెప్పి మామూలాలో వాటా కొట్టేశారు. నిన్నటికి నిన్న పక్కతాలుకామామూలాలో ఏ పెట్టుబడీ లేకుండా ఇం పైపై సలావాటాగూడా ఇలాంటోడికి ఒగుడికిచ్చాంగద! రాడికల్సు పేరు జెప్పుకుని ఇలాం బెదవమేశాలేసేవోళ్ళకి అసలు రాడికల్సుకూపీ తెలుసుద్దా? ఈళ్ళని మనమే సమ్మడంలేదే ఆళ్లెలానమ్ముతారు?" రాజుగారు అన్నారు.

"ప్రియత్నించిచూద్దాం నష్టమైతేలేదుగా" పావలాపార్ట్నర్ అన్నాడు.

* * * *

"మూడు ప్లాటూన్లు వస్తున్నాయి. ఈ రాడీకల్ నాయాల్లని కోసిముక్కలకింద నరుకుతాం" ఇనస్పెక్టర్ మోజెస్ జీపెక్కి అన్నాడు కానిస్టేబిల్స్‌తో. అని "బ్రాహ్మణవాడకిపోనీ" డ్రైవర్‌ని హెచ్చరించాడు. డ్రైవర్ గేర్ నిగుద్ది ఆక్సిలెటర్ని తన్నాడు.

పెంకుటింటి ముందు జీప్ ఆగింది. ఇంట్లో చేటలో బియ్యం పోసుకుని రాళ్లేరుతున్న నడివయసుస్త్రీ బయటికివచ్చింది. ఇన్స్పెక్టర్ మోజెస్ ఆమెని తోసుకుని లోపలికి వెళ్ళాడు. మంచాన్ని ఎత్తేశాడు బట్టలబీరువాని పడేశాడు. అతనితోపాటు వచ్చిన పోలీసులుగూడా ఇల్లంతా చిందరవందర చేశారు.

"ఎక్కడ నీకొడుకు ?" మోజెస్‌ప్రశ్నకి చేతలకీ అవాక్కయింది ఆ స్త్రీ.

"ఏమో తెలీదు." నీరసంగా అంది.

ఇల్లంతావెతికాక ఎక్కడా కన్పించకపోవడంతో మధ్యగదిలో ఆమెని ఇంటరాగేట్ చేశాడు మోజెస్.

"ఏదే నీకొడుకు ?"

"తెలియదయ్యా !" ఆమె వణికిపోతూ అంది. లాఠీతో ఒక్కటేశాడు మోజెస్. ఆమెఅరిచి నేలమీదపడింది.

"చెప్పు ఎటువెళ్ళాడు ?" లాఠీదెబ్బలు ప్రశ్నలు ఒకేసారి ఒకేవిధంగా ఆమెని గాయపరిచాయి.

"నాకేంతెలుసయ్యా !" దీనంగాఅంది.

మోజెస్ విసురుగా కర్రని ఝాడించాడు. కర్రవిరిగిపోయింది. ఆమెసంతృప్తికరమైన సమాధానం చెప్పడంలేదు. రెచ్చిపోయి పక్కనున్న పోలీసుచేతిలోని తుపాకీ తీసుకుని కిందపడివున్న ఆమె మెడకింద ఎముకలమీదా పక్కఎముకలమీదా తుపాకీ మడిమతో గుద్దాడు.

ఎక్కడో ఏవో ఎముకలు పటపటమన్నాయి. బాధతో ఆస్త్రీ గిలగిల్లాడింది. పేగులు చించుకునిపుట్టిన కొడుకుకోసం ఎముకలు విరగ్గొట్టుకుంది తల్లి !

* * * *

అక్బరూ, అశోకూ ఇద్దరూ కానిస్టేబుళ్లు రాత్రి ఏడున్నర గంటలప్పుడు కర్రలుపుచ్చుకుని గస్తీకని బయల్దేరారు. గంటసేపు అటూఇటూ తిరిగి ఓసారా కొట్లోకొచ్చారు.

అక్కడ బయట ముగ్గురు రిజర్వు పోలీసులూ లోపల ఒకతాగుబోతూ వున్నాడు. వీళ్లని చూడగానే ఆ తాగుబోతు పట్టుకున్న గ్లాసులోదంతా మింగేసి బయటపడ్డాడు. షాపువాడు అక్బర్నీ, అశోక్నీ కోపంగా చూశాడు.

"గావాడు గట్ల ఉర్కుతున్నడేందిరభై" అక్బరు బెంచీమీదకూచుని షాపువాడితో అన్నాడు.

"మిమ్ముల సూశినంక ఇంకవాడు ఉంటడా? గీ రిజర్వోల్లంటె యాన్నుండో వచ్చిసుర్రి మల్లపోతరు. మీరంటె ఇక్కడోల్లేనాయె, మొకాలు గుర్తుపెట్టుకోరా?" అన్నాడు షాపువాడు.

"సరెగని రొండుపొలునింపు సలిజంపుతాంది." అశోక్ టోపీని బెంచీమీద పెడుతూ అన్నాడు.

"ఉద్దెరా?" షాపువాడన్నాడు.

"ఉద్దిరఏంది? దసర మామూలియ్యకనేపోతివి. గీదీనికే ఉద్దెరంటానవు?" అక్బర్ గుడ్లెర్రిజేశాడు.

"ఏంమాటగట్టుకపోతానమని మామూల్లియ్యాలె? ఈడికే సచ్చేసావయితాంది".

"అరె పొయ్యేపయా! ఏదెట్లయితేంది? దసర లేకుంటబోయిందా మామూల్లు పొయ్యేటానికి? జమానసుంచిఉన్నది ఇయ్యాల ఏమొ కొత్తగజెప్తానవు" అక్బర్కి కోపంవచ్చింది. షాపువాడు గొణుక్కుంటూ రెండుగ్లాసుల్లో రెండుపందల సారా పోసిఇచ్చాడు. బయటఉన్న రిజర్వుపోలీసులు చూసీచూడనట్టు తలలు పక్కకులిప్పుకున్నారు.

"సోడలుగావాలె యాడున్నయి?" అశోక్ అడిగాడు.

"ఇంక అది పర్ధీకిందికా?" ఏడ్వలేకనవ్వుతూ రెండుసోడాల్ని 'కుయ్యో' మనిపించాడు షాపువాడు.

"అరె మీరు గిట్ల డ్రెస్సుమీదనే తాగుతెఎట్లభై" షాపువాడన్నాడు.

"ఎవడు జూస్తున్నడురా తమ్మి! మా యస్సయి మోజెస్గాడయితె పోలీసు జీబుతీస్కపోయి బాసింది కేసులకు కేసులే ఏసొక్కని గెస్టుఅవుసలకు తీస్కపోతదెరికేనా? డ్రెస్సుల ఉంటెఏంది? తాగి లొల్లిబెడ్తానమా?" అశోక్ సోడానికలుపుకుని సగం గ్లాసెడు ఒకేసారి ఖాళీచేశాడు.

అక్బర్ గూడా కాస్తతాగి గొంతుసవరించుకుని ఒళ్లు జలదరించినట్లుగా "అరే ఏందిరతమ్మీ! సార గమ్మతుగున్నది" అన్నాడు.

"గింతంత తాగంగనే తమ్ముణ్ణయిన్నా? సారసంగతి నాకేమెర్క? డిపోల కెల్లి ఎట్లచ్చింది అట్లనేఅమ్ముతాన" అన్నాడు షాపువాడు.

"అట్లనా ఏదీ సీలుజూడనీ" అక్బరులేచాడు.

"అరె! ఏం సీలుజూస్తవయా! తాగిపోరాదు పోసినగద!" షాపువాడు వారించాడు అక్బరు మాటవినకుండా జాడీమీదిసీలు పరిశీలించాడు

"ఇదరావోభై" అశోక్‌ని పిలిచాడు.

"అరె! ఏంది భాయిసాబ్! గిదేనామర్యాద? మీరు పొయ్యమన్నంతపోస్తిని. మల్లగీకతలేంది?" షాపువాడు అశోక్‌ని ఆపబోయాడు. అశోక్ షాపువాడి చెయ్యిని తీసేసి గద్దెఎక్కి జాడీసీలుని చూశాడు.

అది పగులగొట్టివుంది. షాపువాడి వైపుచూసి నవ్వాడు అశోక్.

"ఏందిరా? సీలుతీసేసి కల్తీజేసి అమ్ముతానావు? ఇప్పుడు మేం రాబట్టిగాని లేకుంటె ఇండ్ల ఎంతసంపాయించినవో మాకు తెలువకనేపొయ్యేది" అన్నాడు.

"ఇగ రారా పోరాలకు దిగిందా యవారం" షాపువాడు గొణుక్కుని "కాదు భాయిసాబ్ రిక్షాలకెల్లి దించుతాంటె పలిగిపోయింది. గట్లజేస్తనా, వాకిట్ల పోలీసు లను బెట్టుకొని!" అన్నాడు

అశోక్ కిందికిదిగి "తాగు" అన్నట్టు అక్బరువైపుచూసి గ్లాసుని ఖాళీచేశాడు. షాపువాడు స్వయంగా ఆరెండుగ్లాసుల్నీ అందుకుని మళ్ళీనింపి రెండుసోడాలుగూడా పోసిచ్చాడు.

అక్బరూ అశోకూ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. పదినిముషాల తర్వాత అశోక్‌లేచి తలపైన టోపిపెట్టుకుని షాపువాడితో "తే" అన్నాడు.

షాపువాడు చెరిఐదురూపాయలిచ్చాడు. అక్బరు కోపంగా "క్యాసమఝ్‌రహే?" అన్నాడు. బయటినుంచి రిజర్వుపోలీసు తొంగిచూశాడు "క్యాభాయ్" అన్నాడు నవ్వుతూ.

"కుఛ్‌నై జర మజాక్!" అన్నాడు అక్బరు.

షాపువాడు గబుక్కున చెరోపదిరూపాయలు ఇచ్చాడు.

అక్బరూ అశోక్ లాఠీలూపుకుంటూ రోడ్డుమీదపడ్డారు.

"అరే! పైసపైసకు సస్తానంగదరా! ఈ రాడికల్స్‌లొల్లి జెయ్యబట్టి ఎవడు మామూల్లడిగినా ఇస్తలేదు. ఈండ్ల సంగతేందోగని రోజుపొద్దుగూకినాక పరేశానయితాంది" అశోక్ అన్నాడు.

"సహీహై యేతోపరీషాన్" అక్బర్ అన్నాడు.

ఆ సందులో ఒక పాన్‌షాపువుంది. అప్పుడు రాత్రి తొమ్మిదిదాటింది.

చలికాలం గావటంవల్ల జనం ఎవరూలేరు. అశోక్ ఆ పాన్‌షాపు దగ్గరఆగి "పాంచ్ చార్మినార్ గోల్డ్ దేవో" అన్నాడు.

షాపువాడు ఇచ్చాడు. అశోక్ ఒక సిగరెటుతీసి అంటించుకుంటూండగా ఒక కుర్రాడు వచ్చాడు. అతడికి ఇరవైఏళ్లున్నాయి. గడ్డం అంగుళంమందాన పెరిగివుంది. భుజానికో సంచివుంది. అతణ్ని అనుమానంగా చూశాడు. "భుజానికి అవేంటియి?" అన్నాడు కుర్రాడితో.

"రంగు బ్రిష్‌లు" అన్నాడు కుర్రాడు.

"బ్రిష్‌లా? ఎందుకు?" నోట్లోనుంచి సిగరెటు తీశాడు అశోక్. కుర్రాడు బెదిరాడు.

అక్బరు వాణ్ని కాలరుపట్టుకున్నాడు. "అరేఏందిరా రాడికలోనివా? రాత్రిపూట గోడలమీద రాస్తానావుర" అన్నాడు.

కుర్రాడు అడ్డంగా తలూపాడు. "ఉహూఁకాదు. నేను ఇండ్లదర్వాజలకు రంగులుగిట్లఏస్త. రాడికల్నుకాదు" అన్నాడు.

"బిడ్డా! వల్లగున్నవు. గడ్డంబెంచుకున్నవు. సంకకు బ్యాగున్నది. దాంట్ల బ్రిష్‌లున్నయి. ఇంకేందిరో నువ్వు రాడికల్‌వే. చల్ నడువుబేటా! మీరు జెయ్యబట్టి ఈ సలిల సచ్చుకుంట తిరుగుతానం ఆద్మానిలేకుంట! నడువు నడువు" అక్బరు అతన్ని ముందుకుతోశాడు.

"అరె! నేను రాడికలుకాదు సార్! నాకేందెల్వది రేపు పొద్దుగాల రొండిండ్లు కాంట్రాక్టుబట్టిన. రంగులెయ్యాలె పోనీయిన్రి" బతిమాలాడు.

"నడువుబే. పిచ్చకుంట్ల నఖ్రాలుజేత్తానవు అప్నేకో చమ్కాదేతేరే? పంద్రాసాల్‌కే సర్వీస్‌హై" అశోకుడు లాఠీతో ఎడాపెడా బాదాడు.

* * * *

మూడుప్లాటూన్ల రిజర్వు పోలీసులు నగరంలో దిగారు. ఎక్కడచూసినా ఊళ్లో పోలీసులే. రాత్రి ఏడుదాటితే ఏయువకుడు రోడుమీదకనపడ్డా ప్రశ్నలతో వేధిస్తున్నారు అనుమానంగా కనిపిస్తే లాకప్‌లో చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఎక్కడచూసినా పోలీసులదౌర్జన్యాలగూర్చిన మాటే!

రామయ్య. సోమయ్య కలిశారు ఇద్దరూ సారాషాపుల యజమాన్లే.

"కొత్తగ పోలీసులను పిలిపిచ్చినారటగద ?" రామయ్య అన్నాడు.

"పోలీసులనే గాదు మన కాంట్రాక్టరుకు రెండు కమ్యూనిస్టుపార్టీల మద్దతు గూడవున్నదట ఎందుకంటె పక్కజిల్లా కమ్యూనిస్టులీడరు మనదాంట్ల పార్ట్నరట అవు తలిజిల్లాలల్ల నుంచి పార్టీమనషులనుగూడా తెచ్చినుర్రి. కాని ఏమైద్ది వాల్లతోని ?" సోమయ్య అడిగాడు.

"నాలొర్రోజుల్నుంచి ఇరలొల్లి తక్కువగాలేదా ?"

"ఏంతక్కువైంది ? ఇదివరకంటె పందరూపాయలు ఎక్కువ అమ్మతాంది కని నాషాపుకాడ నలుగురు పోలీసులకాపలా! నలుగురికి నాలుగు పదిహేన్లుఅరవైరూపాయలబత్తా, భోజనాలకోఇరవై, తాగుడోఇరవై ఎందరూపాయిలు అటేపోతున్నయి. ఏంమిగులుతాంది ? వట్టిపోలీసులున్నప్పుడు వచ్చినంత మందిగూడ ఈ చిప్పపోలీసులున్నప్పుడు వస్తలేరు. ఇంకెందుకయా ఈ పోలీసు ?" సోమయ్య మాటలు రామయ్య విన్నాడు. నిజంతప్ప కల్తీ ఏమాత్రంలేదు ఆ మాటల్లో.

"పోలీసులతోటి ఏమన్నఅయిద్దా అసలు ?"

"ఏంగాదు పూటె పోజులుగొట్టుడుఎరుక పిల్లకు గంతే పిల్లనుబట్టుకొని ఎందు కమ్మలెమనం ? అమ్మినాగూడా మనకొచ్చే కమీషను ఏమన్నపెరిగిందా ? అయింత మూడు ముడికాన్ల కమీషనుకోసం ప్రాణభయంతోని యాపారందేనికి జెయ్యాలె ? అమ్మకపోతేపోనీ మనకు బొయ్యేది ఆమూడుకాన్లేగద! ఇది అటో ఇటో తేలేదాక మనంగూడ నప్పుడుచెయ్యకుంట ఊకుంటె అయిపాయె. మనకెందుకట లంపీకు లాట ?" సోమయ్య అన్నదివిని రామయ్య తల వూపాడు. "నిజమే" అని ఎవరి దోవన వాళ్లు వెళ్ళారు.

* * * *

"రంగారావునిపిలు!" రాజుగారు పావలాపార్ట్నర్‌తో చెప్పాడు. కాసేపటికి రంగారావు వచ్చాక

"కాలేజీ ఆడిటోరియంలో సీ ఆర్పీక్యాంపుందిసూడూ! అక్కడికో బస్తెడు కూరగాయలు పంపించవయ్యా! ఇప్పుడే వాడెపుడో పోన్జేసేడు" అన్నారు రాజుగారు.

"ఎక్కడండీ కాలేజీ?" రంగారావు అడిగాడు. రాజుగారు విసుగ్గాచూశారు.

"యూనివర్సిటీవాళ్లా పోలీసుసభ పెట్టేరుచూడు! ఆ ఆడిటోరియంలోనే ఇప్పుడు క్యాంపుపెట్టేరు" అన్నాడు. రంగారావుకి అర్థమైంది.

ఆతడు వెళ్ళిపోగానే రాజుగారు పార్ట్నర్ కేసిచూసి "అనుకోంగానీ, కొన్ని కొన్ని పనులకి అనుకోని సంబంధాలుంటాయయ్యా! యూనివర్సిటీలో కొందరు లెక్చెరర్లు పోలీసు డిపార్ట్మెంటిప్పుడు యలాగుంది, మరెలాగుంటే బాగుంటుంది అన్జెప్పి ఓ సభపెట్టేరు. దాంట్లో పెద్దపెద్ద పోలీసాఫీసర్లంతా లెక్చెర్లు దంచేసుకో. తర్వాత కలట్రి ఓసారినాతో అదీ ఇదీ మాట్లాడుతూ మనకి కల్చెరల్ పోలీసులా ఉన్నారండీ అన్నాడు. అల్లుండటం మనకెంతోలాభపంట. ఎందుకంటే ఈల్లలాగా కనిపిచ్చేట్టు తుపాకుల్తోగాకుండా కన్పించకుండా పన్జేత్తారట. పైగా ఆపని తాము జేత్తున్నామని ఆల్లకి తెలిసేయీలుగూడా లేదట. కొంతమంది కథలూ, పాట్లూ గీకే వోళ్లు. మేవే తెలివిగలోళ్లం మాలెక్కలూ, సిద్ధాంతాలతోటే లోకంనడుస్తోందనుకునే ఎర్రిసన్నాసులూ ఈళ్లలోఉంటారు ఆళ్లకసలు బుర్రుండదు. ఉందన్జెప్పి సారా డ్రిమ్మంతనోటితో చెప్పుకుంటూ వుంటారు. ఆదేం మాట్లాడినా మనం భేష్ భేష్, యహూజెప్పేవు, అద్గదీ సంగతి అంటూవుంటే ఆడు మనకి ఈ కల్చెరల్ పోలీసుపని ఆకికీ తెలీకుండానేజేత్తాడు." రాజుగారు చెప్పటం ముగించాక పావలా పార్ట్నర్ అన్నాడు.

"ఈళ్లపని సరేగానీండి ఇయాళ మనూర్లో చీఫ్మినిస్టరున్నాడు గదా! మన బాధలు స్వయంగా ఆరికిజెప్పుకుంటే బాగుంటుందిగదండీ!"

"సర్సరే! మనం డవిరెక్టుగాఎల్లి చెప్పుకుంటామటయ్యా? మెడ్రాసులోనైతే నేనుహోల్డూసర్ని ఆయన హీరో గనక బాగుండేదేవోగానీ ఇక్కడ పొజిసను మారిపోయిందిగా. నేను సారాకాంట్రాక్టర్ని ఆయనేమో ముఖ్యమంత్రి! మనం ఆయన్దగ్గరికెళ్లడం ఎవుడన్నాసూశాడనుకో. రేపొద్దున ఏదన్నాజరిగితే సారావాడూ ఈయనా కలిసే ఇదంతాజేశారన్జెప్పి అసెంబ్లీలో ఆయనకెంత అపర్దిష్ట! అంచేత ఈ జిల్లా పార్టీఅధ్యక్షుడు మనాడేగా, ఆడితో జెప్పి సంగతంతా చీఫ్మినిస్టరు శెవిలో ఊదే ఏర్పాటు జేశే ఉంచాలే" రాజుగారు నవ్వారు.

* * * *

పొద్దుణ్నుంచీ పోలీసు వాహనాలూ, వాటితో పోటీ పడుతున్నట్టుగా ఇతర ప్రభుత్వవాహనాలూ రోడ్లమీద పిచ్చికుక్కల్లా పరిగెడుతుంటే ప్రజలు విస్తుపోలేదు. ఈ రకం వాహనాల హడావిడీ, పోలీసుల తుపాకులూ, సన్నీలూ అంతావారికి మామూలై పోయింది. ఎవరైనా చుట్టాలువస్తే ఇంతమంది పోలీసులువున్నవూళ్లో మీరు ఎలాజీవిస్తున్నారని ఆశ్చర్యపోవటం ఆ నగరవాసులకే ఆశ్చర్యం!

ఆరోజు ఆ నగరానికి ముఖ్యమంత్రి వచ్చాడు కాబట్టి మూడురోడ్ల కూడలిదగ్గర పోలీసుల బందోబస్తు ఎక్కువగావుంది. జనాన్ని గుంపుగారానీయకుండా అడ్డుపడి ఒక్కొక్కణ్నే ఫిల్టర్ చేసి పంపుతున్నారు పోలీసులు అందుక్కారణం ముఖ్యమంత్రి బసచేసిన గెస్టుహౌజ్ ఆరోడ్డునే వుండటం.

కొన్ని పదిలమంది పోలీసు కానిస్టేబుళ్లూ, ఐదారుగురుయస్సైలూ, ఇద్దరు ముగ్గురు సిఐలూ, డీఎస్పీలూ, ఎస్పీ, కలెక్టరూ వగైరా యంత్రాంగం అంతామారణాయుధాలతో మోహరించి సంఘ వ్యతిరేకశక్తులు ప్రవేశించకుండా కాపలాకాస్తున్న ఆరోడ్డుమీద ముఖ్యమంత్రిగారి వజ్రఖచితకర్ణపుటాలను సోకిననినాదాలు ఏమిటంటే

"రాడికల్స్ దౌర్జన్యం నశించాలి"

"ఊరూరికీ, ప్రతికాలేజీకీ పోలీసు క్యాంపు కావాలి"

"కాషాయవేషులం, ప్రజల గుండె జ్యోతులం"

ఇంతపకడ్బందీగావున్నా ఈనినాదాలేమిటని ముఖ్యమంత్రి ఆశ్చర్యపోలేదు. కలెక్టరుతాను రాడికల్స్‌ని ఎలా అణిచేశారో ముఖ్యమంత్రికి వివరించాడు. ఇంకా వివరాలకోసం తక్షణమే పోలీసు రాష్ట్రఉన్నతాధికారులతో, జిల్లాపాలనా యంత్రాంగంతో సమావేశం ఏర్పరిచాడు. ఆ సమావేశం జరిగే హాలులోకి అందరూ ప్రవేశించాక కలెక్టరుగారు స్వయంగా తలుపులుమూశారు.

కాసేపటికి............

నగరం నడిబొడ్డున. ఐదారుగురు సాయుధ పోలీసులు ఎప్పుడూ మృత్యు దూతల్లా పర్యవేక్షిస్తుంటే, రద్దీగావున్న మూడురోడ్లకూడలి మీద ప్రధాన పోలీసు కార్యాలయానికి రైఫిల్ రేంజిలో ముఖ్యమంత్రి బసకి సైరన్ వేటు దూరంవున్న సారా దుకాణం మీద రాడికల్స్ దాడిచేసి దాన్ని తగలబెట్టారని వార్తవచ్చింది.

నవంబర్ 25 శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాట ప్రారంభదినం

శ్రీకాకుళం :

"దోపిడిపాలన బైనెట్లకు వ్యతిరేకంగా"

విజయకౌశల్

ఊపిరి పీల్చడమే సర్వస్వం కాదు
విస్కీ, జిన్ తాగితేనే
కళ్ళు ఎర్రబడవు
కాఫీ హోటల్లో మాత్రమే
కవిత్వం రాయబడదు
పరుపుమీదే చావురాదు
దోపిడీ, అత్యాచారాలు
ఆకలి, నిరుద్యోగం, దారిద్ర్యం
నిరాహారదీక్షలవల్ల, అహింస
పార్లమెంటరీ ప్రజాస్వామ్యంవల్ల
అంతం కావు
బాణం నిమరడం కోసం
మెచ్చుకోవడం కోసం కాదు
సిద్ధాంతాలు కేవలం
చర్చించడం కోసం కాదు
రైతుల - కార్మికుల
విముక్తి గీతాలు
కేవలం తుపాకులతోనే
రాయబడతాయి
దోపిడీపాలన బైనెట్లకు
జవాబు
రైతాంగ విప్లవ బైనెట్లు మాత్రమే.
చావుకు భయపడేది ఎవరు ?
భోషాణాలు నింకుపునే దోపిడిగాళ్ళు

పడ్డీమేసే గాడిదలు
కూ్రిరులైన భూకామందులు.
మేం చావుకు భయపడం
వేలాది సంవత్సరాల నుంచి
చావంటే ఏమిటో మాకు తెలుసు
భారతదేశంలో రాబోయే
రైతుల - కార్మికుల
ఎరుపురాజ్యం కోసం
మా అందరి శ్వాసలు ఆడుతున్నాయి
కృష్ణమూర్తి - బాబులాల్
ఇంకా ఇతర నిజమైన
విప్లవవీరులకు లాల్‌సలామ్ ।

అను : నిఖిల్

(సృజన 71 ఫిబ్రవరి)

అమరులపాదాన...!

బోదాయన

వినువీధివిహరించె ఓ పక్షులారా
నావారు తెలుసుగా - వామాట వినరమ్మ
గుండెపొంగినపాట నా - మదిలోనిమాట
కమ్మనీనోట - అందించిరండి ॥విను॥

జామచెట్టునపండు / కొరికేటిచిలకా
నీనోటిగాటుతో - పండెంతతీపో ।
ఆ నోటితీపిగా - యీమాటనందించు
అడివిలోఅన్నలకు - నా ఎరుపుదండాలు ॥విను॥

ఊరుగేరీతిరిగె - ఓ ఊరిపిచుకమ్మా
మావూరికంటకుని - పీడవిరగడజేసి

శతృనిర్బంధాల - వ్యధచెందినోళ్ళకు
నాగుండెబాధను - గురుతుచేయమ్మ ॥విను॥

నేరేడుచెట్లపై - పారాడెగోరింక
నీమగోముచేతునే - నాకబురుచేర్చవే
దూరమెంతైన మీ - దారినున్నాననీ
పోరుచైతన్యంతోనె - ఒదిగివున్నాననీ ॥విను॥

దూరతీరాల్తిరిగి - పయనించెపక్షులూ
పరిటాలవైరినీ - పదనరికిరటనే
నాగుండెమందార - మాలగా గుచ్చినా
నతసింహులైనారు - వారికందించు ॥విను॥

మాయింటిమంటిపై - కూయకేతీతువా
తల్లికడుపులోన - పేగుకదిలేను
కొల్లగొట్టేదొరల - బంగ్లపైకూయవే
నాశమికతప్పదని - తిట్టిపొయ్యమ్మ ॥విను॥

గజిబిజిగగూడల్లె - గిజిగాడరావమ్మ
బతుకుల్లొబాధలు - కళదోసుకుందాము
కడగళ్ళబతుకులో - ఒడగళ్ళవానలే
బాధలింకెంతైన యీ - బాటవిడకమ్మ ॥విను॥

పొన్నచెట్టుమీద - మసలేటి పావురమ
మోదుగులపూలతో - మాలకట్టేసు
పోరులోఒదిగినా - అమరులపాదాన
ఉంచవే యీమాల - పలకవేజోహార్లు ! ॥విను॥

పిలుపు కోసం

హెచ్చార్కె

అప్పుడప్పుడు గుండె ఎండిపోతుంది
అక్కడే ఒక చెలిమ తవ్వకోవాలి
అప్పుడప్పుడు ఆకాశమే కుంగిపోతుంది
పాకుతూనైనా ముందుకు పాగిపోవాలి

నిన్నటిదాక నినదించిన ఒక పిడికిలి
వాలిపోతూ వాలిపోతూ
పొత్తికడుపులో గుద్దిపోతుంది
తట్టుకుని నిటారుగా నిలబడాలి

వెన్నెముకలోపలి వెన్నుపాము
నాగుబాములా మెలికలు తిరిగి
మెదడుమీద కాటేయజూస్తుంది
లోలోపలి పోరాటంలోనూ గెలవాలి

ఒక్కోసారి అందమైన పావురాయి రూపంలో
మిగ్ - 20 యుద్ధవిమానం నీ భుజాలమీదవాలి
న్యూస్ పేపర్ కిందదాగిన పిస్తోలులాగ
కమాండ్ చేస్తుంది
ముసుగులు చింపేసే
పరికరాలు కూడా నిరంతరం నీతో వుండాలి
ఇది మామూలే.
జలపాతాలక్రింద చక్రాలు తిరిగేదాక
నది గర్భవతిలా ప్రవహిస్తుంటుంది
అంతర్లీనమైపోయి తిరిగి జన్మిస్తుంటుంది
హఠాత్తుగా పనిపడినట్లు
ఎక్కడెక్కడికో పోయి తిరిగొస్తుంది
ఇది అయ్యేపని కాదు లెమ్మని
పదే పదే అనిపింపిస్తుంది.
తప్పదు ట్రెంచీలో
ట్రిగ్గర్ మీద కదలని వేలితో
కనుపాప మీద వాలని రెప్పతో
అలా పొంచి కూచోవాలి.
మీగాళ్ళమీద.

సాయుధమై .... సమస్తమై

కోణార్క

పాములా బుసకొట్టే
సుడిగాలి పడగల నుంచి
నా శ్వాసల్ని లాక్కుంటున్నాను
సంక్షుభిత సముద్రం ఆవేశాల్తో, అలల్తో
నా కాయాన్ని ఖచితం చేస్తున్నాను
అగ్నిపర్వతాల్లో నిక్షిప్తంచేసిన
నా గుప్తధనాన్ని
మళ్ళీ మనసుమీదికి తెచ్చుకుంటున్నాను
నా ఏకాంత కవచాన్నీ
నన్ను చపటనిచేసి బంధించిన చంచల కవిత్వాన్నీ
నేనే ధ్వంసం చేస్తున్నాను
అబద్ధపుఅందాల్ని ఇక్కడికిక్కడే ఖననం చేస్తున్నాను
నేను క్రుద్ధుణ్నౌతున్నాను
ప్రతివాణ్ణీ ఓ డైనమైటై రమ్మంటున్నాను
ప్రతివ్యక్తీ సజీవశతఘ్ని కావాలంటున్నాను
ప్రకృతినీ,నన్నూ, నాప్రళయాల్నీఆవాహనంచేసుకోమంటున్నాను
ఆధునిక పాశుమార్యం సమాధిమీద క్రోధమైమొలవమంటున్నాను
నవ్వులురాలి ముకుళించుకున్న ముఖసీమలు
దోపిడీ పాదాలకింద నేలమట్టమై విస్తరించిన ఎడారులు
మెదళ్ళలోని స్వప్నజలపాతాలన్నీ చక్షుధారలై పోకముందే
ఈదేశం ముఖచిత్రిమ్మీదికి మళ్ళించమంటున్నాను
గుండెల్లోని లావాలు నిట్టూర్పుల్లో భగ్నమైపోకముందే
ఉత్పాతాల్ని సృష్టించమంటున్నాను
నరాల్లోని ప్రళయనాదాలన్నీ కవిత్వమైపోకముందే
సహసముఖాల్తో సాయుధం కమ్మంటున్నాను
సాయుధమై సమస్తమై
ఈ క్రూర ప్రపంచాటవిని వాసయోగ్యంగా మలచమంటున్నాను

హంసగతి

శీరపాణి

గాంధీ జయంతినాడు
ఎన్నో 'సంక్షేమ' కార్యక్రమాలు
ప్రారంభమయినట్టే
పోలీసు సంస్కరణగూడా మొదలవుతుంది
'వెజిటేరియన్ పోలీసుల్ని'
తయారుచేయడానికి.
సమూలంగా నిర్మూలించాల్సిన
రాక్షసివ్యవస్థ కన్నూ ముక్కూ అని తెలిసీ :
ఎందుకో
మనం విడిగా దాన్ని సంస్కరించడానికి
పూనుకొంటాం
(ఆ కన్ను మనను పసిగడుతున్నదనీ
ఆ ముక్కు మనను మురకచూస్తున్నదనీ వెరపేమో)
ఇక్కడ మనం,
రాక్షసి వ్యవస్థ
హరిజనులను, గిరిజనులను కాల్చుకు తింటున్నదనీ
స్త్రీలను చెరుస్తున్నదనీ
పడుపువృత్తిని ప్రోత్సహిస్తున్నదనీ
దాన్లోనే నికృష్టమైన 'వెట్టిచాకిరీ' ఉన్నదనీ
అతితీవ్రంగా, కఠినంగా
విమర్శిస్తాం.
అది
మన కొందరిలో
అమాయకంగా
అతివినయ పూర్వకమైన
'నిర్మాణాత్మకమైన' సిఫార్సులివ్వడంగానో
శీరపోలీసు సంస్కరణవాదంగానో
మిగిలిపోతుంది

అయితే వాడు
కాషాయ వేషంలోని కసాయి వ్యవస్థ
పంపిన ఖాకీ మేధావి
మన ముందు
'గొప్ప'గా ఉపన్యసిస్తాడు !
'సోషల్ కల్చరల్ ఇథాస్'లోనే
పోలీసులు ప్రవర్తిస్తారంటాడు
మనం అవాక్కైపోతాము !
ఈ పరిస్థితుల్లో 'ఎన్‌కౌంటర్ల'తో సహా
అన్నీ సమర్థనీయమేనని !
నిగూఢార్థం మనకు స్పష్టమే-
మనం నిలదీయాల్సినవాడు
మనల్నే నిలదీస్తాడు
ప్రశ్నిస్తాడు
నిర్మాణయుతమైన విమర్శ
సలహాలూ కావాలంటాడు
తెల్లారి పత్రికలు
ఆ వాణినే ఆకాశానికెత్తుతాయి
అందుకే
పులిగొంతులో చిక్కిన బొక్కల్నేరబోతున్న
కలంముక్కు కొంగల్లారా
కాచుకున్న పంజాదెబ్బను
కాచుకోండి !

నా అడివన్నలు

శేషశాయి . కే

మట్టి మనుషులు
గట్టి మనుషులు
పెట్టిలోను
వ్నట్టి మనుషులు

ఒట్టికుండలు
ఇంటజూసి
కంటనీరు
పెట్టబోతేళ్ళు

సదువుసంద్యలు
లేనివాళ్ళు
ముష్టివిద్యలు
చేయనోళ్లు
గడ్డపారలు
పట్టెటోళ్ళు
గడ్డిపోచై
ఉన్నవాళ్ళు
కులంమతము
ఉన్నవాళ్ళు
కుత్సితాలు
లేనివాళ్ళు
నాయమంటె
దరమమంటె
నమ్మకాలు
ఉన్నవాళ్ళు
పొద్దుగూకులు
పోడుగొట్టి
పొట్టలోకి
లేనివాళ్ళు
తిప్పలనకా
నొప్పులనకా
ఇప్పపూలు
ఏరెటోళ్ళు
తుప్పతుప్పా
తిరిగెటోళ్ళు
తునికాకులు
తెంపెటోళ్ళు
కాయగష్టం
చేసెటోళ్ళు

కాయగసరులు
తినేటోళ్ళు
అడివిసారులు
వచ్చినంక
అనుపానులు
తెలుసుకున్నరు
అడివి తమదని
హక్కు తమదని
పోరుపాఠం
నేర్చుకున్నరు
గూడెగూడెం
తిరిగె అన్నల
దాచుకున్నరు
అడివిలోని
బీడిఆకుల
పాటపాడిన
షావుకార్లను
సమ్మెజేసి
సాగదీసి
కట్టరేటు
పెంచుకున్నరు
పోరకగిరక
కొట్టినారు
పోడుసేద్యం
జేసినారు
అడివికొరలు
చుడుకుజేస్తే
అధికారులు
జులుంజేస్తే
రగల్‌జెండా

పట్టినారు
సంఘబలముతో
తరిమినారు
ఇంద్రవెల్లిలో
ఇందిరమ్మ
అసలురూపం
జూసినారు
రామరావు
రంగునేమొ
రత్నపూర్ లో
చూసినారు
అదరమన్నరు
బెదరమన్నరు
రగల్ మార్గం
వదలమన్నరు
తూర్పుదిక్కు
ఎరుపుజూసి
తుడుంగొట్టి
నిలిచినారు
ప్రజలరాజ్యం
కోసమయ్యి
రణందారి
పడ్తమన్నరు
అడవిపార్లు
మాటజెప్పితె
ఆయుధాలు
పట్టనున్నరు

అంకితం : నిర్బంధాల నడుమ మొక్కవోని దీక్షతో ఉద్యమిస్తున్న పోరాట ప్రజలందరికీ.

అక్టోబర్ విప్లవ (నవంబర్ 7) దిన సందర్భంగా

లెనిన్ కవిత

1907 వేసవిలో లెనిన్ రహస్యజీవితం గడుపుతూ ఫిన్‌ల్యాండ్‌లోవున్నాడు. రష్యా రెండవడ్యూమా (పార్లమెంటు)ను జార్ రద్దుచేసాడు. అందువల్ల లెనిన్ అరెస్టయ్యే ప్రమాదంవుండె. లెనిన్ ఫిన్‌ల్యాండ్‌నుంచికూడ తప్పించుకొనివెళ్ళి బాల్టిక్ నదీతీరాన ఒకగ్రామంలో మారుపేరుతో చాలనెలలు గడిపాడు. రహస్యజీవితంలో వుంటూనే ఏడాదిన్నరపాటు తీవ్రమైన రాజనీతి కార్యక్రమాల్లో మగ్నమైన తర్వాత ఆయనకు ఊపిరిపీల్చుకోవడానికి కొంత తెరపిదొరికింది. ఈ అజ్ఞాతవాసంలో ఆయనవెంట పార్టీకామ్రేడ్‌కూడ ఒకాయన వుండేవాడు. బాల్టిక్‌నదీతీరంలో ఒకరోజు తిరుగుతూ లెనిన్ తనస్నేహితునితో - పార్టీపత్రికల్లో ప్రచారకార్యక్రమంకోసం కవితాప్రక్రియను సద్వినియోగం చేసుకోవడంలేదు- అని అన్నాడు. తమకుప్రత్యర్థులైన సోషల్ రెవల్యూషనరీ పార్టీకిచెందినవాళ్ళు చాలమెలకువతో ఈ ప్రక్రియను వాడుకుంటున్నారని లెనిన్‌కుతెలుసు. కవిత్వం అందరూ చెప్పగలిగేది కాదన్నది అతని మిత్రునిఅభిప్రాయం. రాసేఅభ్యాసంవుండి, తగినంత విప్లవఆకాంక్ష, అవగాహనవుంటే విప్లవకారులు కవిత్వంకూడ రాయొచ్చునన్నది లెనిన్‌అభిప్రాయం. అయితే లెనిన్‌నే రాసిచూపమన్నాడు స్నేహితుడు. లెనిన్ ప్రారంభించి మూడు రోజుల్లో పూర్తిచేసాడు.

ఈ కపితలో లెనిన్ 1901-1907 మధ్యకాలంలో రష్యాలోనెలకొన్న పరిస్థితుల దృశ్యాన్ని చిత్రించాడు. విప్లవాన్ని వసంతంతోను, ప్రతీఘాతుక శక్తులను శీతకాలంతోనూ ఆయనపోల్చాడు. విముక్తికోసం నూతన సంగ్రామానికి పిలుపునిచ్చాడు.

ఈ కవిత జెనీవాలో కొందరు సోషల్‌డెమొక్రాట్ కార్యకర్తలు స్థాపించిన 'రాదుగా' (ఇంద్రధనుస్సు) అనే పత్రికలో అచ్చుకావలసివుండె, తనపేరుతోకాక 'ఒకరష్యన్' అనేపేరుతో ఈ కవిత ప్రచురింపబడాలని లెనిన్ సూచించాడు. కాని ఈ కవిత అచ్చుకాకముందే ఆపత్రిక ఆగిపోయింది. 1946 దాకా ఈ కవిత పీటర్స్‌బర్గ్ (లెనిన్‌గ్రాడ్) డిప్టీ, సోషల్‌డెమొక్రాట్ గ్రిగోయర్ ఆలేకశిన్స్కి (రహస్యజీవితంలో ఇతనిపేరు పీటర్‌ఆలా) గ్రంథాలయంలో వుండిపోయింది. అతడే 1946లో దీనిఫ్రెంచి అనువాదాన్ని మొదటిసారిగా 'లా ఆర్కే' అనే పత్రికలో ప్రచురించాడు. ఫ్రెంచ్‌భాషనుంచి నేరుగా బెంగాలీలోకి అనువదించి 1947లో

అరుణ్ మిత్రా 'శారదీయస్వాధీనత'లో ప్రచురించాడు. 1983 ఫిబ్రవరిలో హిందీ లోకి బెంగాలీనుంచి అనువదించి కంచన్ కుమార్ ప్రోగ్రెసివ్ పబ్లికేషన్స్ తరపున ప్రచురించాడు. దాని తెలుగుఅనువాదాన్ని మొదటిసారిగా ప్రచురిస్తున్నాం. మాకు తెలిసినంతవరకు ఇది లెనిన్ రాసిన ఏకైక కవిత.

లెనిన్ నాయకత్వంలో సాధించుకున్న రష్యన్ అక్టోబర్ విప్లవమే కాక, మావో నాయకత్వంలో సాధించుకున్న చైనావిప్లవంకూడ రివిజనిజానికి ఎరఅయిపోయిన ఈ గడ్డుకాలంలో లెనిన్ కవిత విప్లవకారులకు నూతన ఉత్తేజాన్ని ఇస్తుందనే ఆకాంక్షతో -

— 'సాహితీమిత్రులు'

తుఫానులో పుష్పఫలం

అది తుఫాను సంవత్సరం
దేశమంతా ప్రభంజనం తాకిడి
మేఘాలు చెల్లాచెదరై పోయినయ్
మా మీద తుఫాను విరుచుకుపడింది
వడగళ్ళూ, పిడుగులూ
దెబ్బమీద దెబ్బ
ఊళ్ళో పొలాల్లో నోరు తెరచుకొన్నగాయాలు
మెరుపు క్రూరంగా మెరవసాగింది
జాలిలేనిఎండ మండిపోసాగింది
గుండెలపై ఎక్కికూచున్న బండల భారం
నక్షత్రాలులేని రాత్రి నిశ్శబ్దాన్ని
అగ్నికాంతి వెలిగించింది

యావత్ప్రపంచమూ ప్రజలూ చెల్లాచెదరైపోయారు
తీరనిభయంతో ఎదకుర్రింగి పోసాగింది
వేదనతో ఊపిరిసలపకుండా అయిపోయింది
వాడినముఖాలతో మూగబోయింది జనం
వెత్తుటి తుఫానులో వేలాదివీరులు ప్రాణాలుకోల్పోయారు

అయితే వారు అలా వృథాగా కష్టాలు సహించలేదు-వృథాగా ముళ్ళబాసికం ధరించలేదు
అసత్యపు చీకటిరాజ్యంలో మోసగాళ్ళ మధ్యనుండి
వాళ్ళు పురోగమిస్తూపోయారు రేపటి దివిటీల్లాగా-

రగిలేమంటల్లో నిరంతరం ప్రజ్వరిల్లే సెగల్లో
మాఎదుటే యీ త్యాగమార్గాలు వెలసినై
నియత జీవితంమీద, బానిసత్వపుకాడిమీద, సంకెళ్ళ మర్యాదమీద
వాళ్ళు ద్వేషపు ముద్రలు వేశారు

కరుడుగట్టిన మంచునిశ్వసించింది - ఆకులు పాలిపోయి రాలసాగినై
గాలిలోచిక్కి గిరగిరా తిరుగుతూ మృత్యునాట్యం చేయసాగినై
వర్షపు దుఃఖం నిండి, నల్లటిబురదలో కూరుకొనిపోయి
హేమంతం - ధూసరిత జీర్ణహేమంతం వచ్చింది
మనిషిబతుకే అసహ్యమూ నిస్సారమూ అయిపోయింది
జీవన్మరణాలు రెండూ వారికి అసహనీయమైనై
కోపమూ దుఃఖమూ వారిని నిరంతరం కెలకసాగినై
వారి మనస్సు వాళ్ళ యిళ్ళలాగే
మంచులాకరుడుగట్టి శూన్యమూ విచారగ్రస్తమూ అయిపోయింది

ఇంతలో హఠాత్తుగా వసంతం! కుళ్ళుతున్న హేమంతంమధ్య హఠాత్తుగా వసంతం!
వదలిన దరిద్రదేశంలో స్వర్గపు వరంలా
మావద్దకి దిగివచ్చింది ఒక ఉజ్వల సుందర వసంతం
యోధుల అగ్రగామిదళంలా అరుణవసంతం
కాంతివిహీన ఆకాశంలో మొలుచుకొచ్చింది
మేనెల[1] ఉదయంలాంటి ఒక ఎర్రనిప్రాతఃకాలం
మెరిసే సూర్యుడు తన అరుణకిరణ కరవాలంతో
మేఘాల్ని చీల్చివేశాడు - పొగమంచు శవవస్త్రం చిరిగిపోయింది
ప్రపంచసాగర లోతుల్లో దీపస్తంభం వెలుతురులా
ప్రకృతివేదికపై అజ్ఞాతహస్తాలు వెలిగించిన
శాశ్వతహోమాగ్నిలా
నిద్రపోయిన మనుషుల్ని అతడు వెలుతురువైపు ఆకర్షించాడు

1. రష్యాలో వసంతం మేనెలలో వస్తుంది

ఆవేశపూరిత రక్తంతో పుట్టిన రంగులగులాబీలు, ఎర్రెర్రనిఫలాలు
వికసించినై
విస్మృత సమాధులపై గౌరవహారాలు పరచినై
వసంతంలో నీటిప్రవాహం వెల్లివిరిసినట్లు
ఎర్రజెండా ఎగురవేసి
విముక్తి రథంవెనుక
నదిలా ప్రవహింపసాగింది జనం
ఊరేగింపుమీద ఎర్రజెండా రెపరెపలాడింది
విముక్తితో ఆకాశం ప్రతిధ్వనించింది
అమరవీరుల స్మృతిలో ప్రేమాశ్రువులు కారుస్తూ
జనులు శోకగీతాలు పాడసాగారు
సంతోషం నిండారిన
జనం మనసు ఆశలతో, కలలతో నిండిపోయింది
విజ్ఞులూ వృద్ధులూ పిల్లలూ
అందరూ రానున్న స్వేచ్ఛలో నమ్మకం పెట్టుకున్నారు.
నిద్రనుంచి మేల్కొనక తప్పదు
నగ్నసత్యం,
కలలూ, మత్తెక్కిన స్వర్గసుఖం తరువాతనే (తెలివి)వస్తుంది
వంచన చేదురుచి,
మాటేసి పొంచిఉన్న చీకటి శక్తులు
మట్టిలోపాకుతూ బుసలుకొడుతూ
హఠాత్తుగా వీరుల వీపులో, కాళ్ళలో
పశ్యా కత్తులూ దిగవేసినై
ప్రజాశత్రువులు తమ కంపునోళ్ళతో
స్వచ్ఛమైన వేడిరక్తం తాగేశారు
నిశ్చింతగా విముక్తి మిత్రులు
కఠినమార్గాయాసంలో అలసిసొలసి
నిరాయుధులై కునికిపాట్లు పడుతున్నప్పుడు
హఠాత్తుగా వారిపై దాడిజరిగింది

వెలుతురు దినాలు ఆరిపోయినై
వాటిస్థానంలో వచ్చిచేరినై అంతులేని (అభిశప్త) చీకటిదినాలవరుసలు
విముక్తి కాంతీ, సూర్యుడూ ఆరిపోయినై
చీకట్లో నిటారుగానిలుచుంది ఒక పాముచూపులభూతం
జుగుప్సాకరమైనహత్యలు, పరంపరగావస్తున్న హింసాకాండ, కుత్సితప్రచారం
దేశభక్తిగా చాటబడుతున్నది
నల్లభూతాలసామూహిక ఉత్సవం జరుపుకొంటున్నారు
అదుపులేని రాతిగుండెల క్రూరప్రతీకారానికి బలైన
విశ్వాసఘాతుక దాడుల్లో నిష్కారణంగా నిర్దయగా చంపబడ్డ
అలా జ్ఞాత, అజ్ఞాత జనులరక్తాన్ని వారు పులుముకున్నారు
సారాయిసెగల్లో, బూతులుతిడుతూ, పిడికిళ్ళు బిగిస్తూ
చేతుల్లో ఓడ్కాబుడ్లతో తుచ్ఛులగుంపులు
పశువులమందల్లా పరుగెడుతున్నారు.
వాళ్ళజేబుల్లో విశ్వాసఘాతుకపు డబ్బుల గలగలలు
దోపిడి నాట్యంచేస్తూవాళ్ళు

కాని ఆ మూర్ఖపు 'ఇయేమలియా' [2]
బాంబుభయంతో మరింత మూర్ఖుడై ఎలుకలా వణికిపోతాడు
ఆ తరువాత నిస్సంకోచంగా చొక్కాకి
'బ్లాక్ హండ్రెడ్' [3] చిహ్నం తగిలించుకుంటాడు
స్వేచ్ఛా ఆనందాల మరణాన్నిచాటి
రాత్రిచీకటిలో గుడ్లగూబలనవ్వులో
ప్రతిధ్వనిస్తాడు.
శాశ్వతమైన మంచురాజ్యంనుంచి
క్రూరమైన ఒకచలికాలం మంచుతుఫానును తీసుకువచ్చింది
తెల్లని శవవస్త్రంలాగా దళసరిమంచుపొర
దేశాన్నంతా కప్పివేసింది

---

2. రష్యన్లు 'ఇయేమలియా' అను పేరును మూర్ఖత్వపు గుర్తుగా వాడుతారు
3. 'బ్లాక్‌హండ్రెడ్' జారుకాలపు అంతిమ ప్రతీకారవాద రాజకీయదళం

మంచుగొలుసులో బంధించి హంతక శిశిరం
వసంతాన్ని అకాలంగా హత్యచేసింది

మంచుకింద అణగి పాపం అసహాయంగా గ్రామాల నల్లని చిన్నగుడిసెలకప్పులు
అక్కడక్కడా బురదమరకల్లా కనిపిస్తున్నాయి
దారుణ, వివర్ణ శీతకాలంతో పాటు ఆకలి
దరిద్రకొంపల్లో అంతటా స్థావరమేర్పరచుకొన్నది
ఆగ్నేయపు అత్యంతవేడిని మోసుకొచ్చే వేసవి వడగాలుల
అంతులేని అతిశీతల ప్రాంతాన్ని ఆవరించి
హద్దులులేని అతివిస్తారపు స్టెప్పీ[4] లను చుట్టుముట్టి
పిసినారి తెల్లపిట్టల్లా క్రూర హిమప్రవాహాలు వస్తూపోతూ ఉంటాయి
కట్లుతెంచుకొని ఆ ప్రవాహాలన్నీ మాటిమాటికీ గర్జిస్తూ ఉండినై
వాటి విరాట్ హస్తాలు అసంఖ్యాకమైన పిడికిళ్ళలో ఎడతెరపిలేకుండా మంచువిసురుతూ
పోయినయ్
శతాబ్దాలుగా పాడినట్లే
అవి మృత్యుస్తోత్రాలు చేస్తూపోయినయ్ క్రూరమృగంలా
తుఫానుగర్జించింది ఒక రోమాల జంతువులా
కొసఊపిరితో మిగిలిపోయిన ప్రాణాలమీద విరుచుకుపడింది
ప్రపంచంలోని జీవితచిహ్నాలన్నీ తుడిచేయడానికి
భయంకరమైన రెక్కలసర్పాలవలె వేగంగా ఎగరసాగింది
పర్వతంలా మంచును పోగుచేసి తుఫాను
చెట్లనూ మొక్కల్నీవంచి, అడవిని ధ్వంసంచేసేసింది
పశుప్రాయులు గుహలోకి పారిపోయారు
బాటలరేఖలు చెరగిపోయినయ్. బాటసారేలేడు

మూలుగుః పీల్చే ఆకలిగొన్న తోడేలుమనుషులు పరుగెత్తుకొచ్చారు
తుఫానుచుట్టూ తిరుగసాగారు
చిక్కిన వేటకోసం కొట్లాడుతూ
చంద్రునివైపు ముఖమెత్తి చీత్కరిస్తూ

4. స్టెప్పీ గడ్డిమైదానం

బతికిఉన్న ఏకొందరో భయంతో వణికిపోసాగారు
గుడ్లగూబలు నవ్వుతాయి ఆటవికలేశి[5] చప్పట్లుకొడుతుంది
మత్తెక్కిన చీకటి రాకాసిమూకలు సుడిగుండంలో తిరుగుతాయి
వాటి పేరాశపెదాలు అరుస్తాయి
వాటికి మారణహోమం వాసనవేసింది
రక్తసంకేతంకోసం అవి ఎదిరిచూస్తాయి

అన్నింటిపై అన్నిచోట్ల మౌనం, ప్రపంచమంతటా మంచుపేరుకొని ఉంది
బతుకంతా సర్వనాశనమైనట్లు
ప్రపంచమంతా గోరీల కందకమా అన్నట్లు
విముక్తికాంతి జీవితపుజాడ యింకేదీ లేదు

అయినా రాత్రిచేతిలో పగటిఓటమి యింకా జరగలేదు
సమాధివిజయోత్సవం యింకా జీవితాన్ని సర్వనాశనం చేయలేకున్నది
ఇప్పటికీ నివురుగప్పిన నిప్పుకణం నెమ్మది నెమ్మదిగా రగులుతున్నది
జీవితం తనశ్వాసతో మళ్ళీదాన్ని మేల్కొల్పుతుంది
కాలరాయబడ్డ స్వేచ్ఛాకుసుమాలు
ఆవాళ ఒకేసారి నష్టమైపోయాయి
[6] 'చీకటిమూక' కాంతి ప్రపంచపు భయాన్నిచూసి మురిసిపోతున్నది
కాని ఆ పుష్పఫలం జన్మనిచ్చేమట్టిలో తలదాచుకొన్నది
తల్లికడుపులో విచిత్రమైన ఆ బీజం
కనుమరుగైన అగాధరహస్యంలో తననుతాను బ్రతికించుకున్నది
మట్టి దానికి శక్తినిస్తుంది - మట్టినుండి దానికి వేడిలభిస్తుంది
ఆ తరువాత అది ఒక కొత్తజన్మతో మళ్ళీ మొలుచుకొస్తుంది
నూతన స్వేచ్ఛకోసం ఆరాటపడే జీవాణువుల అదిమోసుకొస్తుంది
మంచు కప్పును చీలుస్తుంది
విశాలవృక్షంగా పెరిగి ఎరుపుఆకుల వ్యాపించి

---

5. రష్యా క్షుద్రదేవత
6. ప్రతిచోటా 'కారుపంది' దళం అనకుండా లెనిన్ 'కాదు' (నలుపు) అను పదంతోనే జార్ విప్లవ ప్రతీఘాతుక మూకనుసూచించాడు.

ప్రపంచాన్ని వెలిగిస్తుంది
యావత్ ప్రపంచాన్ని-
శేషప్రజలందరినీ తన నీడలో సమీకరిస్తుంది

సోదరులారా! ఆయుధాలు ఎత్తండి! సుఖపడేరోజులు సమీపించినై
రొమ్ము విరిచి సాహసించండి! దుముకండి పోరాటంలో ముందుకు సాగండి
మీ మనసును మేల్కొలుపండి! హీనమైన పిరికితనపు బెగడును మనసునుండి పారదోలండి
స్థావరాల దృఢపరచండి! నియంతకు కామందులకు వ్యతిరేకంగా
అందరూ ఏకమై నిలబడండి!
గెలుపు సౌభాగ్యం మీ దృఢ కార్మిక పిడికిళ్ళలోనే ఉంది!
ధైర్యంతో రొమ్ము విరవండి! యీ దుర్దినాలు త్వరలోనే అంతమౌతాయి
మీరంతా ఏకమై విముక్తి శత్రువుకి వ్యతిరేకంగా నిలవండి!
వసంతం వస్తుంది.... వస్తున్నది.... వచ్చేసింది
మనం అత్యంతంగా కోరే ఆ వినూత్న అద్భుత సుందర అరుణ విముక్తి
మనవైపు పురోగమిస్తూ వస్తున్నది

నియంతృత్వమూ, జాతీయవాదమూ, మతక్రౌర్యమూ
తు-చ-తప్పకుండా తమ స్వభావాల రుజువుచేసుకున్నాయి
ఆ పేర మనల్ని మాటిమాటికీ చంపారు
వాళ్ళు రైతుల ఎముకలు మాంసాల కూడా ఒలిచారు
పండ్లు విరగ్గొట్టారు
గొలుసుల్లో బిగుసుకుపోయిన మనుషుల జైళ్ళలో పూడ్చిపెట్టారు
మనమేలుపేర, జార్ ప్రతిష్ఠకోసం, సామ్రాజ్యక్షేమంకోసం
వాళ్ళు చట్టబద్ధంగా దోపిడీలూ, హత్యలూ చేశారు
జార్ గులాములు వాని తలారులను తృప్తులచేశారు
సర్కారీసారాతో, ప్రజల రక్తంతో
వాళ్ళ సేనలు తమ అగడుబడ్డ రాబందులకు విందుచేశారు
విప్లవకారుల శవాలువేసి విధేయులు, విశ్వసనీయులైన సేవకుల శవాలూ వేసి
హంతకులను వాళ్ళు తృప్తిపరచారు
వాళ్ళ పేరాశ రాబందుల బలిపించారు
ఏసుక్రీస్తు సేవకులు ప్రార్థనాయుతంగా

ఉరికొయ్యల అడవిలో పవిత్రజలాలను చల్లారు
శభాష్ ! మనజారుకు జయమగుగాక !
ఆయన ఆశీర్వాదంపొందిన ఉరితాడుకి జయమగుగాక !
కొరడా, ఖడ్గం, తుపాకీధరించిన ఆయన పోలీసులకు జయమగుగాక !
ఒరేయ్, ఓ సైనికుల్లారా ! ఓ గిలాన ఓడ్కాలో
మీ పశ్చాత్తాపాలను ముంచేయండి
ఒరేయ్, ఓ 'శూరు'లారా ! పిల్లలమీద, స్త్రీలమీద గుండ్లుకురిపించండి !
మీ ధర్మపిత ఆనందంకోసం
సాధ్యమైనంతమేరకు మీ సోదరులను హతమార్చండి
ఒకవేళ మీ తండ్రి గుండుతగిలి నేలకొరిగితే
అతణ్ణి తనరక్తంలోనే మునిగిపోనీయండి, కొరడాతో చిందిన రక్తంలో !
జారు సారాతాగి పశువులుగామారి
విస్సంకోచంగా మీరు మీ తల్లుల్నిచంపండి !

మీకేంభయం ?
మీ ముందున్న వారు జపాను[7] వారు కాదుగదా
వారు పూర్తిగా మీవారే
పొత్తిగా నిరాయుధులు
ఓ జారు నౌకరులారా ! మీకు ఆజ్ఞ యివ్వబడింది
మీరు మాట్లాడవద్దు ! ఉరితీయండి !
గొంతులు కోయండి, గుండ్లుకురిపించండి, గుర్రపుడెక్కలకింద నలిపేయండి !
మీ యీ ఘనకార్యాలకు గౌరవపతకాలు పవిత్రసిలువలు లభిస్తాయి....
కాని ఒరేయ్ ఓ జుడాస్[8] మూకల్లారా !
మీకు యుగయుగాలశాపం తగులుతుంది
ఒరే, ఓపర్రిజలారా ! మీ ఆఖరిచొక్కాయిచ్చేయండి
త్వరత్వరగా యిప్పేయండి చొక్కాలను !
మీ చివరిదమ్మిడీ వెచ్చించి సారా తాగండి

---

7. రష్యా - జపాన్ యుద్ధంలో రష్యాసైనికుల పరాజయాన్ని పలాయనాన్ని లెనిన్ యిక్కడ ప్రస్తావించారు.
8. ద్రోహానికిపాల్పడ్డ క్రీస్తుశిష్యుడు - శిష్యుడిగా ఉంటూనే 30 వెండినాణాల కోసం క్రీస్తును శత్రుసైనికులకు పట్టించినవాడు.

జార్ ప్రతిష్ఠకోసం మట్టిలో తొక్కబడి చచ్చిపొండి !
ఎప్పటిలాగా బరువుమోసే గాడిదలై పొండి !
శాశ్వతబానిసల్లారా ! గుడ్డకాసతో కన్నీళ్ళు తుడుచుకోండి
నేలమీద తలబాదుకోండి !
విశ్వసనీయ సుఖవంతులు
ఆ మరణమూ జార్ ప్రాణాలకన్నా ప్రియమైన ఓజనులారా !
మునుపటిలాగా అన్నిటినీ భరిస్తూపోండి అన్నింటినీ ఒప్పుకుంటూపోండి
తుపాకిగుండ్లూ ! కొరడాలూ ! గాయపరచండి !

"ఓ భగవంతుడా ! ప్రజల్నికాపాడు[9]"
శక్తివంతులు, మహనీయులు అయిన యీ ప్రజల్నికాపాడు !
మా ప్రజలు రాజ్యమేలాలి ! జార్ మూకలకు భయంతో ముచ్చెమటలుపోయాలి।
నీచమైన తన గుంపులవెంటేసుకుని యివాళ జార్ ఉన్మత్తుడై ఉన్నాడు
తుచ్ఛమైన ఆ బానిసముఠాలు యివాళ పండుగచేసుకొంటున్నాయి
రక్తంతోతడిసిన తమ చేతులు వాళ్ళు కడుక్కోలేదు !

"ఓ భగవంతుడా ! ప్రజల్నికాపాడు"
మెషీన్‌గన్ గుండ్ల తీవ్రవర్షంలాగా
అంతులేని అత్యాచారాలు
పోలీసుల కొరడాలు
కోర్టులలో హఠాత్తుగా శిక్షలు !
మీ తిరుగుబాటుకు శిక్షగా
శిక్షలూ, గుండ్లవర్షమూ
భయంకరమైన ఉరికొయ్యల అడవి
జైళ్ళు నిండిపోయినయ్
దేశబహిష్కృతులు అంతులేనిబాధతో మూల్గుతున్నారు
తుపాకిగుండ్ల తీవ్రవర్షం రాత్రిని చీల్చివేస్తోంది
మెక్కి మెక్కి రాబందులకు మొహంమొత్తింది
దుఃఖమూ బాధా మాతృదేశాన్ని అలముకొన్నవి

9. జార్‌సామ్రాజ్య గీతంలోని "ఓ భగవంతుడా జార్‌నుకాపాడు" అనుచరణాన్ని మార్చి లెనిన్ యిలా ప్రజాపరంగా వాడినాడు

కన్నీళ్ళలో మునగని కుటుంబమేలేదు
ఓ నిరంకుశుడా! తొత్తులైన హంతకులతోపాటు
నీరక్తోత్సవాన్ని జరుపుకో!
రక్తంపీల్చే ఓ రక్కసులారా! మీదురాశ కుక్కల్ని ఎగబెట్టి
ప్రజల మాంసాన్ని పీక్కుతినండి
ఒరేయి నిరంకుశుడా! మంటలువెదజల్లు!
ఒరే పశూ! మారక్తంతాగు
స్వాతంత్ర్యమా! నీవుమేలుకో!
ఎర్రజెండా నీవు ఎగురు!

ఇకమీరు పగసాధించుకోండి
ఇదే ఆఖరిసారిలాగా మమ్మల్ని బాధించండి!

శిక్షపొందే సమయం ఆసన్నమైంది
జ్ఞాపకముంచుకోండి! తీర్పు సమీపిస్తున్నది
మేము స్వేచ్ఛకోసం మృత్యుముఖంలో చొరబడుతాం - మృత్యుముఖంలో
మేము విముక్తినీ సత్తానూ సాధించుకొంటాం!
ప్రపంచం ప్రజలదే!

అసమ సమరంలో అసంఖ్యాకులు హతులై పోతారు
అయినా పదండి ముందుకు సాగిపోదాం
మనం అమితంగా ఆకాంక్షించే విముక్తివైపు
ఓ కార్మికసోదరులారా! ముందుకు సాగండి!
విముక్త శ్రమకోసం
మీసైన్యం పోరాటానికి వెళ్ళుతోంది
వాళ్ళ కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి
ఆకాశం కంపించే మృత్యుంజయ శ్రమఘంటను మోగించండి!
సుత్తిదెబ్బతీయి! ఎడతెరిపిలేకుండా గాయపరచు!
అన్నం! అన్నం! అన్నం!

పదండి ముందుకు! రైతులారా! పదండి ముందుకు
భూమిలేనిదే మీకు బతుకులేదు

కామందులు యింకా మిమ్మల్ని పీడిస్తూనే ఉంటారా ?
ఇంకా అనంతకాలమూ మిమ్మల్ని పిప్పిచేస్తూనే ఉంటారా ?

పదండి ముందుకు విద్యార్థులారా ! పదండి ముందుకు
మీలో అనేకులు పోరాటంలో ప్రాణాలుకోల్పోతారు
మరణించిన మిత్రుల శవపేటికల
ఎర్రపట్టీ చుట్టిపెడతారు

పదండిముందుకు 'క్షుధితుల్లారా ! పదండిముందుకు !
పదండిముందుకు క్షుధితుల్లారా ! పదండిముందుకు !
సాగండి ముందుకు 'ద్రోహు'లారా !
స్వేచ్ఛాజీవితంపైపు !
పశుశాసనాలకాడి
మనకు అవమానకరం
పదండి ! ఎలుకల్ని వాటికలుగుల్లోకి తరుముదాం
ఓ పీడితులారా ! పోరాటంలోకి పదండి
ఈ దుఃఖమూ బాధా నశించుగాక !
నశించుగాక జార్ ! నశించుగాక అతని సింహాసనం !
అదో చూడండి ! తళతళలాడుతోంది !
నక్షత్రశోభిత స్వేచ్ఛా ఉదయకాంతి
సత్యమూ సంక్షేమ కిరణము
ప్రజల కళ్ళముందు ఎగసివస్తున్నది
విముక్తి సూర్యుడు మేఘాలను చీల్చి
మనల్ని వెలిగిస్తాడు

వెర్రిగంట ఆవేశపూరిత నినాదం
విముక్తిని ఆహ్వానిస్తుంది
"శోకముడిచి పారిపోండ"ని
జార్ దుండగుల్ని అదలిస్తుంది
"మేము జైళ్ళను పగులగొడుతాం"
సత్యావేశం గర్జిస్తోంది

"బంధనాలు విడిపించేజెండా
మా యోధులను నడిపిస్తుంది"

పీడన, విధ్వంసం
కొరడాలు, ఉరికొయ్యలు నశించుగాక!
స్వేచ్ఛాజీవుల పోరాటమా! నీవు ఉప్పెనలా చెలరేగు!
దుండగులారా! నశించండి!

రండి! నియంతశక్తిని
సమూలంగా నాశనం చేద్దాం
విముక్తికోసం మరణించడం గౌరవం
బంధనాల్లో యిరుక్కొన్న జీవితం అవమానకరం

రండి, దాస్యాన్ని ఛేదిద్దాం!
ఛేదిద్దాం బానిసత్వపు అవమానాన్ని
ఓ స్వాతంత్ర్యమా!
నీవు మాకు ప్రపంచాన్ని, స్వేచ్ఛనీ యివ్వు!

పిల్లలపాట:

ఆరాంకోర్

భూపాల్

గాలీ గాలీ - దారులపోలీ
దాగుడుమూతా - దండాకోర్
ఊరిఅంచున - మత్తడికాడా
మన్నును జూసెను - పుండాకోర్
పిలగాడైనా - పుల్లనిపిలిచీ
మన్నును తెమ్మనె - మాటాకోర్
తెచ్చిన మన్నుకు - ఇచ్చిన పైసలు
ఆఠానయ్యో - ఆరాంకోర్
బొమ్మలుచేసే - పిలగాడొక్కడు
బోలాశంకర్ - ఉన్నడురోయ్
శంకర్ చేసెను - రూపాయిస్తే
నాలుగుబొమ్మలు - చక్కలురోయ్
రంగడువేసే - రంగులు వాటికి
ఆఠానిస్తే - అన్నిటికోయ్

పుండాకోరుడు - బొమ్మలనమ్మెను
రూపాయికొక్కటి - చూడండోయ్
తెచ్చిన మన్నును - ఆఠానిస్తే
బొమ్మలుచేయగ - రూపాయిచ్చే
అన్నిటి రంగుకు - ఆఠానిచ్చే
అమ్మగబొమ్మలు - అతనికి అచ్చట
వచ్చెను నాలుగు - రూపాలోయ్
ఆఠానాఠన - రూపాయీ
రూపాయీప్లస్ - రెండాయే
నాలుగు మైనస్ - రెండ్లూ ఐతే
లాభం రెండూ - మిగిలాయీ
లెక్కలు వచ్చిన - చక్కని పాపలు
ఎవ్వరి కష్టం - చెప్పండోయ్?

పడిలేచే కడలితరంగం :

కాల్చినా కూల్చినా

కె. ఎల్

గప్పుడే దీపాలుముట్టిచ్చిండ్లు. పొద్దంత పనిచేసివచ్చిన రైతుకూలీలు. జెర అన్నంతిందామని. ఎవరిఇండ్లలో వాళ్ళు అన్నంతినడానికి సిద్దమైతుండ్లు- ఇంకా సాకలోల్లు ఊరుతిరిగి ఇండ్లల్లకు చేరుకోనేలేదు. ఒక పోలీసువ్యానువచ్చి ఊరి పక్కన ఆగింది. దానిలోనుండి దాదాపు 30 మంది కాకిబట్టలమనుషులు దిగిండ్లు. మనిషికోతుపాకి భుజానికి వేల్లాడుతున్నది. దిగినవాళ్ల టోపీలునెత్తికి పెట్టుకుండ్లు. ఒక్కసారి తుపాకులు తడుముకొని ఒకచేతిలోలైటు మరొకచేతిలో లాఠీలుపట్టుకొని నిలుచుండ్లు. మెల్లగా వ్యానులోశెల్లి జెరగూనిఉన్నోడు కండ్లునులుముకుంటు, కిందికి దిగిండు. నడుముకుఉన్న రివాల్వర్ తీసి చేతిలోపట్టుకొని అందరికేసిచూసి.... "అందరూ జాగ్రత్తగా నడవండీ" అని ఆజ్ఞఇవ్వంగనే అందరూ ఊళ్ళోకి నడుస్తుండ్రి. గా రివాల్వర్ఉన్నాయినే వాళ్ళదాంట్లోపెద్ద. గాయినను అమీన్సాబ్ అంటరు.

పోలీసులుచుట్టు- నడుమ అమీన్సాబ్ నడుచుకుంటు ఊళ్ళోకిపోతుండ్లు. కొంతదూరం పోయేసరికి ఒకాయన సైకిల్తేసుకొని వస్తుండు. సైకిలుకు ఎనుక బ్యాగువుంది. మనిషి జెరగట్టిగానేఉండు. కుప్పిమీసాలు నోట్లోసిగరెటుపెట్టుకొని సిగరేటుకాల్చుకుంటు సైకిలుతొక్కుకుంటు వీల్లకుఎదురయ్యిండు. ఆ వచ్చే మనిషి పై పోలీసులు ఒకేసారి లైట్లువేసిండ్లు. ఆ లైట్లవెలుతురుచూసి సైకిలువ్యక్తికి ఏమి అర్థంకాక సైకిల్ఆపి కిందికిదిగిండు. దిగిన మనిషిచుట్టు పోలీసులు చుట్టుముట్టిండ్లు. తుపాకులు ఎక్కుపెట్టిండ్లు.

అమీన్సాబ్ సైకిలు వ్యక్తితో.... 'అరేయ్ ఎవడ్రానువ్వు నక్సలైటువా చెప్పు. అన్నాడు.

సైకిల్వ్యక్తి.... 'కాదుసార్ నేనుడాక్టర్ని' అన్నాడు.

"లంజకొడుక నువ్వుడాక్టరువా. మాకు మస్కకొడుతున్నవ్. అదేంటిదిరా నీసైకిల్కుబ్యాగు. అది నక్సలైట్ల బ్యాగులెక్కనేఉంది. దాంట్లో బాంబులున్నయి అంతేకాదు నీమీసాలుచూస్తేనే తెలుస్తున్నది. నువ్వునక్సలైటువని".

"లేదు....సార్.... నేను నిజంగానే డాక్టర్ని కావాలంటే బ్యాగులో మందు లున్నయి చూపిస్తా. చూడండి"

"అరేయ్ వీడుబాగామర్లబడుతూ నకరాలుదెంగుతండు. అందుకోండి" అని అమీన్ పోలీసులకు పిలుపుఇవ్వగానే డాక్టర్ వీపుపై లాఠీలు నాట్యంచేసినయి.

ఇంతలో ఇంకోజీబువచ్చి ఆగింది. దాంట్లోనుండి ఒకడు రివాల్వర్ పట్టుకున్నడు. ఇంకా 8 మంది భుజాలకు తుపాకులు చేతులలోకట్టెలు పట్టుకొని దిగి నడుచుకుంటు పోలీసులుచేస్తున్న గొడవదగ్గరికి చేరుకుండ్లు.

ఆ వచ్చేవాళ్ళనుచూసి పోలీసులు డాక్టరును కొట్టడముఆపి వచ్చేవాల్లలో బక్కగా పొడుగుగా జెరనల్లగాఉన్న లొట్టముక్కోనికి అందరూ వాళ్ళపోలీసు బాషలో నమస్తె చెప్పిండ్లు. గాలొట్టముక్కోడు సర్కిల్. వీళ్ళఅందరికన్న పెద్ద.

అమీన్ సర్కిల్‌తో "సాబ్ వీడు ప్యూర్ నక్సలైటు వీనిదగ్గర ఆ ఎర్రిబ్యాగు దొరికింది. వాడు నక్సలైటు అనడానికి ముఖ్యమైన ఆధారము వాని ముఖానికిఉన్న కుప్పిమీసాలే" అని అన్నడు.

అమీన్ చెప్పిందివిని సర్కిల్ తన చేతిలోఉన్నలైటు డాక్టర్ ముఖంపై వెలిగించి మీసాలుపట్టి అటూఇటూ పీకసాగిండు (అవిపెట్టుకున్న మీసాలు అనే అనుమానంతో) కాని అవి ఊసిరాలేదు. మీసాలు పీకడంఆపి వెనుక సైకిలుకు పెట్టిఉన్న బ్యాగునుచూసి ఆ డాక్టరుతోనే బ్యాగును విప్పించిన్రు. ఎందుకంటె దాంట్లోబాంబులున్నాయిఅనే అనుమానంతో. పోలీసులు విప్పితే అవిపేలి చనిపోతారు అనేభయంతో బ్యాగులో మందులు ఉండటంవలన సర్కిల్ ఆబ్యాగు తీసుకొని నేలకుకొట్టి "అరేయ్ నువ్వు నక్సలైట్లకు మందులు ఇస్తావటకదా" అని అన్నడు "లేదుసార్" అన్నాడుడాక్టర్ సర్కిల్ డాక్టర్‌తో "అరేయ్ తప్పయిత్యందని మా అందరికి దండంబెట్టి ఎల్లిపో"అని అనగానే అందరికీ దండంబెట్టి సైకిలు పట్టుకొని ముందుకు అడుగువెయ్యబోయాడు. దాంట్లో పొట్టిగా గడ్డంఉన్న పోలీసోడు సైకిలు దగ్గరికివచ్చి రెండుపయ్యల్ల గాడుపు పీకిపారేసిండు. గాడుపుపోయిన సైకిలుపట్టుగొని డాక్టరు వెళ్ళిపోయిండు.

అక్కడి నుండి సర్కిల్ అమీన్ ముందట నడువంగా పోలీసులు వాళ్ళవెంట నడుసుకుంటు నాలుగు బజార్లకాడికి చేరిండ్లు. నాలుగుబజార్లకాడ ఒకఇంటిలో చుట్టాలు వస్తే ఆ ఇంటాయన, చుట్టాలుకలిసి కూర్చొని అన్నంతింటుండ్లు ఆ ఇంటిచుట్టు పోలీసులు చుట్టుముట్టిండ్లు- అన్నంతినేవాళ్ళను పట్టుకొని మీరు మీటింగు పెడుతండ్లు అని వీపులువగలగొట్టి వాళ్ళముడ్డికిఉన్న పంచెలు ఊడబీకి రెక్కలు వెనుకకువిరిచికట్టి- బజారులో కూర్చోబెట్టి నలుగురు పోలీసులను కావలిబెట్టి ఈ రాక్షసదండు హరిజన

గూడెంవైపు కదిలింది. హరిజన గూడెంవైపు పొయ్యే దారిలోనే సంఘనాయకుడు వెంకన్న ఇల్లుఉంది వెంకన్న ఇంటికిపోయిండ్లు. పోయి ఒక పోలీసోడు "అరేయ్ వెంకటి వెంకటి తలుపుతియ్యి" అని పిలువసాగిండు. కాని ఇంటిలోనుండి సమాధానము రాలేదు. అమీన్‌సాబ్ చేతిలోఉన్న లైటుతో తలుపులకు ఫోకస్ కొట్టేసరికి తాళంవేసి ఉన్నవి. అదిజూసి సర్కిల్ "లంజకొడుకు ఇంటికి తాళంబెట్టి ఎక్కడికోపోయిండు. తాళాలుపగులగొట్టి ఇంటిలో జొరబడి ఇంట్లోఉన్న బోల్లన్ని పగులగొట్టండి" అని ఆజ్ఞ ఇవ్వగానే పోలీసులు తాళాలుపగులగొట్టి ఇంటిలో జొచ్చిండ్లు.

ఇంట్లోచొరబడి అన్నంతినేపల్లాలు బిందెలు అన్నింటిని తుక్కు-తుక్కుగా నలగగొట్టిండ్లు. మంచాలు ముక్కలు ముక్కలుగా నరికిండ్లు. అవి చాలవన్నట్టు సర్కిల్ "అరేయ్ ఈలంజకొడుకు కరంటుపెట్టుకుండు ఆ మీటరు పగులగొట్టండి" అన్నడు.... అంతే మీటరుపగిలింది. కరంటుబుగ్గలు ముక్కలుముక్కలై నేలపై పడ్డాయి. ఈ చప్పుడుకు ఇంటిపక్క వ్యక్తి పండుకున్నోడికి తెలివిపడ్డది.

గురువయ్య సింగరేణిలో పనిజేస్తుండు. పిల్లగండ్లను చూసిపోదామని ఆనాడే ఇంటికివచ్చిండు. గురువయ్య తలుపులుతీసికొని ఇవతలికివస్తూ.... "ఒరేయ్ ఎవడ్రా ఇంట్లోజొచ్చింది" అనుకుంటూ బయటఉన్న పోలీసులనుజూసి గుండెజల్లుమని కాళ్ల జేతులు చల్లబడ్డయి- అంతే మనిషి చెట్టోలె అక్కడే నిలబడిపోయిండు.

అమీన్ "పట్టుకోండి.... లద్దికొడుకును". అనంగనే పోలీసులు పట్టుకొని చేతులు వెనుకకు విరిచికట్టిండ్లు.

సర్కిల్ "అరేయ్ నీపేరేందిరా" అని అడిగిండు.

"అయ్యా నాపేరు గురువయ్య"

"నువ్వు ఏంపనిజేస్తవురా"

"అయ్యా సింగరేణిలో బాయిపని".

"వెంకడు నీకేమికావాలె".

"తమ్ముడుసార్".

"వాడు ఎక్కడికి పోయిండురా". "ఏమోసార్.... నాకుతెలువదు". మధ్యలో అమీన్ కల్పించుకొని.... "తెలువదు లద్దికొడుకును తంతె తెలుస్తది తన్నండి" అన్నడు. అంతే కాకిమనుషులు తుపాకులుమర్లేసి గురువయ్యను కొట్టసాగిండ్లు. ఆ

దెబ్బలకు గురువయ్య ఆగలేకగొడ్డుఒర్లినట్టు ఒర్రుతాండు. గురవయ్యను నలుగురు పోలీసులు తీసుకొని నాలుగు బజార్లకెళ్ళి పోసాగిండ్లు.

ఈ పోలీసుదళం హరిజనగూడెంలో చొచ్చింది. కనబడ్డవారినల్లా తన్నిండ్లు. సంఘసభ్యుడు బాపుఇంటికి పోయిండ్లు. బాపులేడు బాపు తండ్రిదొరికిండు. బాపు తల్లిని భార్యను దొరికినతండ్రిని చితకబాదిండ్రు. ఇంట్లోఉన్న సామాను ధ్వంసం చేసిండ్లు. అదేగూడెంలో సంఘసభ్యుడు చిన్నాలు ఇంటికిపోయిండ్లు. చిన్నాలులేడు. చిన్నాలు అన్నను పట్టుకుండ్లు. చర్మంపగిలేటట్లుకొట్టిండ్లు. తాళ్ల గీసడంకోసం తెచ్చుకున్నానెను కాలబెట్టిండ్లు. ఆ గూడెంలో దొరికినవాళ్ళను దొరికినట్టు పట్టుకొని తన్నుకుంటు తీసుకొని నాలుగు తొవ్వలకాడికి చేరిండ్లు.

సర్కిల్ అమీన్‌తో "వాడు ప్రభాకర్‌గానిఇంటికి పోవాలె నడువండి" అనగానే అందరూ ప్రభాకర్ ఇంటికి పోయిండ్లు. ఇంటిచుట్టు చుట్టుముట్టిండ్లు.

అమీన్ "అరేయ్ ప్రభాకర్" అని పిలిచిండు. ఇంట్లోనుండి "ఎవరుల్లా ప్రభాకర్ లేడు" అని తల్లి సమాధానం చెప్పింది

"ఎవరుల్లా అంటున్నవ్ తలుపుదియ్యముండా అమీన్‌దొర సర్కిల్‌దొర వచ్చిండ్లు" ఒక పోలీసోని దబాయింపు. ప్రభాకర్ తల్లి తలుపుదీసింది.

"ఏమే- నీకొడుకేడే" "ఏమోసార్ నాకు తెలువదు".

"తెలువదు.... తెలువదూ బొక్కలిరుగదంతే తెలుస్తది. లంజను తన్నండి" పోలీసులు సికవెంట్రుకలు పట్టుకొని ఆమె స్పృహతప్పిపొయ్యేదాక కొట్టిపడేసిండ్లు ఇంట్లోచొరబడి కుండలు బొల్లు పగులగొట్టి గుమ్మిలోఉన్న వడ్లను పెసల్లను మక్కలను ఇంటి వెనుక పెరడులో చల్లిండ్లు బియ్యంలో గ్యాసునూనె కలిపిండ్లు ఉప్పు పప్పులన్ని బావిలో పారబోసిండ్లు ఇంటినంత అలగడంగడిచేసి అక్కడినుండి స్త్రీ పురుషులు వృద్ధులు పిల్లలు అనేతేడా లేకుండా కనబడ్డ వారినల్లా తన్నుకుంటు దొరికిన కొందరు రైతుకూలీలను తీసుకొని నాలుగు తొవ్వలకాడికి వచ్చిండ్లు

* * * * *

అప్పటికి పడిజామురాత్రి అయ్యింది నాలుగు బజార్లకాడి నుండి అందరిని తీసుకొని ఊరుపక్క రోడ్డుదగ్గరికి తీసుకపోయిండ్లు. అక్కడే ప్రజలకోసంపోరాడి తమరక్తాలను ధారబోసిన అమరవీరులు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టగౌడు, లచ్చిరెడ్డి,

లక్ష్మిరాజం, పోచెట్టి, కుమారస్వామి (రవి)ల పేరిట కట్టిన స్థూపం "ఎదురుకాల్పుల" పేరుతో ఇందిరా సర్కారు పోలీసులు కాల్చిచంపిన ఎర్రజెండా బిడ్డడు అమరవీరుడు కా॥ బియ్యపు దేవేందర్ నాయకత్వంలో ఆ స్థూపం కట్టడం జరిగింది.

గాస్థూపం దగ్గరికే దొరికిన రైతుకూలీలను తీసుకచ్చి ఒకపక్క కూర్చొబెట్టిండ్లు, సర్కిల్ అమీన్ రోడ్డుమీద కూర్చోటానికి ఏమీలేకనిలుచుండ్లు ఇది కనిపెట్టిన నలుగురు పోలీసులు అక్కడే హోటల్ పెట్టుకున్నకుంటాయన గుడిసెఉంది ఆయన పేరు మల్లయ్య ఆయనకు రెండుకాళ్లులేవు ఏదో హోటలు పెట్టుకొనిబతుకుతుండు. కుంటాయన మంచంలో నిద్రపోయి పడుకుండు. పడుకున్న కుంటాయనను మంచంలోంకెల్లిఎత్తి కిందపడేసిండ్లు. కిందపడి తెలివివచ్చిన కుంటాయన కండ్లుతెరిచి చూసేసరికి ఎదురుంగ పోలీసులు.

పోలీసులనుచూసి "అయ్యా నీబాంచెను కాల్మొక్త- నన్ను ఎందుకుకొట్టిండ్లు" ఏడ్చుకుంటూ అన్నడు.

పోలీసులు "లంజకొడుక.... సర్కిల్.... అమీన్ దొరలు వచ్చి అక్కడ నిల్చొనిఉంటె నువ్వు దొరలెక్క మంచంలో పండుకొని ఉంటావా మాదర్ చోద్" అని బూటుకాళ్ళతో తన్నసాగిండ్లు. ఆ దెబ్బలు భరించలేని కుంటాయన చెంగు చెంగున ఎగురసాగిండు గొడ్డుఒర్రినట్టు ఒర్రికుంట.

పోలీసులు "లంజకొడుక బాగఒర్లుతున్నవ్" అని నోట్లో చెప్పులుపెట్టి స్పృహతప్పిపొయ్యేదాకకొట్టి పడవేసి మంచంతీసుకపోయి స్థూపందగ్గర రోడ్డుమీద వేసిండ్లు, ఆ మంచంలో సర్కిల్, అమీన్ కూర్చుండ్లు.

సర్కిల్ "ఒరేయ్.... గురువా ఇటురారా" అని పిలువగానే గురువయ్యవచ్చి సర్కిల్ముంగట నిలుచుండు

"గా కట్టిందిఏందిరా" "అదిస్థూపం సార్" గురువయ్యజవాబు. "అదిఎందుకు కట్టిండ్లురా?" "ప్రజలకోసం చనిపోయినోళ్ళపేరుమీద వాళ్ళ జ్ఞాపకార్థం కట్టిండ్లు సార్".

"వాళ్ళు ప్రజలకోసం ఏం జేసిండ్లురా"

"అయ్యా వాళ్ళు దొరలవద్దఉన్న పొరంబోగులనుతీసి పేదోళ్ళకు ఇచ్చిండ్లట. కూలోల్లకు కూలిరేట్లు పెంచిండ్లట, దొరలుతిస్న దండుగలు ఇప్పించిండ్లట, దొరలు

చేయించుకునే వెట్టిచాకిరిని రద్దుజేయించిండ్లట. అందరూ సమానంగబతికే రాజ్యం తేవాలని ప్రాణమిచ్చినోల్లంట. అందుకే వాళ్ళపేరుమీద స్థూపంకట్టించినం".

సర్కిల్ గురువయ్యచెప్పిందివిని "ఒరే పిచ్చిముండకొడుకా.... వాళ్ళు ప్రజాసేవకులని ప్రజలకోసంవచ్చినోల్లని నీకుచెప్పినోడు ఎవడురా ?"

"అయ్యా మా దేవేందరన్న జెప్పిండు"....

"గా లంజకొడుకు చెప్పిండా ఆడుజెప్పడా వాడు గసొంటోడేనాయే.... అల్లు ప్రజలకోసం తెడ్డుకూడచేయలేదు. అల్లు దొంగలంజకొడుకులు. గా లంజకొడుల కోసం స్థూపం గట్టిత్తార్రా....

సర్కిల్ ఈమాటలు అంటుంటే గురువయ్య గుండె తూట్లుపడుతుంది. తన పెయ్యిమీది దెబ్బలమంట బాధ అనిపించడంలేదు. కాని తమనాయకుడైన దేవన్నను మిగతా అమరవీరులను లంజకొడుకులూ అంటుంటే పెయ్యంతా మండుతుంది ఆ మాటలు వింటుంటే సర్కిల్‌గాన్ని ముక్కలూ ముక్కలు చెయ్యాలన్నకోపం వస్తుంది సర్కిల్ మాట్లాడేమాటలకు గురువయ్య కండ్లు ఎరుపెక్కినయి ఆ ఎరుపెక్కిన కండ్లల్లో ఒక్కసారి దేవన్న పోరాటం మెదిలింది.

దేవన్న స్వార్థంలేని మనిషి. పేదలకోసం తన సుఖాలను వదులుకొని కష్టాలు కోరుకొని పట్నంలో చదివినోడు పల్లెలకువచ్చి తరతరాలనుండి భూస్వాములకాల్లకాడ దినదినం గండంగా బతుకులు వెల్లదీస్తున్న పేదోల్లను విముక్తి చేయడంకోసం పల్లెల్లో సంఘాలు బెట్టిండు. సంఘాలలో రైతుకూలీలను సింహాలుగా జేసిండు. పోస లాంటోళ్ళను బాకులుగా జేసిండు. భూస్వాములు తిన్నలంచాలు కక్కించిండు, వెట్టినిరద్దుజేసి దున్నేవానికే భూమిచెందాలి. అంటూ దొరలు దొంగరాతలురాసి కాగితాల్లోదాచిన భూములను పేదోల్లతో పలుగుపార ఎత్తించి నాగండ్లకు ఎర్రజెండాలు కట్టి ఆక్రమించి భూమిలేని పేదోళ్ళకు సమానంగా పంచిండు. గంతేకాదు గెట్టుకాడ చెట్టుకాడ కొట్లాటలు పెట్టించి కులాలనడుమ కొంతీలు పెట్టించి పంచాయతీలపేర వేలకువేలు లంచాలుతీసుకునే పెద్దమనుషులను నడ్డివిరుగదన్ని ప్రజాసమస్యలు ప్రజలే పరిష్కరించుకోవాలి అని ప్రజాకోర్టులు పెట్టించి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపెట్టి ప్రజలకు మార్గం చూపెట్టిండు. కూలోల్లుపోసిన గంజితాగుతు వాళ్ళకు రాజకీయాలు చెప్పుతు వాళ్లతో సమ్మెలుచేయించి కూలిరేట్లుపెంచిండు. పగలురేయి అనకుండా చెట్లుగుట్టలు చెలుకలు అనకుండా పల్లెపల్లెతిరిగుతూ పోరాటాలు చేయిస్తూ

ఎర్రెర్రని బాటలువేసిండు. గట్ల పోరాటాలు జేస్తున్న సమయంలోనే దేవన్న ఈ పల్లెలో స్థూపం కట్టిచ్చిండు.

ఆనాడు అమరవీరుల పేర కట్టించిన స్థూపావిష్కరణకు అక్కడజరిగే సభకు ఎక్కడెక్కో పట్నంలోఉండే మేధావులను పిలిపించిండు. ఊరుఊరంతా ఎర్రికాంతులు పులుముకొన్నది ఊరంతా ఇసుకపోస్తే రాలనిజనం. ఎక్కడచూసినా ఎర్రిజండా జిందాబాద్. విప్లవం వర్ధిల్లాలి. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం. నూతన ప్రిజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాలు ఆకాశం, భూమి అదిరిపోయేటట్లు మారుమోగినయి. ఈ మీటింగును భగ్నంచెయ్యాలని వచ్చిన పోలీసులకు పచ్చి మంచినీళ్లుకూడా పోయలేదు. గురువన్నతో దేవన్నఅన్నడు. "చూసినావా గురువయ్య ఈ జనమంత ఎందుకువచ్చిండ్లు. మనలాంటిపేదోళ్లే. భూమికోసం భుక్తికోసం మనదేశవిముక్తికోసం మన ఎర్రిజెండాకింద పోరాడుతునోళ్లల్లే, ఈ దేశంలో నూటికి తొంబైమందిమి పేదోళ్లమే ఉన్నం. పదిమందే ఉన్నోళ్లు ఉన్నరు. గీ తొంబైమంది ముందుగ పదిమంది దొరలు వాళ్ళసర్కారు నాశనంకాకతప్పదు. విజయం మనదే. ఎన్నికష్టాలైన ఎర్రిజెండానేగెలుస్తుంది. అంతిమ విజయం మనదే" అన్న దేవన్న చెప్పిన మాటలు చేసిన పోరాటం జ్ఞాపకంవచ్చిన గురవన్న అనుకుండు "గింతకష్టపడి పోరాడి ప్రిజలకోసం పోరాడి అమరులైన అన్నలు దొంగలా?! గీ దొరలమోచేతి కింద నీల్లుతాగి బతికెటోడు దొంగలకాపాడే సర్కారు మూతిపొంటి అడిపిపోయే సొల్లునాకి బతికెటోడు కంకిపారేసిన అట్టి బొక్కలకు ఆశపడే లంజకొడుకు గీ సర్కిల్‌గాడు అన్నలను దొంగలు అంటే దొంగలైతరా?! కాదు వాళ్లు అమరవీరులు ఆకాశంలో మెరిసే అరుణతారలు గీసర్కిల్ వీళ్ళను పోషించేసర్కారు వీల్లేదొంగలు లంగలు కాదు లఫంగులు". "అరేయ్" అని సర్కిల్ పిలువగానే గురువన్న ఆలోచనలనుండి తేరుకొని ఏందిసార్ అన్నడు.

సర్కిల్ "ఏరా మాకెలవుడె నేను మాట్లాడేది వినకుండా ఏదో ఆలోచనలో పడ్డావ్" అని కసురుకుండు.

గురువయ్య "లేదు....సా....రే నేను ఏది ఆలోచించటం లేదు" అన్నాడు వణుకుతూ.

"అరేయ్ స్థూపాన్ని కూలగొట్టు" "అయ్యా నాతోటికాదు నన్ను జంపినా మంచిదే నేను మాత్రిం కూలగొట్టను" గురువయ్య సమాధానం.

"ఎట్ల కూలగొట్టవో నేనుజూత్త నీకుగూడా నక్సలైట్లు జెప్పింది బుర్రనిండా ఉన్నట్టుఉన్నాది చర్మంవొలిచేస్తెగాని గప్పుడు కూలగొట్టవు" అని సర్కిల్ పోలీసులకు తన్నమని ఆర్డర్ ఇయ్యంగనే పోలీసులు గురువయ్యను మిగతా రైతుకూలీలను తుపాకులు మర్లేసి కొట్టసాగిండ్లు ఆవిధంగా చిత్రహింసలుపెడుతూ పోలీసులే స్వయంగా గడ్డపారలు తీసుకొని అమరవీరుల స్థూపాన్ని తెల్లారేసరికల్లా నేలమట్టం జేసిండ్లు తెల్లారినంత గురువయ్యకు మొకమంతా మసి బూసి సర్కిల్ "నాజీబుకు దండంబెట్టు"మంటు కొట్టిండు గురువయ్య అదేవిధంగ చేసిండు. అక్కడినుండి గురువయ్యను కొట్టుకుంటు పోలీసులు ఊరేగింపుతీస్తూ "రాడికల్స్ నశించాలి" అని నినాదాలిస్తూ ఊరంతా తిరిగిండ్లు పోలీసులు చేస్తున్న చర్యలకు ఊరుఊరంతా ఉడికి పోయిండ్లు అన్నిటికన్నా స్థూపాన్ని కూల్చివేయడం అందరిని కలవరపెట్టింది.

ఆరోజు ఎవరిఇండ్లల్లో పొయ్యిరాజుకోలేదు. పొయ్యిమీద కుండలు ఎక్కలేదు. ఏడ్చి ఏడ్చి కండ్లల్లో నీళ్లు ఇంకిపోయినయి దీనంతటికి కారణం ఎవరు ఎవరు మనసులలో సంఘర్షణలు మొదలయ్యాయి ఏది ఏమైనా ఈ లొల్లికికారకులెవ్వరో వాన్ని దొరికిచ్చుకోవాలి ఇలా ఆలోచిస్తూ వాళ్ళ అంతం చూపెటందుకు పిడికిల్లు బిగించిండ్లు

ఆనాటి రాత్రి తూర్పు బోడగుట్ట దుబ్బల్లకు రమ్మని ఆపల్లెలోని ప్రజలకు పిలుపువచ్చింది. పోలీసులు చేసిన రాక్షసకాండకు తల్లడిల్లిపోతున్న ప్రజలకు అన్నల పిలుపు కొండంతబలమునిచ్చింది. అందరూ అన్నలు రమ్మన్నచోటుకుపోయి అన్నల రాకకు ఎదిరిచూస్తూ కూర్చున్నరు ఇంతలో అన్నలు వచ్చిండ్లు అన్నలనుచూసి అందరూ లాల్‌సలామ్ చెప్పిండ్లు. దానికి బదులుగా పిడికిలెత్తి అన్నలు లాల్‌సలామ్ చెప్పిండ్లు ఊళ్ళో జరిగిన సంగతులు అన్నలకు చెప్పిండ్లు అదివిన్న అన్నలు ఇలా చెప్పసాగిండ్లు.

"కామ్రేడ్స్ ఈలొల్లికి కారణం ఎవరోకాదు ఇన్ని సంవత్సరాల నుండి ఈ గ్రామంపై తిరుగులేని పెత్తనం సాగించిన దొరే దీనికి కారణం మన ప్రజలబలాన్ని చూసి లొంగినట్టు నటించిన దొర పుట్టలోనుండివెల్లి పడగవిప్పిన నాగుపాములె పోలీసులగలిసి నమ్మించి మనల దెబ్బగొట్టిండు ఇది దోపిడిదారులుచేసేపనే దీనికి మనం ఆశ్చర్యపడవలసిన పనిలేదు దోపిడిదారులు తమ వర్గాన్ని కాపాడుకోవడం కోసం ఎప్పుడూ ప్రియత్నంచేస్తునే ఉంటారు. అదేవిధంగా మనం పేదోల్లం మన వర్గండాగుపడడంకోసం మనం ప్రియత్నం చేస్తాం అంటే ఒక వర్గాన్ని ఇంకోవర్గం కూలదోయడానికే ప్రియత్నంచేస్తుంది. ఇవ్వాల్ల మన గామ్రంలో పోలీసులను తీసుక

వచ్చి ఆస్తులను ధ్వంసం చేయించిండు మీవీపులు పగలగొట్టించిండు. అన్నిటికన్న మిన్న మన అమరవీరుల స్థూపాన్ని కూలగొట్టించిండు దీనికి సమాధానం ఒక్కటే దీనికి కారకుడైన దొరకు వానికాపలి సర్కారుకు మనం గోరికట్టాలి దీనికోసం మీరంతా పిడికిలెత్తాలి" అని పిలుపునిస్తూ అందరికి మనసులో కెక్కేటట్లు దొరకుట్రలు అర్థమయ్యేటట్లుగా చెప్పిండ్లు.

మరునాడు దొరకు చాకలి మంగలి పాలేర్లు బందుపెట్టించిండ్లు దొర పట్నం పరుగెత్తిండు జనం ఎర్రజండాలుఎత్తి పిడికిల్లుబిగించి ఊరేగింపు తియ్యసాగిండ్లు "ఎర్రజెండా జిందాబాద్ అమరవీరులకు జోహార్లు రక్తాన్నైనా చిందిస్తాం అమరవీరుల స్థూపాన్ని నిర్మిస్తాం" అని నినదించుకుంటు 'ఎర్రజెండెర్రజెండెన్నియలో....' అని పాడుకుంటూ జనం పిడికిళ్లెత్తి పాడుకుంటూ ఆవేశంతో ఊరేగింపు కదిలిపోసాగింది.

[కరీమ్‌నగర్ జిల్లా పెద్దపల్లి తాలూకా కుక్కలగూడూరులో 11-10-83 నాడు రాత్రి పోలీసులు దాడిచేసి అమరవీరుల స్థూపాన్ని కూలగొట్టి రకరకాల హింసలకు గురిచేసినా చలించక పోరాట పిడికిళ్లెత్తిన ప్రజాచైతన్యంతో ఉత్తేజం పొంది.]

వ్యాఖ్య అనవసరం :

ఒక ప్రాణాన్ని బలిగొన్న అగ్గిపెట్టె

వరంగల్, అక్టోబర్ 31 (న్యూస్‌టుడే) వరంగల్ సమీపంలోని బట్టుపల్లి గ్రామంలో నిన్నజరిగిన ఒకఅగ్గిపెట్టె తగాదాలో కత్తిపోట్లకుగురై ఎం. రవీందర్ అనేవ్యక్తి అక్కడికక్కడే మరణించగా మరో అయిదుగురువ్యక్తులకు తీవ్రంగా గాయాలుతగిలాయి.

మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోఉన్న బట్టుపల్లిగ్రామంలో వేల్పుల గుండయ్య అనేవ్యక్తి ఇనగాల రామచంద్రారెడ్డి అనేరైతును చుట్ట వెలిగించుకునేందుకు అగ్గి పెట్టెను అడిగాడు దీన్ని తప్పుగాభావించి రామచంద్రారెడ్డి కుమారుడు తిరుపతిరెడ్డి గుండయ్యను కొట్టినట్లు తెలిసింది. అగ్గిపెట్టె అడిగినంతమాత్రాన కొట్టడంతప్పని మారం రవీందర్, దువ్వా రాజిరెడ్డి మరికొందరు పంచాయితీ జరిపేందుకురాగా తిరుపతి రెడ్డి, జైపాల్‌రెడ్డి, భోపాల్‌రెడ్డి కత్తులతోఅడ్డుగా వచ్చినవారిని పొడవగా రవీందర్ అనేవ్యక్తి మరణించగా గాయపడిన మరో అయిదుగురువ్యక్తులను వరంగల్ ఎం. జి. ఎం. ఆస్పత్రిలో పోలీసులు చేర్పించారు......................

(ఈనాడు - 1 నవంబర్ '83)

బట్టుపల్లిలో కత్తిపోట్లు
ఒకరిమృతి 5 మందికి గాయాలు

వరంగల్ అక్టోబర్ 30 బట్టుపల్లిలో కత్తిపోటుకుగురై నేడు ఒకరు మరణించారు. అయిదుగురికి కత్తిపోట్లు గాయాలుతగిలాయి. గాయపడిన వారిని ఎం.జి.ఎం. ఆసుపత్రిలో చేర్చారు.

శ్రీ మారం రవీందర్ అలియాస్ రవి కత్తిపోట్లకుగురై చనిపోయాడని పోలీసు సూపరింటెండెంట్ శ్రీ రామావతార్ యాదవ్ తెలిపారు.

ఈనెల 28వ తేదీన శ్రీ తిరుపతిరెడ్డి వేల్పుల గుండయ్య అనేవ్యక్తిని పొలంలో కొట్టాడన్న ఆరోపణపై నేటి ఉదయం శ్రీ దువ్వా రాజిరెడ్డి శ్రీ మారం రవీందర్ సుమారు 20 మంది రాడికల్స్ శ్రీ ఇ. రామచంద్రారెడ్డి ఆయన ముగ్గురు కుమారుల పై పంచాయతి జరిపారని శ్రీ యాదవ్ తెలిపారు.

పంచాయతి జరుగుతుండగా వాదోపవాదాలు చెలరేగడంతో మారం రవీందర్ మరికొంతమంది రాడికల్స్ కత్తులుతీసి శ్రీ జైపాల్ రెడ్డి, శ్రీ తిరుపతిరెడ్డిలను పొడవ ప్రయత్నించారని ఎస్. పి. తెలిపారు. జైపాల్ రెడ్డికి వీపు వెనకభాగాన- అరచేతికి గాయాలయ్యాయని చెప్పారు.

అయితే ఈ ఘర్షణలో ఆత్మరక్షణార్థం జైపాల్ రెడ్డి, తిరుపతిరెడ్డి పొడవ వచ్చినవారి చేతులనుండి కత్తులులాక్కొని పొడిచి పారిపోయి ఒకఇంట్లో తలదాచుకున్నారని ఎస్. పి. చెప్పారు. ముగ్గురు అన్నదమ్ములను హత్యచేసేందుకు రాడికల్స్ ఆ ఇంటిపైదాడిచేసారని- ఇంటికప్పు పీకివేసారని రాళ్ళు బళ్ళాలు గొడ్డళ్లు మొదలైన వాటితో తలుపులను పగులగొట్టారని చెప్పారు లోపలఉన్న జైపాల్ రెడ్డి, తిరుపతి రెడ్డి బయటవారినెవ్వరిని లోపలికిరాకుండా అడ్డుకున్నారని తెలిపారు.

ఈ సంగతితెలిసిన పోలీసులు ఆ గ్రామానికి వెళ్లారని- పోలీసులను చూడగానే రాడికల్స్ పారిపోయారని శ్రీ యాదవ్ తెలిపారు.

ఘర్షణలో కత్తిపోటుతగిలి శ్రీ మారం రవీందర్ చనిపోయాడని గాయపడిన అయిదుగుర్ని ఎం.జి.ఎం. ఆసుపత్రిలో చేర్పించినట్లు ఆయన చెప్పారు. కేసు నమోదు చేసారు. ఎస్.డి.పి.వో (వరంగల్ రూరల్) శ్రీ ఎస్. ఉమాపతి పర్యవేక్షణలో దర్యాప్తు జరుగుతున్నది. గ్రామంలో పోలీసుబలగాన్ని ఏర్పాటుచేసారు. నేరస్తులను పట్టుకునేందుకు గాలింపు జరుగుతున్నది.

(వరంగల్ వాణి - 31 అక్టోబర్ '83)

రిపోర్టు :

అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి ప్రథమ మహాసభలు

మన సామ్రాజ్ఞి ఎలిజబెత్ రాణీ వచ్చింది. ఆమె సామ్రాజ్యం కామన్‌వెల్త్ సభలు జరపడానికి, ఆ సభలకు వచ్చేవాళ్ళ హాలీడేకోసం కోట్లరూపాయలు ఖర్చు పెడుతున్నాం. ఆమె మూడు నిముషాలు నడపడానికి మూడులక్షలు ఖర్చుపెట్టాం. (ప్రజలకోసంనడిచే రైలు, రోడ్డుదారులు తుఫానువల్ల తెగిపోతే బాగుచేయడానికి ఇంకా మనకుతీరలేదు) నిజాంరాజ్యంలోని (బ్రిటిష్ సామ్రాజ్యానికి నమ్మిన సంస్థానబంటు) ఒక పల్లెటూరు చూడాలనుకున్నది ఆమె. రాణీగారి ప్రసన్నదృష్టికి దేవరవారి యామిజాలనోచుకున్నది. ఆమె పెళ్ళిరోజు వేడుకలు హైదరాబాదులో జరుపుతుంటే ఢిల్లీ నుంచి విమానంలో బహుమానంగా కేక్‌వచ్చింది. కేక్‌కోసం కూడకాదు బ్రెడ్‌కోసం మాత్రమే పోరాడుతున్న తెలుగుదేశంలోని ప్రజలకోసం మాత్రం ఢిల్లీ నుంచి సిఆర్పీని పిలిపిస్తుంది తెలుగుదేశం ప్రభుత్వం.

ఈస్టిండియా కంపెనీ కాలంనుంచి, ఈ ఎలిజబెత్‌రాణీ రాక సన్నాహాలవరకు సామ్రాజ్యవాదం ఏఏటోపీలు మార్చుకొని ఈ దేశాన్ని దోచుకుంటున్నదో, ఎవరెవరికి టోపీలుపెట్టి ఈ దేశాన్ని కొల్లగొడుతున్నదో ఢిల్లీలో అక్టోబర్ 14, 15 తేదీల్లో జరిగిన అఖిలభారత సాంస్కృతిక సమితి ప్రథమ మహాసభల్లో గోవానుంచి వచ్చిన సంఘర్ష్‌నాట్యమంచ్ ప్రదర్శించింది.

సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా దేశవ్యాప్తమైన నూతన ప్రజాస్వామిక సాంస్కృతిక విప్లవాన్ని భారతరైతాంగపోరాటంలో భాగంగా నిర్మించ సంకల్పించిన ఎఐఎల్ఆర్‌సి ఎర్రకోటకు కూతపెట్టుదూరంలో ఢిల్లీ పోలీసు కమిషనర్ కార్యాలయానికి రైఫిల్ రేంజిలో- శ్రీశ్రీనగర్‌లోని సరోజ్‌దత్తాహాల్‌లో తన రెండురోజుల సభలు జరుపుకున్నది.

పన్నెండుసంవత్సరాల స్వప్నం, రెండుసంవత్సరాల కృషిఫలితంగా మార్చి 30న కలకత్తాలో నాలుగురాష్ట్రాల ఐదు సాంస్కృతికసంస్థలతో ఏర్పడిన ఎఐఎల్ ఆర్‌సి అక్టోబర్‌నాటికి మరోమూడు సాంస్కృతిక సంస్థలను తనతో కలుపుకొని ఢిల్లీలో ఈ ప్రథమ మహాసభలు జరుపుకున్నది.

కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి కమ్యూన్‌లోబసచేసిన దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన సాంస్కృతిక కార్యకర్తలు భారతవిప్లవంలోని వైవిధ్యాల

లోని ఏకత్వాన్ని ప్రదర్శిస్తూ, పాడుతూ, నినాదాలిస్తూ శ్రీశ్రీనగర్‌కు అక్టోబర్ 14 ఉదయం 9 గంటలకు చేరుకోగానే కన్వీనింగ్‌కమిటీ కన్వీనర్ కా॥ కెవిఆర్ తొలిపలుకులు పలికి సుత్తీకొడవలి జెండాను ఎగురవేయడానికి కా. పరేశ్‌ధర్‌ను ఆహ్వానించాడు. కా. పరేశ్‌ధర్ ఇప్టా (Indian Peoples Theatre & Arts) కాలం నుంచికూడ ప్రజల సంస్కృతికోసం కృషిచేస్తున్న కళాకారుడు. పతాకావిష్కరణ తర్వాత బెంగాలీ సాంస్కృతికబృందం 'కష్టజీవులం మేం కమ్యూనిస్టులం' అనే పాటను బెంగాలీ తెలుగుచరణాలు కలుపుతూ, అక్కడక్కడా ఇంగ్లీషు హిందీ చరణాలు కూడ జోడిస్తూ ఉత్తేజకరంగా పాడారు. ఆంధ్రప్రదేశ్ జననాట్యమండలి 'ఎర్రజెండెర్రజెండెన్నియలో' పాటను శ్రోతలహృదయాల్లోకి 'ఎర్రనివెన్నెల'లా ప్రసరించింది.

కామ్రేడ్ చెరబండరాజు సహచారిణి శ్యామల మృతవీరుల స్థూపంపై ఎర్రజెండా పరచింది. మృతవీరులను స్మరించే గీతాలను జననాట్యమండలి, బెంగాలీ సాంస్కృతిక బృందం, తమిళనాడు పీపుల్స్‌ఆర్ట్‌ఫోరమ్ గానంచేసాయి.

విప్లవ నినాదాలతో మార్మోగిన ప్యారేలాల్ గాంధీ స్మారకభవన ఆవరణలోకి ఢిల్లీ ఆకాశం వింతగా తొంగిచూసింది.

సమావేశ స్థలంలోకి ప్రవేశిస్తుంటే సుప్రసిద్ధ బెంగాలీ చిత్రకారుడు కామ్రేడ్ చిత్తప్రసాద్ సంస్మరణలో ఏర్పాటుచేసిన చిత్రప్రదర్శనలో నక్సల్బరీ, శ్రీకాకుళం మొదలుకొని ఆదిలాబాదు కరీంనగర్‌ల దాకా రైతాంగ పోరాటాలను చిత్రించే దృశ్యాలు, తెలుగుపోరాట సంస్కృతీ సమీక్ష, విరసం చరిత్ర, విప్లవ కవితలు, ప్రభుత్వం నిషేధించిన సాహిత్యం వివరాలు, వలసవిధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశదేశాల ప్రజలుచేస్తున్న పోరాట దృశ్యాలు- తలతిప్పుకోలేనంత వాతావరణం, పాటల, చిత్రాల మెట్లమీదుగావెళ్తే సర్వేశ్వర్ దయాల్‌సక్సేనా పుస్తక ప్రదర్శనశాలలో వివిధ భాషల్లో వెలువడిన విప్లవసాహిత్యం- భౌతికశక్తిగామారిన, మారుతున్న భావాలు.

సరోజ్‌దత్తాహాల్‌లో జననాట్యమండలి 'సుత్తీ-కొడవలి గుర్తుగవున్న ఎర్రని జెండా ఎగురుతున్నది' పాటతో ప్రారంభసమావేశం మొదలైంది. ఆహ్వానసంఘం తరఫున కార్యదర్శి కా. టంకశాల అశోక్ సభికులకు ఆహ్వానం చెప్పాడు. వేదిక పైకి కా. కెవిఆర్, సభను ప్రారంభించవలసిన కా. గురుశరణ్‌సింగ్ ఆహ్వానింప

బడ్డారు. అశోక్ ఆహ్వానసంఘం నివేదికను చదివాడు. ఆహ్వానసంఘం అధ్యక్షుడుగావుండి సభలకు కొద్దిరోజులు ముందుగా మరణించిన సుప్రసిద్ధ హిందీరచయిత సర్వేశ్వర్ దయాల్‌సక్సేనా గురించి కా. గోరఖ్‌పాండే ప్రసంగ వ్యాసంచదివాడు.

ఇప్టా ఉద్యమం మొదలుకొని ఈనాటివరకు పంజాబ్‌లో ప్రజాసంస్కృతీ కళారంగాల్లో పనిచేస్తున్న కా. గురుశరణ్‌సింగ్‌ను సభకు పరిచయంచేస్తూ ప్రారంభోపన్యాసం ఇవ్వాల్సిందిగా కా. కెవిఆర్ ఆహ్వానించాడు.

తన గంభీరమైన, సుదీర్ఘమైన, భావాలను రూపుగట్టిన ప్రసంగంలో కా. గురుశరణ్‌సింగ్ అణగారిన ప్రజలసంస్కృతిని నక్సల్బరీవెలుగులో మళ్ళీ ఎట్లానిలబెట్టుకోవాలి, ఆ కృషిలో స్త్రీలు నిర్వహించేపాత్ర, ప్రజల సంస్కృతి సుడికారం ఏదైవుండాలి- అనేఅంశాలను వివరించాడు.

ఆవాన్‌నాట్యమంచ్ (మహారాష్ట్ర) పాటతర్వాత కెవిఆర్ సభకు సంఘీభావం ప్రకటిస్తూవచ్చిన సందేశాలను వినిపించాడు. దేశవ్యాప్తంగా నూతన ప్రజాస్వామ్య సంస్కృతికోసం కృషిచేస్తున్నవాళ్ళు, ప్రజాస్వామ్య, పౌరహక్కుల ఉద్యమంలోని కార్యకర్తలు, ప్రెస్‌కార్మికులు, జైళ్ళలోని రాజకీయఖైదీలు - సందేశాలుపంపిన వాళ్ళలోవున్నారు.

సభలసందర్భంగా వెలువడిన ఎ ఐ ఎల్ ఆర్ సి సావనీర్‌ను గురుశరణ్‌సింగ్ ఆవిష్కరించాడు. బెంగాలీకళాకారుల డ్రాయింగ్స్‌ను, కా కంచనకుమార్, విరసం కవితాసంకలనం Raging Storm ను గోరఖ్‌పాండే, శ్రీశ్రీ కవితలు New Fron. ters, 'శ్రీశ్రీ చిరునామా'లను కా. శివమంగళ్ సిద్ధాంత్‌కర్, చెరబండరాజు కవితలు Sword Song ను షంసుల్‌ఇస్లాం, గంజినీళ్ళు - చెరబండరాజు ఏకాంకికను కా. ఎంటిఖాన్, మరాఠీలోకి అనువదింపబడిన చెరబండరాజు కవితల సంకలనాన్ని కా. మేనేజర్‌పాండే, జననాట్యమండలి పరిచయపత్రాన్ని (ఇంగ్లీషులో) కా. కాకరాల ఆవిష్కరించారు.

మధ్యాహ్నం జరిగిన రెండవసమావేశంలో కా. కెవిఆర్ ఎ ఐ ఎల్ ఆర్ సి మానిఫెస్టోను ప్రవేశపెట్టాడు. ముందుగా కా. అశ్విన్‌టంబాట్ (ఆవాన్ నాట్యమంచ్) విషయాన్ని పరిచయం చేసాడు. మానిఫెస్టోచర్చకు వ్యవధితక్కువగానే వున్నప్పటికీ ప్రతినిధులు మాత్రమేకాకుండా సౌహార్ధప్రతినిధులనుంచి వచ్చిన ప్రశ్నలకు సందేహాలకు కా. కెవిఆర్ సమాధానాలు ఇచ్చినతర్వాత మానిఫెస్టో ఆమోదించబడింది.

ఆ సాయంత్రం నిశాంత్ నాట్యమంచ్ ఢిల్లీ 'గెడ్డా' ఆవాన్ నాట్యమంచ్, ఢిల్లీ 'సఫేద్ అప్పు' అనే వీధినాటికలను ప్రదర్శించి ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించాయి

రాత్రి హాలులో ఎ ఐ ఎల్ ఆర్ సిలో చేరిన వివిధ సాంస్కృతిక సంస్థలు తమ ప్రదర్శనల ద్వారా పరిచయం చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ జననాట్యమండలి, కర్నాటక జనకళామండలి, తమిళనాడు పీపుల్స్ ఆర్ట్‌ఫోరమ్, గోవా సంఘర్ష నాట్య మంచ్, బెంగాల్ విప్లవీలేఖక్ కళాకార్ బుద్ధిజీవీసంఘ్, బీహార్ నవజనవాదీ క్రాంతి కారీ సాంస్కృతిక సంఘటన్, మహారాష్ట్ర ఆవాన్ నాట్యమంచ్- ఆయాభాషల్లోని విప్లవగీతాలు ఆలపించారు. చెరబండరాజు 'కొండలు పగలేసినం' పాటపై 'జజ్జనకరి జనారే' పాటపై జననాట్యమండలి, సుకాంతభట్టాచార్య పాటపై బెంగాలీ సాంస్కృతిక బృందం నాట్యరూపకాలు ప్రదర్శించాయి.

అక్టోబర్ 15 ఉదయం 9.30 గంటలకు కామ్రేడ్ బాలన్ స్మృతిలో తమిళంలో, కా. పరిటాలస్మృతిలో తెలుగులో, కా, చెరబండరాజుపాటకు బెంగాలీ అనువాదం ఆలాపనతో సభప్రారంభమైంది. కా. ప్రశాంత ఛట్టోపాధ్యాయ అధ్యక్షతన 'ప్రస్తుత సాహిత్య, సాంస్కృతిక ధోరణులపై' వివిధ భాషాప్రతినిధులు ప్రసంగించారు.

బెంగాలీ సాహిత్యంపై కా, వీరేంద్రనాథ్ సుస్మాల్, తెలుగుసాహిత్యంపై కా. చలసానిప్రసాద్, పంజాబీ సాహిత్యంపై కా. గురుశరణ్‌సింగ్, కన్నడ సాహిత్యంపై కా. రామలింగం, తమిళ సాహిత్యంపై కా. గోవిందస్వామి, కొంకణి సాహిత్యంపై కా. శైలేంద్రమెహతా, గుజరాతీ సాహిత్యంపై కా. హిమ్మత్‌ఖజోరా, హిందీసాహిత్యంపై కా. గోరఖ్‌పాండే, మరాఠీ సాహిత్యంపై కా. శ్రీలేఖ ప్రసంగించారు. ప్రజాకళారూపాల గురించి కా. పరేష్‌ధర్ ప్రసంగించారు.

అన్నిభాషా సాహిత్యాల్లోనూ కళారూపాల్లోనూ నక్సల్బరీ నూతన ప్రజాస్వామిక స్వభావాన్ని ఆవిష్కరించిందని కా. ప్రశాంత్ తన అధ్యక్ష ప్రసంగంలో సమీక్షించాడు.

మధ్యాహ్నం సమావేశంలో ఆఫ్ఘన్ ప్రతిఘటనా ఉద్యమ ప్రతినిధి ఎ ఐ ఎల్ ఆర్‌సికి సంఘీభావం ప్రకటించాడు.

నూతన ప్రజాస్వామిక విప్లవం సాంస్కృతిక కర్తవ్యాలు అనే అంశంపై ప్రధానపత్రాన్ని విరసం సమర్పించింది. బెంగాలీ విప్లవీలేఖక్ కళాకార్ బుద్ధిజీవీ సంఘ్ సుంచికూడ ఒకప్రతినిధి పత్రించడివాడు. సభకు కా. కెవిఆర్ అధ్యక్షత వహించాడు.

సాయంత్రం సమావేశంలో కా. కెవిఆర్ ఎఐఎల్ఆర్‌సి ప్రణాళికను ప్రవేశ పెట్టాడు. కా. అశ్విన్, కా. అరుణ్ సన్యమత్, కా. కెవిఆర్ స్టీరింగ్‌కమిటీగా వ్యవహరించారు. కొన్ని సవరణలతో ప్రణాళిక ఆమోదించబడింది. ఆ తర్వాత కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో ప్రధానకార్యదర్శిగా కా. కెవిఆర్, సహకార్యదర్శు లుగా కా. ప్రశాంతోఛటర్జీ కా. అశ్విన్‌టంచాట్ కోశాధికారిగా కా సిఎస్ఆర్ ప్రసాద్ ఎన్నికయ్యారు. మరి 12 మంది ఆయా సంస్థల తరపున కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు.

ఎ ఐ ఎల్ ఆర్ సి త్రైమాసిక పత్రిక SPARK కు కా. టంకశాల అశోక్ (ప్రధాన సంపాదకుడు) అరుణ్ సన్యమత్ (సభ్యుడు) ప్రధాన కార్యదర్శి (ఎక్స్ అఫీషియో సభ్యుడు) సంపాదకవర్గంగా ఎన్నికయ్యారు.

ఆ సాయంత్రం జరిగిన బహిరంగసభలో కా. కెవిఆర్ ఎఐఎల్ఆర్‌సి కార్య వర్గాన్ని పరిచయంచేసి, తీర్మానాలు వివరించాడు. దేశవ్యాప్తంగా నిర్వహించబడు తున్న విప్లవోద్యమాలపై, విప్లవ సంస్కృతిపై ప్రభుత్వం, పాలకవర్గాలు అమలు చేస్తున్న దమనకాండ గురించి ఈ సభ ఆందోళనను వ్యక్తంచేసింది. రైతాంగ పోరాటాలకు, ప్రజాస్వామిక, పౌరహక్కుల ఉద్యమాలకు మద్దత్తు ప్రకటించింది. శ్రీశ్రీ, సర్వేశ్వర్ దయాల్‌సక్సేనా మృతికి సంతాపం ప్రకటించింది. ఆయారాష్ట్రా లలోని వర్తమాన ఉద్యమాలపై వివిధ తీర్మానాలు చేసింది.

ఆ తర్వాత జరిగిన సాంస్కృతిక ప్రదర్శనాలను క్రిక్కిరిసిన జనం ఎంతో ఉత్సాహపూరితంగా, ఆసక్తిగా చూసారు. అస్సాం పోరాటంపై పిఎఫ్ (తమిళ నాడు) ఒక నాట్యరూపాన్ని ప్రదర్శించాయి. అలాగే పిఎఫ్ బాలలు మరొక నాట్య రూపాన్నిప్రదర్శించారు. సంఘర్ష్ నాట్యమంచ్ కొంకణిలో నాటికను ప్రదర్శించింది. జననాట్య మండలి 'రగల్‌జెండా' బ్యాలేను ప్రదర్శించింది. ఇతర సాంస్కృతిక సంస్థలు విప్లవగీతాలు ఆలపించాయి. ఈ సభల్లో AILRC లోని ఎనిమిది సంస్థల ప్రతినిధులే కాకుండా జనకీయసంస్కృతికవేది (CCPCF), నవజనవాదీ సాంస్కృ

ధనిక రైతాంగ వాదం

బ్యారీపావియర్ పుస్తకంపై బాలగోపాల్ సమీక్షా వ్యాసం (సృజన, నవంబర్, 1982)లో రెండు అంశాలున్నాయి. మొదటిది ధనిక రైతాంగ వాదంపై విమర్శ, రెండవది ఆవాదం ఆధారంగా 'ఐక్యసంఘటనా వ్యూహం'పై పావియర్ చేసినదాడికి ప్రతివిమర్శ. పావియర్ లాంటి అకడమిక్ మేధావులు సృజన లాంటి పత్రికలో అంతసుదీర్ఘమయిన విమర్శకు అర్హులేనా అన్నవిషయం పక్కనపెట్టి ఈ విమర్శను పరిశీలిద్దాం.

పావియర్ సిద్ధాంతం ప్రకారం తెలంగాణా ఉద్యమంలో ప్రధాన వైరుధ్యం ధనికరైతులకి, దేశ్‌ముఖ్‌లకి ఉన్న వైరుధ్యం. ఆ వైరుధ్యానికి ప్రాతిపదిక i) ప్రభుత్వం ఇచ్చే ఋణసహాయాన్ని ఇతర సౌకర్యాల్ని దేశముఖ్‌లే పూర్తిగా అనుభ

తిక సంఘటన్ (ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్), క్రాంతికారీ సాహిత్య సభ (పంజాబ్, కాశ్మీర్), పంజాబ్‌లోక్ సభ్యాచార్ సమితి, జనకళా సాహిత్యమంచ్ (రాజస్థాన్) మొదలైన సోదర సాంస్కృతిక సంస్థల తరపున సోహార్ద్ర ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ప్రజాదృక్పథంతో శాస్త్రవిజ్ఞానరంగంలో కృషిచేస్తున్న వ్యక్తులు సంస్థలు ముఖ్యంగా ఢిల్లి, మధ్యప్రదేశ్‌ల నుంచి హాజరైనారు. పలురాష్ట్రాల పౌర హక్కుల, ప్రజాస్వామిక హక్కుల బాధ్యులుకూడా పరిశీలకులుగా వచ్చారు.

ఈ సభలకు ముందు వారంరోజులు, తర్వాత మూడు రోజులుకూడ ఢిల్లీలో వివిధప్రాంతాల్లో కార్మికవాడల్లో, మిల్లులదగ్గర జననాట్యమండలి, ఆవాన్‌నాట్యమంచ్ (మహారాష్ట్ర) ఇచ్చిన ప్రదర్శనలు కూడ ఢిల్లీ ప్రజల ముందు పాలకవర్గాల సంస్కృతికి ప్రజల సంస్కృతికీ మధ్యనున్న గుణాత్మకమైన మార్పును గిరిగీచి చూపాయి. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆహ్వానంపై అక్టోబర్ 18న ఎఐఎల్ఆర్‌సి తరపున ఏర్పాటు చేయబడిన 'జననాట్యమండలి' ప్రదర్శనలు ఈ సాంస్కృతిక కార్యక్రమాలకు పరాకాష్ఠగా అందరూ చెప్పుకున్నారు.

అఖిలభారత విప్లవ సంస్కృతీ నిర్మాణంలో ఎఐఎల్ఆర్‌సి ప్రథమ మహాసభలు నిస్సందేహంగా ఒక ముందడుగు. దృఢమైన ముందడుగు. నడవాల్సిన నూతన ప్రజాస్వామిక విప్లవపథం సాంస్కృతిక రంగాలలోనూ ముళ్ళతో, కడగళ్ళతో కూడివున్నది. కాని ఉజ్వలభవిష్యత్తు కనిపిస్తున్నది.

వించడం ii) ధనిక రైతులకి అవకాశం ఇవ్వకుండా పెరుగుతున్న సాగులోఉన్న భూమిని దేశ్‌ముఖ్‌లే తమ ఆధీనంలో ఉంచుకోవడం. అంతేకాదు, పావియర్ సిద్ధాంతానికి కీలకమయిన ఈ రెండు అంశాలు అప్పటి భూస్వామ్య ఆస్తిసంబంధాలలోనూ భాగంకాదు, వాటిలోవస్తున్న మార్పులలోనూ భాగంకాదు. వాటికతీతంగా పెట్టుబడి తన ప్రవేశంద్వారా ప్రవేశపెట్టిన వైరుధ్యాలివి. ఆరకంగాచూస్తే దేశముఖ్‌లకు - ధనికరైతులకు మధ్య పావియర్ సూచించిన వైరుధ్యాల పునాది వాస్తవం కాదు, potential (notreal but potential) మాత్రమే. అయితే తెలంగాణా పోరాటంలో ఏ దశలోకూడా ప్రభుత్వ ఋణసహాయం, ఇతర సౌకర్యాల పంపిణీ గురించి, ఆంధ్రమహాసభ డిమాండ్సచేసినట్టు ఆధారంలేదు. ధనిక రైతులు అదనంగా భూమికోసం డిమాండ్ చేసినట్టూలేదు నిజానికి బాలగోపాల్ చెప్పినట్టు ఉద్యమ డిమాండ్ భూపరిమితిమీద, అదనపు భూమిని పేదరైతులకి, వ్యవసాయ కూలీలకు పంపిణీ చెయ్యడం మీదే. పావియర్ వాదనలో మరోచిత్రమయిన విషయం ఒకటుంది. ఆయన సిద్ధాంతం ప్రకారం దేశ్‌ముఖ్‌లు ఉత్పత్తి క్రమంలో పాల్గొంటూ పెట్టుబడి తిరిగి ఉత్పత్తిలోపెడ్తూ, ఉత్పత్తిని పునర్‌సృష్టించారు. ఒక్కమాటలో చెప్పాలంటే దేశ్‌ముఖ్‌లు పుట్టుకతో భూస్వాములే అయినా తర్వాత కాలంలో పెట్టుబడిదారులుగామారిన వాళ్ళు. ఆ రకం పరిస్థితిలో అలాంటి లక్షణాలేఉన్న ధనిక రైతులకి, దేశ్‌ముఖ్‌లకి మధ్యఉన్న వైరుధ్యం "విభిన్న పెట్టుబడులమధ్య వైరుధ్యం" అవుతుంది. అది మార్క్స్ భాషలో "తనంతతానే సమసిపోయే వైరుధ్యం" (Self dissolving contradiction), అది ఏ ఉద్యమానికీ భౌతికపునాది కాలేదు. పావియర్ వాదన దానిదారికి దాన్ని వదిలేస్తే తనంతతానే సమసిపోతుంది.

అయితే పావియర్ఇచ్చిన సమాచారంమాత్రం పెట్టుబడి ప్రవేశించినతర్వాత భూస్వామ్య ఆర్థికవిధానంలో వచ్చేమార్పులని అర్థంచేసుకోవడానికి ఉపయోగపడకుండా పోదు. ఒక కర్మాగారాన్ని స్థాపించడమో, వ్యాపారపంటల్ని ప్రవేశపెట్టడమో ఒకవయిపు ధనికరైతాంగవర్గాన్ని సృష్టించడానికి తోడ్పడుతూనే మరొకవయిపు అంతకంటె ఎక్కువగా వ్యాపారాన్ని, వడ్డీవ్యాపారాన్ని ప్రోత్సహిస్తూ భూస్వామ్య దోపిడీని బలపరుస్తుంది. 30లనాటి 'మహాసంక్షోభం', రెండవ సామ్రాజ్యవాదయుద్ధం దశలలో తీసుకువచ్చినమార్పులు ఒకవయిపు పేదరైతులనుండి భూమిని కొల్లగొడ్తూనే రెండోవయిపు వ్యాపారస్తుల, వడ్డీవ్యాపారస్తుల ప్రయోజనాల్ని బలపర్చాయి. అంతేకాక ఈ వ్యాపారం దళారీసంస్కృతిని ప్రోత్సహించడంద్వారా, సామ్రాజ్య

వాద వస్తువుల్ని మార్కెట్‌లో ప్రవేశపెడ్తూ భూపరాయీకరణకు మరోఅంశాన్ని జోడించింది. భూస్వామ్యానికి అశేషప్రజానీకానికి ఈ రకంగా తీవ్రతరమయిన వైరుధ్యమే తెలంగాణా ఉద్యమానికి భౌతికపునాది. ఆ రకంగాచూస్తే ప్రధాన వైరుధ్యం, పావియర్ వాదించినట్టు ధనికరైతులకి దేశ్‌ముఖ్‌లకికాదు, బాలగోపాల్ చెప్పినట్టు, భూస్వామ్యానికి అశేష ప్రజానీకానికిమధ్యఉన్న వైరుధ్యమే. బాలగోపాల్ గమనించని విషయమల్లా కొత్తగాప్రవేశించిన పెట్టుబడి ఈ వైరుధ్యాన్ని తీవ్రతరం చేసిందన్న వాస్తవం.

ఈ సందర్భంలోనే మరోవిషయం చెప్పుకోవాలి. వ్యాపారపంటలు తక్కువ శాతం ఉండటం (వేరుసెనగ 9 శాతం, ఆముదం 4 శాతం) పావియర్‌కు సమాధానంకాలేదు. మొత్తం సంస్థానంలో వాటిశాతం తక్కువేఅయినా అవి పెరిగిన ప్రాంతాలలో, గ్రామాలలో వ్యాపారపంటలు గుణాత్మక మార్పులు తీసుకు రాకుండాపోవు. వ్యాపారపంటలు దేశ్‌ముఖ్‌లకి, ధనిక రైతులకి అదనపు లాభాలు చేకూరుస్తున్నప్పటికి అవి ఇంతతక్కువ శాతానికే ఎందుకు పరిమితమయ్యాయో ప్రత్యేకించిపరిశోధిస్తే ఉత్పత్తి సంబంధాలకి ఉత్పత్తిశక్తులకి మధ్య వైరుధ్యం మరింతగా అర్థమయ్యే అవకాశంఉంది, ఐక్యసంఘటనని అనివార్యంచేసే భూస్వామ్య సామ్రాజ్యవాద 'గతితార్కిక ఐక్యత' స్పష్టంఅవుతుంది. తెలంగాణా పోరాటంలో ఈ అంశంపై ఇంకా పరిశోధన చేయాల్సిఉంది.

బాలగోపాల్ ఉద్యమ నాయకత్వం గురించి ఇచ్చిన వివరణ చాలా వివాదాస్పదమయినది. వ్యావసాయిక విప్లవ పోరాటం తాత్కాలిక తిరుగుబాటుగా కాక దీర్ఘకాలిక లక్ష్యంతోనూ, చరిత్రాత్మక గమ్యంతోనూ, నడవాలంటే, ఉద్యమనాయకత్వానికి కొంత ప్రపంచజ్ఞానం, చరిత్రతో పరిచయం అవసరం అనిచెప్తూ భూస్వామ్యసమాజంలో భూస్వాములకీ, ధనికరైతులకూ మాత్రమే అవి ఉంటాయి కనుక నాయకత్వం వహించేవారు ఎక్కువగా ఈ వర్గాలనుండే వస్తారని ఆయన వివరణ.

ముందసలు 'ప్రపంచజ్ఞానం'కు, 'ప్రాపంచిక దృక్పథానికి' మధ్య తేడాను స్పష్టంగా గుర్తించాలి. అక్షరాస్యతవల్ల భూస్వామ్య ధనికరైతాంగవర్గాలకు ప్రపంచ పరిజ్ఞానం, చరిత్రతో పరిచయం మొదట్లో పేదవర్గాలకంటె ఎక్కువఉండే అవకాశం ఉంది. అయితే ఈ వాస్తవాన్ని ఆధారంచేసుకొని వ్యవసాయకూలీ పేదరైతువర్గాలు ఉద్యమక్రమంలో ఆ జ్ఞానం, పరిచయం అలవర్చుకుంటాయన్న విషయాన్ని మనం నిరాకరించలేం. (అసలు అక్షరాస్యత నాయకత్వానికి అవసరమేనాఅన్న విషయం కూడా ఇంకా తేలినట్టులేదు). ప్రపంచజ్ఞానం, చరిత్రతో పరిచయం పుస్తకాలతో వస్తుందేమోగాని, ప్రాపంచిక దృక్పథం ఏర్పడడానికి, దానికిగల చరిత్రతో పరిచయ

ముండడానికి కొంత భౌతికపునాది కావాలి. భౌతికపునాదిని ప్రతిఫలిస్తూవచ్చే చైతన్యమే వ్యవసాయకవిప్లవం తాత్కాలిక తిరుగుబాటుగాకాక దీర్ఘకాలిక లక్ష్యంతోనూ చరిత్రాత్మక గమ్యంతోనూ నడపడానికి తోడ్పడుతుంది. తమకున్న ప్రాథమిక సౌకర్యాలతో మొదటిదశలో భూస్వాములు ధనికరైతులు ఉద్యమనాయకత్వాన్ని తమ చేతిలోకి తీసుకోవచ్చుగాక, విప్లవోద్యమం విజయవంతంగా పూర్తికావాలంటే మాత్రం నాయకత్వం, విప్లవవర్గాల నుండి రావాలి, వస్తుంది. నిజానికి వారి వర్గ ప్రయోజనాల్ని గమనంలోకి తీసుకుంటే భూస్వాములు, ధనికరైతాంగ వర్గాలనుండి వచ్చినవారు ఏ ఉద్యమానికయినా సరిఅయిన నాయకత్వం ఇవ్వగలరా అనేది సందేహాస్పదమయిన విషయం. వారికి మాత్రమే ఆ శక్తి సామర్థ్యాలుంటాయన్న విషయం పక్కనపెడ్తాం.

పావియర్ ఇచ్చిన సమాచారం సరయినదయితే, దానిప్రల్ల మనకు తెలిసేది పెట్టుబడి ప్రవేశించింతరువాత మొదటి అంతర్జాతీయ సంక్షోభంసమయంలో ధరల తగ్గుదలవలన రైతులఅప్పు 89% వరకుపెరిగింది. ఆ సమయంలో కొందరురైతులు భూములు కోల్పోయుంటారు. తిరిగి రెండవ సామ్రాజ్యవాదయుద్ధం సమయంలో పెరిగిన ధరలవల్ల అప్పులు 120 శాతం పెరిగాయట. ఈ సమయంలో మరికొందరు భూములు కోల్పోయుండాలి. ఈ భూముల్ని కోల్పోయినవారిమీద కోల్పోతున్నవారి మీద భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీలప్రభావం స్పష్టమే. ఆ దోపిడికి గురి అయిన వర్గాలు కోరుకునే మరోప్రపంచం, దానికితోడయిన ప్రాపంచిక దృక్పథం వ్యవసాయవిప్లవానికి పునాదులు. వాళ్ళకి ప్రాపంచిక జ్ఞానంతక్కువేమోగాని, ప్రాపంచిక దృక్పథానికి కొదువలేదు. వాళ్ళకి ప్రపంచ చరిత్ర తెలియదేమోగాని, చరిత్రనిర్మాతలుగా వాళ్ళు వాళ్ళచరిత్రను మరిచిపోరు. (ఆదేసంచికలో వీరులజ్ఞాపకాలపేరుతో నాయకుల జ్ఞాపకాలను సమీక్షించిన కొమరయ్యగారి వ్యాసంలో బైరాన్‌పల్లి వృత్తాంతం ఈ విషయాన్ని బాగానొక్కిచెప్తుంది.)

మన వ్యవసాయ విప్లవంలో ఈ వర్గాలనుంచి నాయకులు రాలేకపోవడానికి కారణాలు వివరించవచ్చుగాని, నాయకులు రాలేరని సూత్రీకరించడం శాస్త్రీయమయిన సూత్రీకరణఅని తోచదు. చరిత్రనిర్మాతలువడిపే వ్యవసాయ విప్లవానికి భూస్వామ్య, ధనికరైతాంగ వర్గాల నాయకత్వం తప్పదనుకుంటే కొండపల్లి సీతారామయ్యగారి భోగట్టా- "ఆ రోజుల్లో 20 మంది పార్టీలోకొస్తే 19 మంది రెడ్డిప్రభువులే" నని (క్రాంతి, జూన్ 15, 1979 పేజి 4) దాని అనివార్యత గురించి వాపోవడంమినహా మనకింకేకార్యక్రమం లేదనుకోవాలి.

— సోమేశ్వరరావు

సృజన ఎవరి పత్రిక ? !

1

మేము భట్టుపల్లి రాడికల్ యువజనసంఘం సభ్యులము. హమాలిపని, వ్యవసాయ కూలిపని చేస్తుంటాము. మా గ్రామములో వచ్చీరాని చదువుతో వున్న వాళ్ళు ఎక్కువ వున్నారు. చాలరోజులనుండి "సృజన" చదువాలనివుంది. ఒక సంవత్సరంనుండి చదువుతున్నాం. చాలమందితో చదివించటానికి ప్రయత్నించు చున్నాము. ఈ సంవత్సరము చందాలుకట్టించడం క్యాంపేయిన్‌గా తీసుకుంటున్నాము.

కాని చాలమంది "సృజన" చదివి ఏమిఅర్థంకావటంలేదు అంటున్నారు. నిజముగా సృజనలోవస్తున్న కవితలుకానీయండి, సాహిత్యపరమైన వ్యాసాలుకానివ్వండి ఎక్కువ మొత్తములో అర్థముకాకుండానే వున్నాయి. ఈ మధ్యకాలములో సృజన ఒక సాహిత్య చర్చావేదికగా తాయారైంది అనటంలో ఆశ్చర్యములేదు. అట్లాగే గ్రామీణ ప్రజల జీవితాలగురించి దాదాపు రావటంలేదు. వచ్చినా ఎప్పుడో ఒకచోట లెక్కలోనికిరానట్లుగా వస్తాయి. మా ఊరిలో ఎన్నో ప్రజాపంచాయతీలు నిర్వహించినాము. భూస్వాముల భూములుకూడ ప్రజలు సంఘటితపడి ఆక్రమించుకున్నారు. మా ప్రక్కఊర్లలో చాలచోట్ల కూలిపోరాటాలు, జీతగాళ్ళపోరాటాలు, భూపోరాటాలు, పోలీసునిర్బంధాలు, స్త్రీల మానభంగాలు ఎన్నో జరుగుతున్నాయి. వీటిగురించి సృజన అంతావెతికినా ఒకముక్కకూడ దొరుకదు

మా పల్లెటూరి జీవితాలగురించి, పోరాటాలగురించి, మాపై కొనసాగుతున్న నిర్బంధాలగురించి వ్రాసేకవులు తక్కువైనారో, ప్రచురించే పత్రికలులేవో తెలియదు. కాని మేము సృజనను ప్రజాపత్రిక అనుకుంటున్నాము. మాలాంటి పేద ప్రజానీకం చదుపుకునే పత్రికగా వుంటుందని ఆశిస్తున్నాము.

రాడికల్ యువజన సంఘం

13 ఆగస్టు 1983

రైతుకూలి సంఘం

భట్టుపెల్లి

2

మేము వడ్డేపల్లి రాడికల్ యువజన సంఘ సభ్యులము. మా గ్రామములో దాదాపు 40 సృజనలను పైగానే చదివే పాఠకులున్నారు. అయితే సృజనను మేధావుల దగ్గరినుండి, మామూలు అక్షరజ్ఞానమున్న పేదకూలీల వరకు చదువుతున్నారు.

సృజన చదువుతుంటే సాహిత్యం చర్చకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు కనబడుతున్నది. మీరు సాహితీమిత్రులు, కేవలం సాహిత్యచర్చతో, సాహిత్యసంబంధం ఉండీ ఆచరణతో సంబంధంలేని మేధావుల చర్చలకు ప్రాధాన్యత ఇవ్వడంవల్ల సృజన ఎక్కువగా మామూలు ప్రజానీకానికి అందుబాటులో లేకుండా ఉంది. దీని కన్న "అరుణతార" కాస్త నయమనిపిస్తుంది. మాకు తెల్సినవారు గ్రామాల్లో ఉండే ప్రజానీకం సృజన పత్రిక చందాకట్టాలని, చదువాలని [మన పత్రిక కాబట్టి] చందా కట్టడం, వారాపత్రిక వచ్చిన తర్వాత చదివితే అర్థంగాక నిరాశకు గురవుతున్నారు. సంపాదకుల మాటలుకూడా చాలా లోతుగా భావాన్ని వ్యక్తపరుస్తున్నట్టు కనబడుతుంది అలాగాక ఇంకా సులభశైలితో ఎక్కువ శాతంగా ఉన్న ప్రజలకు అర్థమయ్యేటట్లు చేసి కథలు, వ్యాసాలు, కవితలయితే పేజీల కొద్దిగాక చిన్న చిన్న కవితలు రోజు రోజు దేశంలో జరుగుతున్న పోరాటాల గురించి, సిద్ధాంతానికి అన్వయించి, కథల రూపంలో వ్రాస్తే బావుంటుంది. సృజన రాగానే అందులో కథ ఉంటే కథ చదివి తర్వాత సంపాదకీయం చదివి (అదీకాస్త కఠినంగా ఉన్నా) ప్రక్కకు పెట్టేస్తున్నారు.

జననాట్యమండలి వాళ్ళు ఇప్పటికి ప్రజల అభిమానం పొందిన కళారూపాలు చాలా ప్రచురించారు. కాని 'విరసం' నుండిగానీ, సృజన ప్రచురణ నుండిగాని ఏ ఒక్క మంచి పుస్తకం కూడా వెలువడలేదు. "కాలిమంటుకున్నది" నవల మరల ప్రింట్ చేయండి ప్రత్యేక సంచికలు అని వేసిన సృజనలల్లో సంపాదకీయం నుండి మొదలుకొని అన్ని పేజీలు వ్రాసినవారు వాళ్ళ తెలివినంతా అందులో ఇముడ్చు తున్నరు. అవి మాలాంటి కొద్దిపాటి చదువున్న యువకులకు అర్థంకాక చస్తున్నాం.

కాబట్టి సృజనను ప్రజల పత్రికగా ప్రచురించాలనుకుంటే లక్షలాది ప్రజలకు సాహిత్యపరంగా మీరు సేవచేయాలనుకుంటే భాష సులభతరంగా ఉండేటట్టుచేసి జనాదరణ పొందేట్టు చేయండి. అప్పుడు సృజన అప్పులతో నడువాల్సిన పనిఉండదు. సృజన పత్రిక అభిమానులంగా మేము అది ఎల్లకాలం కొనసాగేట్టు మా ఆర్థిక, హార్దికసహకారాలు ఎప్పుడు ఉంటాయి.

"కాలిమంటుకున్నది"లాంటి మంచినవలలు మరల ప్రింటుచేస్తే బావుంటుంది.

ఇట్లు
రాడికల్ యువజన సంఘం
వడ్డేపల్లి

19-9-83

1983 సూచిక

1983 లో సృజన ప్రచురణలు

కొనండి - చదవండి

బొగ్గు పొరల్లో

సింగరేణి కార్మికకథలు

తమ శరీరాల్లోంచి కొంచెంమాంసం- కొంచెంనెత్తురు-రోజూ తాగుతానంటున్న బొగ్గుబాయి- సైరన్‌కూత- పని చేసిచేసి పచ్చిపుళ్ళైన శరీరం- నరాల్ని నాడుల్ని- పిడికిట్లోపట్టుకుని ఒక్కసారిగా లాగుతున్నబాధ- ఆ నిద్రలోంచి లేవలేకనిద్ర- బయటిప్రపంచానికి కనిపించని నల్లని దోపిడిపొరల్లో బతికే 'డ్యూటీ'గామార్చబడ్డ జీవితాలు- కాగి- మరిగి- మండి- మూడువందల రైళ్ళను రద్దుచేయించి- భారతదేశచరిత్రలో కార్మికులశక్తిని నిరూపిస్తూ- రక్తంతో రికార్డుసృష్టించి- రివిజనిస్టు ట్రేడ్‌యూనియన్ల కలల్లోని ఆకాశసౌధాలను భస్మీపటలంచేసి- నూతనసమాఖ్య (సింగరేణి కార్మికసమాఖ్య)నూ కార్యకర్తలనూ సృష్టించుకొన్న పోరాటాలు- ఎర్రబడ్డఇనుము ఒక తునక నాగలికర్రై, మరోతునక సుత్తికొడవలి అయినట్టుగా- ఆ పోరాటాలు తమలోంచి రచయితల్నికూడా సృష్టించుకొన్నాయి. 'ప్రజలు తమకళల్ని తామే సృష్టించుకొంటారు' అనేసూక్తికి ప్రత్యక్ష తాజా ఉదాహరణ ఈ సంపుటి- అవి రాసింది ఒక్కరుకాదు- ఇద్దరుకాదు- వారికి పేర్లులేవు- ఉంటే వారిపేర్లు 'పోరాటం' 'కార్మికులు'- ఇవి బొగ్గుగని కార్మికులెందరోకలిసి చర్చించి సంయుక్తంగా రాసుకున్న వినూత్నసృష్టి- ఇవికథలు మాత్రమేకావు- వారి పోరాటాల చరిత్రసంకలనం— సింగరేణి కార్మికసమాఖ్య రెండోమహాసభల్లో విడుదలైంది.

ఇది కరీంనగర్ బుక్‌ట్రస్టువారి మూడవ ప్రచురణ

మా మొదటి రెండుప్రచురణలు సృజనాత్మక విప్లవ సాహిత్యంలో 'భూమి'లా విశాలమై 'బతుకుపోరు'లా నిరంతరం విస్తృతమౌతున్న ప్రశంసలతో తమ చారిత్రిక కర్తవ్యాల్ని నెరవేరుస్తూ రీప్రింటుకై పరుగెడుతున్నాయి.

మా నాల్గవ ప్రచురణగా **"పోరుబాటల్లో"** (కథలు)

వచ్చే జనవరిలో జరిగే విరసం సభల్లో విడుదల.

ఈ ట్రస్టులో 100 రూ॥ కట్టి మీరూ సభ్యులుగా చేరండి- ఏడాదికి రెండు చొప్పున వెలువడే మా ప్రచురణలను ప్రతిదీ 3 కాపీలు పొందండి- M.O. లు భాగ్యలక్ష్మి బుక్‌స్టాలు, పాతబస్టాండు, జగిత్యాల 505 327 కు పంపండి.

మా ప్రచురణలు దొరుకుచోటు : 1. సృజన, హన్మకొండ 2. పీస్ బుక్‌సెంటర్, హైదరాబాద్ 3. క్రాంతికార్ బుక్‌హౌస్ ఖమ్మం 4. జయంతి పబ్లికేషన్సు విజయవాడ. ఇంకా కరీంనగర్, గుంటూరు, నిజామాబాద్, విశాఖపట్నం, విజయనగరం, తిరుపతి కేంద్రాల్లోకూడా లభిస్తాయి.

ANA Telugu Monthly Nov. Dec. / '83 H/HNK
Regd. No. with Registrar of Newspapers 10953/67

కొత్త పుస్తకాలు

సృజన ప్రచురణ :

ఉద్యమం నెలబాలుడు – శివసాగర్ కవితాసంకలనం వెలుప్రతి 1

*విరసం ప్రచురణ : అగ్నికణం – అల్లం రాజయ్య నవల

పిడిసి ప్రచురణ : కొమురంభీం – సాహు, అల్లం రాజయ్య

క్రాంతి ప్రచురణలు :

యుద్ధం - శాంతి వివి లెనిన్

పార్టీ నిర్మాణం జె. వి. స్టాలిన్

ఆచరణ – మావో

నూతన ప్రజాస్వామికం – మావో

పార్టీలో తప్పుడు అభిప్రాయాలను సరిదిద్దుట – మావో

సోవియట్ పార్టీలేఖకు చైనాకమ్యూనిస్టుపార్టీ జవాబు(14 జూన్ 1963)

తెలుగుదేశంప్రభుత్వ ఫాసిస్టుదాడిని ప్రజలుసమైక్యంగా త్రిప్పికొట్టాలి!

లాంగ్‌మార్చ్ – చైనా కథలు

జననాట్య మండలి పాటలు (ఏప్రిల్ '83)

సిపిఐఎంఎల్ (పీపుల్స్‌వార్) ప్రచురణలు :

ఆధునిక రివిజనిస్టు డెంగ్ ముఠాకు వ్యతిరేకంగా పోరాడండి

"విమోచన" పార్టీ నాయకత్వపు మితవాద అవకాశవాద

దివాళాకోరు రాజకీయాలను ఓడించండి

ఇతర ప్రచురణ :

తెలంగాణ విమోచనోద్యమం - తెలుగు నవల - వరవరరావు సాదాప్రతి 3

లైబ్రరీప్రతి 5

ప్రతులకు :

1. పీస్‌బుక్ సెంటర్, 4-5-421 సుల్తాన్‌బజార్, హైదరాబాద్-500 001.
2. సృజన, హనుమకొండ - 506 001.

* వి. వెంచయ్య, 6-5-13, పిన్నంరాజువారివీధి, కావలి-524 201

పిఎస్ఆర్ ప్రసాద్, సి-108, శ్రీనివాసనగర్ కాలని, గుంటూరు.

వద్ద కూడ దొరుకుతుంది.